అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 12-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 71
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

అమల్లోకి సీఏఏ...



పంతం నెగ్గించుకున్న బీజేపీ
సార్వత్రిక ఎన్నికలకు ముందు తేవటం
ఓటు రాజకీయమే : ప్రతిపక్షాలు

కేరళలో అమలుచేయం.. సీఎం విజయన్
వివరాలు 13లో

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు ముందే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను అమల్లోకి తీసుకుని వస్తామని చెప్పిన బీజేపీ చివరికి ఆ విధంగానే చేసింది. ఈ చట్టంపై పిటీషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నా, ఈ చట్టానికి ...13లో


మణుగూరు ప్రజా దీవెన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మోడీని కడుగుతాం..
కేడీని ఉతుకుతాం

మేం గేట్లు తెరిస్తే బీఆర్‌ఎస్‌లో ఎవరూ ఉండరు..

'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు గులాబీ ఎమ్మెల్యేలు సిద్ధం . బీజేపీ, బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం. మా ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్రలు . ఏటా 2కోట్ల ఉద్యోగాలన్న మోడీ.. ఎన్నిచ్చాడు.. .రైతులను బలిగొన్నాడు . ఇందిరమ్మ ప్రభుత్వం మాట ఇస్తే తప్పదు . రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నాం.'
- ప్రజా దీవెన సభల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

భద్రాచలం, మణుగూరులో ఇందిరమ్మ ఇండ్ల పథకం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి :
మోడీని కడుగుతాం.. కేడీని (కేసీఆర్) ఉతుకుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు పన్నుతున్నాయని, తమ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. మేం గేట్లు తెరిస్తే బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ కుటుంబ సభ్యులు తప్ప ఎవరూ ఉండరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు గులాబీ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి కాంగ్రెస్ 14 స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, మణుగూరులో సోమవారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం, ప్రజా దీవెన సభల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది ...6లో

ఎస్‌బీఐకి సుప్రీం షాక్

నేటి సాయంత్రానికి ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వాల్సిందే

- 26 రోజులు ఏం చేశారు?
- గడువు పొడిగించే ప్రశ్నే లేదు
- ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవు
- 15న వెబ్‌సైట్‌లో ఉంచాలని ఈసీకి ఆదేశం



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల వివరాలు అందజేసేందుకు జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలని కోరుతూ ఎస్‌బీఐ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. గడువు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. తాను ఆదేశాలు జారీ చేసి 26 రోజులు గడిచాయని, ఇప్పటి వరకూ ఏం చేశారని నిలదీసింది. మంగళవారం బ్యాంక్ పనివేళలు ముగిసే లోగా ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సిందేనని తీర్పు ఇచ్చింది. ఎస్‌బీఐ ఇచ్చిన వివరాలను ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల ...13లో

ఎలనాగకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం

24 భాషల్లో అవార్డులు ప్రకటన



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
కరీంనగర్ కు చెందిన ప్రముఖ రచయిత, కవి, అనువాదకులు, భాషావేత్త నాగరాజు సురేంద్ర (ఎలనాగ)కు ప్రతిష్టాత్మకమైన సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం దక్కింది. 2023కు గాను తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మళయాళం, తమిళ్, నేపాలీ, ఉర్దూ, ఒడిశా వంటి ఇతర భాషల్లో ...13లో

సత్తాచాటిన ఓపెన్ హైమర్..

అట్టహాసంగా ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం


ఉత్తమ నటి : ఎమ్మాస్టోన్
ఉత్తమ నటుడు : కిలియన్ మర్ఫీ

లాస్ ఏంజెల్స్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూసిన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ తెరకెక్కించిన బయోగ్రాఫికల్ థ్రిల్లర్ ఓపెన్‌హైమర్ సత్తా చాటింది. 14లో..

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు



నవ తెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి
స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మన్నె జీవన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మెన్ ఆనంద్‌గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ తదితరులతో కలిసి జీవన్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.
బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ ...13లో


హైదరాబాద్‌లోని గన్ ఫౌండ్రీ ఎస్‌బీఐ కార్యాలయం ముందు ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య.

ప్రజల బ్యాంకా..బీజేపీ బ్యాంకా..?

సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న ఎస్‌బీఐ

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలి :రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌బీఐ బ్రాంచీల ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ-సిటీబ్యూరో / సుల్తాన్‌బజార్/విలేకరులు
"రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే బహిర్గతం చేయాలి.. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ ధిక్కరిస్తోంది. ప్రజల బ్యాంకుగా కాకుండా బీజేపీ బ్యాంకుగా వ్యవహరిస్తోంది..

బ్యాంకు మేనేజర్లకు వినతులు

అన్ని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకున్నట్టు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్‌బీఐని కూడా పెట్టుకుంది.. మోడీ తప్పులను.. బీజేపీ అవినీతిని కప్పి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అంటూ సీపీఐ(ఎం) నేతలు విమర్శించారు. ఎస్‌బీఐ చర్యను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఆ పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నరసన కార్యక్రమాలు చేపట్టారు. బ్యాంకు మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. హైదరాబాద్‌లోని గన్ ఫౌండ్రీ ఎస్‌బీఐ కార్యాలయం ముందు ధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డిజి.నర్సింహారావు ...3లో

నిషేధిత భూముల్ని కేసీఆర్ కుటుంబం
దోచుకుంది

పార్ట్‌బి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్లు



మాజీ ఎంపీ సంతోష్ కుటుంబంతో సహా పలువురి ప్రమేయం

- త్వరలో ఆధారాలు బయట పెడతాం : ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి
- ధరణి స్పెషల్ డ్రైవ్ 17 వరకు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
కేసీఆర్ కుటుంబం ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని నిషేధిత భూములను కొట్టేసిందని ధరణి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు కోదండరెడ్డి ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని ...6లో

ఢిల్లీకి ఆదిలాబాద్ పంచాయితీ

బీజేపీ నేతల మధ్య ముదిరిన లొల్లి



- నగేశ్ చేరికతో రమేశ్‌రాథోడ్ గరంగరం
- టికెట్ లంబాడీలకే ఇవ్వాలని పట్టు
- చివరకు తనకే సీటన్న ధీమాలో సిట్టింగ్ ఎంపీ సోయం
- ఎంపీ అభ్యర్థిత్వంపై ఎమ్మెల్యేల మధ్య భిన్నాభిప్రాయాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలోనే కాదు ఆదిలాబాద్‌లోనూ బీజేపీ నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నది. బీజేపీలో నగేశ్ చేరికను వ్యతిరేకిస్తూ పంచాయితీ ఢిల్లీకి చేరింది. రమేశ్‌రాథోడ్ నేతృత్వంలోని బృందం ఆదివాసీలకు కాకుండా లంబాడీలకే సీటివ్వాలనే డిమాండ్‌ను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లింది. ఆ పార్లమెంటరీ స్థానం పరిధిలో బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా..ఒక్కొక్కరు ఒక్కొక్కరికి మద్దతిస్తున్నారనే ప్రచారముంది. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వాన్ని తేల్చడం ఆ పార్టీ అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది. కరవమంటే కప్పకు కోపం విడమంటే పాముకు కోపం అన్న చందంగా ఒకరికి సీటిస్తే మరొకరు సహకరించని పరిస్థితి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో నెలకొంది.
మాజీ ఎంపీ నగేశ్‌కు ఆదిలాబాద్ సీటును బీజేపీ అధిష్టానం కేటాయిస్తుందన్న ప్రచారంతో ఇప్పటిదాకా తమకే సీటు అన్న ధీమాతో ఉన్న నేతల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు రమేశ్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు ఢిల్లీకి వెళ్లారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోశ్, బీజేపీ పార్లమెంట్ కమిటీ బోర్డు మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కాకుండా, మొదటి నుంచీ పార్టీ కోసం పని చేస్తున్న వారికి లోక్ సభ టికెట్ ఇవ్వాలని అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్రంలో 8 శాతం మంది లంబాడీలున్నారనీ, ...13లో



నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

నెలవంక దర్శనం

- ముస్లింలకు సీఎం శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం నుంచి నెలరోజులపాటు రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వారి పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్‌మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, క్రమశిక్షణ ...13లో

ఫ్యూచర్..కన్ఫ్యూజన్..!

బీజేపీలోకి వెళ్లలేక..కాంగ్రెస్ రానివ్వక..



- అంతర్మథనంలో మామ, అల్లుడు
- కాంగ్రెస్‌తో రాజీకి మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి
- ఇద్దరు ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకమే..!



'పాలు అమ్మినా.. పూలు అమ్మిన.. మెడికల్ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలు పెట్టిన.. ఏడాదికి వేలాది మందిని డాక్టర్లు, ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్న.. నా కష్టమే దీనంతటికీ కారణం'.. ఈ మాటలు ఎక్కడో విన్నట్టు ఉంది కదా.. వినే ఉంటారు. సాక్ష్యాత్తు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి. దాదాపు దశాబ్దం పాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను ఏలిన మల్లారెడ్డి ఇప్పుడు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలపై విరుచుకుపడ్డ ఆయన పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్నట్టుగా తయారైంది. బీఆర్‌ఎస్‌లో ఉండలేక.. బీజేపీలోకి వెళ్లలేక.. కాంగ్రెస్ వారు రానివ్వకపోవడంతో మేడ్చల్, మల్కాజిగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఫ్యూచర్ కన్ఫ్యూజన్‌లో పడింది. అక్రమ ఆస్తులు, కబ్జా భూములను ఎలా కాపాడుకోవాలో తెలియక మామ, అల్లుడు అంతర్మథంలో పడ్డారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో
అధికారంలో ఉంగా కాంగ్రెస్ పార్టీని, అప్పటి మల్కాజిగిరి ఎంపీ, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో దూషణకు మల్లారెడ్డి సై అంటే సై అన్నారు. ఇప్పుడు అనుహ్యంగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయ్యింది. రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగానే భూ కబ్జాలపై ఫోకస్ పెట్టడంతో మల్లారెడ్డి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మల్లారెడ్డితోపాటు ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి భూ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి. చివరికి లోక్‌సభ బరి నుంచి తప్పుకుని మరీ కాంగ్రెస్‌తో ...13లో

టీవీవీపీ నర్సింగ్ ఆఫీసర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలి



తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, అధ్యక్షులు మహ్మద్ ఫసియొద్దీన్, ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్, రాష్ట్ర నాయకురాలు భూలక్ష్మి నేతృత్వంలో పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. పరిషత్‌లో అనేక సంవత్సరాల నుంచి పదోన్నతుల కల్పన పెండింగ్‌లో ఉందని వారు గుర్తుచేశారు. 1998 నుంచి వివిధ బ్యాచ్‌లకు నియమితులై 25 ఏండ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి సైతం చిన్న, చిన్న కారణాలు, కోర్టు కేసుల పేరుతో ప్రమోషన్స్ ఇవ్వకపోవడంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో కేసుకు సంబంధించి 2021 నవంబర్‌లో ఉత్తర్వులు ఇస్తూ ఆ కేసును డిస్పోజ్ చేసిందని తెలిపారు. ఆ ఉత్తర్వుల్లో ఎనిమిది వారాల్లో రిప్రజంటేషన్‌ను పరిష్కరించాలని పేర్కొన్నట్టు చెప్పారు. పదోన్నతులపై ఎలాంటి స్టే ఆర్డర్లు లేకపోయినా, కోర్టు కేసు ఉందని చెప్పి పిటిషన్స్ పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులకు నష్టం కలిగించారని చెప్పారు. దీంతో రిట్ పిటిషన్ దారులు ఉత్తర్వుల ఉల్లంఘన కేసును 2023 ఫిబ్రవరిలో వేశారనీ, అయినప్పటికీ స్పందించలేదని తెలిపారు. వైద్య విధాన పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకుని ప్రమోషన్స్ కు వెళ్లకుండా కాలయాపన చేశారన్నారు. దీంతో ఉద్యోగులకు న్యాయం జరగకపోగా, కేసుల పేరుతో లక్షల రూపాయలు ఆర్థికగా నష్టపోయారని తెలిపారు. కేసులన్నీ ఉపసంహరించుకుంటేనే పదోన్నతులు కల్పిస్తామనడంతో ఉద్యోగులకు నష్టం జరుగుతుందని వివరించారు.

నర్సింగ్ ఆఫీసర్ల పదోన్నతులపై హైకోర్టు నుంచి ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు లేనందున స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకుని 1998, 1999, 2001, 2006 ఆ తర్వాత బ్యాచ్‌లకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షులు బలరాం, నర్సింగ్ ఆఫీసర్లు భూలక్ష్మి లక్ష్మి, సువర్ణ, శోభ, రోహిణి దేవి, నాయకులు బైరపాక శ్రీనివాస్ ఉన్నారు.

ఐక్యపోరాటాలు చేయాలి



వైద్యారోగ్యశాఖ మహిళా ఉద్యోగుల అభినందన సభలో ఎస్వీ రమ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో మహిళా ఉద్యోగులు ఐక్య పోరాటాలు చేయాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ఫసియొద్దీన్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ మహిళా దినోత్సవం ఏర్పాటుకు దారి తీసిన పరిణామాలను వివరించారు.

యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల పదోన్నతులు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగుల రెగ్యులరైజేషన్, మెటర్నిటీ లీవులు, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలు, జీవో నెంబర్ 317 ద్వారా వచ్చిన సమస్యలు, జీవో నెంబర్ 142 రద్దు, వైద్య విధాన పరిషత్ అటానమస్ రద్దు తదితర సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కె.బలరామ్, బైరపాక శ్రీనివాస్, ఆరోగ్య మిత్రల రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య నర్సింగ్ ఆఫీసర్లు భూలక్ష్మి, సువర్ణలత, రోహిణీదేవి, ట్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, సరళ, బాలునాయక్, ఏఎన్ఎం నాయకురాలు సరోజ తదితరులు మాట్లాడారు.

నర్సింగ్ క్యాడర్ సబ్ కమిటీ ఎన్నిక

వైద్యారోగ్యశాఖలోని నర్సింగ్ ఆఫీసర్లు, హెడ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, ట్యూటర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం సమావేశంలో నర్సింగ్ క్యాడర్ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా వి.భూలక్ష్మి, కో కన్వీనర్‌గా సువర్ణలత, లక్ష్మి సరళతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

రాగులపెల్లి లక్ష్మి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ జన సమితి మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు రాగులపెల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెంటనే మహిళా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా జన సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలోనూ మహిళల పరిస్థితి మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఉపాధి కోసం ప్రత్యేకంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనీ, మహిళలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలనీ, వారిపై హింస జరగకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ లక్ష్మి, ప్రొఫెసర్ అంజలీదేవి, డాక్టర్ సాజిదా ఖాన్, మహిళా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అరికిల్ల స్రవంతి, గీతాంజలి, శాంతబాయి, రేఖ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడండి

- గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టుపై ఎన్‌డబ్లూడీఏకు లేఖ
- 74 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని జాతీయ నీటి అభివృద్ధి అథారిటీ(ఎన్‌డబ్ల్యూడీఏ)కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ కంటే తమిళనాడు, కర్నాటకకు అధిక ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేసింది. ఈ ప్రాజెక్టు నుంచి 74 శాతం వాటా జలాలను తెలంగాణకు కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈమేరకు ఇటీవల రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్‌కు లేఖ రాస్తూ ప్రాజెక్టు, దాని పరిస్థితి, తెలంగాణపై పడే ప్రభావాన్ని తెలియజేశారు. ఇచ్చంపల్లి దగ్గర 87 ఎఫ్ఆర్ఎల్ బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదన ఉందనీ, దీంతో తెలంగాణకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సమ్మక్కసాగర్, తుపాకులగూడెం బ్యాక్‌బాటర్ ద్వారా మేడిగడ్డపై ప్రభావం పడుతుందన్నారు. 5800 ఎకరాలకుపైగా ముంపుకుగురయ్యే ప్రమాదముందన్నారు. భూసేకరణ, పునరావాస సమస్యలు ఉత్పన్నమవుతాయనీ, వాటిని పరిష్కరించాల్సి ఉంటుందని వివరించారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలపై గోదావరి-కావేరి లింక్ ప్రాజెక్టుతో ప్రభావం ఉంటుందన్నారు. డీపీఆర్‌లో తెలంగాణకు ఎక్కువ ప్రయోజనాలు ఉన్నట్టుగా చూపారని, అది సరికాదన్నారు. నదుల అనుసంధానానికి అభ్యంతరం లేదనీ, ఆపేరు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగనివ్వబోమని లేఖలో స్పష్టం చేశారు.

నేడు హైదరాబాద్‌కు అమిత్‌షా

- సోషల్‌మీడియా వారియర్స్, పోలింగ్ బూత్ సమ్మేళనాలకు హాజరు
- 16,18,19 తేదీల్లో ప్రధాని మోడీ రాక!

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణపై బీజేపీ ఫోకస్ పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీతో సంబంధమున్నా లేకున్నా ఆర్థిక, అంగబలమున్న నేతలను బరిలోకి దింపుతున్న ఆ పార్టీ..రాష్ట్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా వరుసగా కీలక నేతల పర్యటలను తలపెడుతున్నది. అందులో భాగంగానే ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌సా పదేపదే రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. వారం వ్యవధిలోనే వారిద్దరూ ఐదు సభలను కవర్ చేసేలా ఆ పార్టీ అధిష్టానం రూట్‌మ్యాప్ రూపొందించింది. అందులో భాగంగానే కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నెల 15 నుంచి 19 తేదీ వరకు ప్రధానమంత్రి మోడీ దక్షిణభారత్‌లో పర్యటించనున్నారని తెలిసింది. 16,18,19 తేదీల్లో మన రాష్ట్రంలోని కరీంనగర్, మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో బీజేపీ తలపెట్టిన బహిరంగ సభల్లో పాల్గొనే అవకాశముంది. మంగళవారం అమిత్‌షా హైదరాబాద్‌లో నిర్వహించనున్న రెండు మీటింగ్‌లలో పాల్గొంటారు. తొలుత సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే బీజేపీ సోషల్‌మీడియా వారియర్స్ మీటింగ్‌లో పాల్గొంటారు. తదనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించే పోలింగ్ బూత్ సమ్మేళన్ మీటింగ్‌కు హాజరవుతారు. ఎల్బీ స్టేడియంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు, పార్టీ ఆఫీస్ బేరర్లతో సమావేశం అవుతారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచేందుకు పోల్‌మేనేజ్‌మెంట్ ఎలా చేయాలి? కొత్త ఓటర్లను ఎలా ఆకర్షించాలి? ప్రతి బూత్‌లోనూ ఓటర్లను సమీకరించేందుకు అనుసరించాల్సిన ఎత్తుగడలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న వ్యూహాల గురించి అమిత్‌షా చెప్పే అవకాశముంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిన నిధులు, పలు పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

పెండింగ్ డబ్బులు తక్షణమే చెల్లించాలి :ఆశా యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాలకు ఫిబ్రవరి నెల పారితోషికం, లెప్రసీ సర్వే పెండింగ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి ఆధ్వర్యంలో నాయకులు వైద్యారోగ్యశాఖ కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. లెప్రసీ ఎల్‌సీడీ సర్వేలో వస్తున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా రెండో తేదీన పారితోషికాలు చెల్లించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మార్చి 11 నుంచే లెప్రసీ సర్వే చేయాలని చెబుతున్న అధికారులు దానికి సంబంధించిన మెటీరియల్, సర్వే ఫామ్స్ ఆశాలే డబ్బులు పెట్టి కొనుక్కోవాలని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. మగవారిని చెక్ చేసేందుకు సర్వేలో మేల్ వర్కర్ ను పెట్టుకోవాలా? వద్దా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదని చెప్పారు.

2022, 2023 సంవత్సరాల్లో లెప్రసీ సర్వేకు సంబంధించి హైదరాబాద్, పెద్దపల్లి, నల్లగొండ, ఆదిలాబాద్, హనుమకొండ, సంగారెడ్డి, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల అధికారులు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. అవి చెల్లించకుండా మళ్లీ సర్వే చేయాలనడం సరికాదనీ, ఆ డబ్బులను తక్షణే చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వే ఫామ్స్ అందజేయాలనీ, సర్వే పని గంటలను కూడా మార్చాలని సూచించారు. ఎల్‌సీడీ ఆన్‌లైన్ సర్వే ఆశాలతో చేయించకూడదని నిర్దిష్టంగా మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.

16న పరీక్ష నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్లు

- డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లను మినహాయించాలి : టీఎస్‌జీసీఓఈఎఫ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సాధారణ పరిపాలనా శాఖలో ఈ నెల 16న తలపెట్టిన పరీక్ష నుంచి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లను మినహాయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేశ్, జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, కార్యదర్శి జె.కుమారస్వామి డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోమవారం వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికి కుమారికి వినతిపత్రం అందజేశారు. 20 ఏండ్లుగా 100 మందికిపైగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, మైక్రోసాఫ్ట్ ఆఫీసులో నైపుణ్య పెంపుదల కోసం పరీక్ష పెట్టడం వల్ల తమకు భద్రత ఉండదనే ఆందోళనలో వారు ఉన్నారని తెలిపారు. సుదీర్ఘకాలంగా సమర్థవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ సిబ్బంది అనుభవాన్నే నైపుణ్యానికి ప్రామాణికంగా పరిగణించాలని కోరారు.

పంట నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి

రెండు లక్షల రుణమాఫీపై ప్రకటన చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్



నవతెలంగాణ -మిర్యాలగూడ

నీళ్ల లేక ఎండిపోయిన పంట పొలాలకు సంబంధించి వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అనుదితి ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు లేక నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో వరి పొలాలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. మిర్చి పంటకు తెగుళ్ల వచ్చి దెబ్బ తిన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పంటల వివరాలు సేకరించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని, నీటి విడుదలకు అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఆరోపించారు. దూర దృష్టి లేకపోవడంతోనే పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న రైతు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కౌలు రైతుల విషయంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వారిని ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రైతులందరూ ఎదురుచూస్తున్న రెండు లక్షల రుణమాఫీని ఎప్పుడు అమలు చేస్తారో తేదీని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటకు మంచి ధర కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. ఎన్నికల బాండ్ల విషయంలో ఎస్‌బీఐ వైఖరి సరైంది కాదని, తక్షణమే వివరాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఏఏ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కమిషనర్ రాజీనామా, ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కోసమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను అమలు చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. సీఏఏ ద్వారా ప్రజల దైనందిన సమస్యల నుంచి పక్కదారి పట్టించి మత ఆధారంగా లౌకిక భారత సమాజాన్ని విభజించి వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీజేపీ చూస్తోందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయనీ, మైనార్టీలను ప్రధాన స్రవంతి నుంచి వేరుచేసి ద్వితీయ శ్రేణులుగా మార్చే ప్రమాదకర ఎత్తుగడ ఇందులో ఇమిడి ఉందని పేర్కొన్నారు. తక్షణమే సీఏఏను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ఐదు 'గ్యారంటీ'లతో ముందుకొచ్చిన కాంగ్రెస్

యువ ఓటర్ల మొగ్గు ఎటు?



నిరుద్యోగమే ప్రధాన సమస్య

- విదేశాలకు వలస బాట పడుతున్న యువత
- యుద్ధ భూమికి వెళ్లేందుకు సైతం సిద్ధం

షెడ్యులు విడుదల కాకపోయినా సార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించేశాయి. సబ్సిడీలు, పథకాలకు ప్రధాని 'గ్యారంటీలు' ఇస్తుంటే దీనికి ప్రతిగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఐదు గ్యారంటీలు ఇచ్చింది. అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల పోస్టులను భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.8,500 స్టైఫండుతో సంవత్సరం పాటు అప్రెంటీస్‌షిప్ అందిస్తామని, పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టేందుకు చట్టాన్ని తీసుకొస్తామని, సేవల రంగంలో తాత్కాలిక ఉద్యోగాలు చేస్తున్న వారికి సామాజిక భద్రత కల్పిస్తామని, ఐదు వేల కోట్ల రూపాయలతో యువ రోష్నీ పేరిట జాతీయ నిధిని ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో స్టార్టప్‌ల ఏర్పాటుకు చేయూత అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. సైనిక దళాలలో నియామకాల కోసం మూడు సంవత్సరాల కాంట్రాక్ట్ పద్ధతిలో మోడీ ప్రభుత్వం ప్రారంభించిన అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని కూడా ప్రకటించింది.

న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారం కోసం ఎన్‌డీఏ, ఇండియా కూటములు శాయశక్తుల ప్రయత్నిస్తున్నాయి. అయితేఎక్కువ సంఖ్యలో ఉన్న యువ ఓటర్లను ఆకట్టుకోవడానికి గాలం వేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో నిరుద్యోగ సమస్య నిర్మూలనపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఈ హామీలను బట్టి అర్థమవుతోంది. ఇటీవలి కాలంలో దేశంలో సరైన ఉపాధి లభించక పలు దేశాలకు అక్రమంగా వలస వెళుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్ నుండి చట్టవిరుద్ధంగా వలస వచ్చే వారి సంఖ్య పెరిగిపోతోందని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సమాచారం చెబుతోంది. 2018-19లో భారత్ నుండి 8,027 మంది, 2019-20లో 1,227 మంది, 2020-21లో 30,662 మంది, 2021-22లో 63,927 మంది, 2022-23లో 96,917 మంది అక్రమంగా వలస వచ్చారని అమెరికా అంచనా వేసింది. అమెరికాలో మంచి జీతాలు లభిస్తాయన్న ఉద్దేశంతో నిరుద్యోగ యువత అక్రమంగా ఆ దేశం బాట పడుతోంది.

ప్రాణాలకు తెగించి యుద్ధ భూమికి...

పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదంటే నిరాశా నిస్పృహలకు లోనవుతున్న యువత చివరికి తమ ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధ భూమికి వెళ్లేందుకు కూడా వెనుకాడడం లేదు. దాదాపు 800 మంది యువకులు గత సంవత్సరం డిసెంబరులో ఇజ్రాయిల్ వెళ్లారు. ఇంకా పలువురు యువకులు అందుకోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఇజ్రాయిల్‌పై హమాస్ దాడుల తర్వాత 80 వేల మంది పాలస్తీనీయులు ఉద్యోగాలు కోల్పోయారు. వీరి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇతర దేశాలకు చెందిన యువకులను ఇజ్రాయిల్ నియమించుకుంటోంది. ఇలా యుద్ధ భూమికి వెళ్లిన యువకులు సురక్షితంగా తిరిగి వస్తారని ఎవరూ గ్యారంటీ ఇవ్వలేరు. కేరళకు చెందిన ఓ యువకుడు వలస వెళ్లిన రెండు నెలలలోనే ఓ ఇజ్రాయిల్ వ్యవసాయ క్షేత్రంపై జరిగిన క్షిపణి దాడిలో చనిపోయాడు. యువత ప్రాణాలకు ముప్పు ఉన్నదని తెలిసి కూడా హర్యానా, రాజస్థాన్, బీహార్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, మిజోరం రాష్ట్ర ప్రభుత్వాలు ఇజ్రాయిల్ కోసం నియామక ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. ఉక్రెయిన్‌లో పోరాడేందుకు మన దేశానికి చెందిన పలువురు యువ కులు 2022లో అంతర్జాతీయ దండులో చేరారు. 'సైనిక భద్రతా సహాయకులు'గా నియమితులైన సుమారు వంద మందిని రష్యా సైనికులతో కలిసి పోరాడేలా బలవంతం చేశారు. వీరిలో హైదరాబాదుకు చెందిన మహమ్మద్ అఫ్సన్ యుద్ధంలో చనిపోయాడు. ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం తన ప్రభుత్వం నిరుద్యోగులను ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటు న్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కొందరు యువతకు నియామక పత్రాలు అందజేస్తూ అదేదో గొప్ప ఘనకార్యంగా చెప్పుకుంటున్నారు.

లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే ప్రకారం...

గత సంవత్సరం ఆగస్టులో విడుదలైన లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే ప్రకారం 15-34 సంవత్సరాల మధ్య వయసున్న భారతీయుల్లో 36 శాతం మంది తమను వేధిస్తున్న ప్రధాన సమస్య నిరుద్యోగమేనని తెలిపారు. నిరక్షరాస్యుల్లో 27 శాతం నిరుద్యోగం ఉంటే పట్టభద్రులు, ఆపై విద్యను అభ్యసించిన వారిలో అది 40 శాతంగా ఉంది

తొలిసారి ఓటేస్తున్న యువత

2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో యువ ఓటర్లు బీజేపీకి మద్దతు తెలిపారు. ఈ సంవత్సరం కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్న వారిపై అన్ని పార్టీలు దృష్టి కేంద్రీకరించాయి. పశ్చిమ బెంగాల్‌లో 1.13 మిలియన్లు, ఒడిషాలో 0.75 మిలియన్లు, మహారాష్ట్రలో 1.02 మిలియన్లు, కేరళలో 0.17 మిలియన్లు, బీహార్‌లో 0.78 మిలియన్లు, ఆంధ్రప్రదేశ్‌లో 0.53 మిలియన్లు, కర్నాటకలో 1.03 మిలియన్లు, తమిళనాడులో 0.53 మిలియన్ల మంది ఓటర్లు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొనే కాంగ్రెస్ పార్టీ తన ప్రచారంలో యువతపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. వారిపై వరాల జల్లులు కురిపిస్తోంది.

నివేదికలు సైతం...

ప్రపంచబ్యాంక్ నివేదిక ప్రకారం 2022లో భారత్‌లోని యువతలో నిరుద్యోగం 23.22 శాతంగా ఉంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్‌లో కంటే అది ఎక్కువ. 2022-23లో దేశంలోని యువతలో నిరుద్యోగ రేటు 45.4 శాతంగా ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సంస్థ అంచనా వేసింది. దేశంలోని నిరుద్యోగ రేటు (7.5 శాతం) కంటే ఇది ఆరు రెట్లు అధికం. ప్రభుత్వ నివేదిక కూడా నిరుద్యోగ సమస్యను ఎత్తిచూపుతోంది. పట్టణ ప్రాంతాలలో 15-29 సంవత్సరాల మధ్య వయసున్న యువతలో నిరుద్యోగ రేటు 17.3 శాతంగా ఉన్నదని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (2023 జులై-సెప్టెంబర్) తెలిపింది. అధికారిక నిరుద్యోగ రేటు (6.6 శాతం) కంటే ఇది మూడు రెట్లు ఎక్కువ.

నిరసనలు...ఆందోళనలు

నిరుద్యోగ సమస్యతో విసిగివేసారిన యువత నిరసనలకు దిగుతున్నారు. ఉత్తరాదిన అగ్నివీర్ పథకాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులో జరిగిన కుంభకోణంపై ఉత్తరప్రదేశ్, బీహార్‌లో నిరసనలు మిన్నంటాయి. నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఇద్దరు యువకులు డిసెంబర్ 13న పార్లమెంటులో ప్రవేశించి హల్‌చల్ సృష్టించిన విషయం తెలిసిందే. నియామక పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలపై కూడా యువత ఆందోళనలకు దిగుతోంది. ఈ లీకేజీల కారణంగా గత ఐదు సంవత్సరాలలో 15 రాష్ట్రాలలో లక్షకు పైగా ఉద్యోగాల్లో నియామకాలు నిలిచిపోయాయి. 1.4 కోట్ల మంది అభ్యర్థులు పరీక్షలు రాయలేకపోయారు.



మంత్రులకు అవమానం

భట్టి, సురేఖకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ -నల్లగొండ టౌన్

యాదాద్రి దేవాలయంలో ఇద్దరు మంత్రులకు తీవ్ర అవమానం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాదాద్రి ఆలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, మంత్రి కొండా సురేఖను తక్కువ ఎత్తులో కూర్చోబెట్టి సీఎం రేవంత్ రెడ్డి అవమానపరిచారని అన్నారు. మంత్రులకు గుట్టలో జరిగిన అవమానకర ఘటన చరిత్రలో మర్చిపోలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హోదాలో సామాజిక అంశాలలో ప్రాధాన్యత కల్పించాల్సిన మంత్రులను తక్కువ ఎత్తులో కూర్చోబెట్టి అవమానించారన్నారు. గతంలో అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తే.. అప్పుడు కూడా దళితునికి వినతిపత్రం ఇచ్చారని రేవంత్‌రెడ్డి అవమానించారని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ చైర్మెన్ గట్టు రామచందర్‌రావు, నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్, బీసీ నాయకులు జూలూరి గౌరీ శంకర్, రాజారాం యాదవ్, బొల్లా శివకుమార్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

గిరిజన హక్కులను కాపాడుకుందాం

- మార్చి 20న గిరిజన హక్కుల గర్జన : తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. ధర్మనాయక్, ఆర్. శ్రీరాం నాయక్
- గోడ పత్రిక విడుదల



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజ్యాంగంలో కల్పించబడిన గిరిజన హక్కులను కాపాడుకుందాం.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం.. నినాదాలతో గిరిజన హక్కుల గర్జన చేపడుతున్నట్టు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మనాయక్, ఆర్.శ్రీరాంనాయక్ అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ ఠానూ నాయక్ 74వ వర్ధంతి సందర్భంగా మార్చి 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే గిరిజన హక్కుల గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గర్జనకు సంబంధించిన గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమావత్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గిరిజన సమస్యలను రాజకీయ పార్టీల అజెండాలోకి తీసుకురావడం కోసం "గిరిజన హక్కులకై గర్జన" పేరుతో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ఆదివాసీ, గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, మేధావులు పాల్గొంటున్నారని తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనుల ప్రత్యేక హక్కులు, చట్టాలను కాలరాసేందుకు సిద్ధపడిందని ఆరోపించారు. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 1/70 చట్టం, పెసా చట్టాలను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006కు నీరుగారుస్తూ బీజేపీ ప్రభుత్వం గత డిసెంబర్‌లో అటవీ సంరక్షణ నియమాలు -2023 పేరుతో కొత్త చట్టం చేసిందని విమర్శించారు. దీని వల్ల అడవులు, అటవీ సంపదను అంబానీ, అదానీలాంటి బడా కార్పోరేట్లు లూటీ చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు.

ఎం.ధర్మనాయక్ మాట్లాడుతూ.. దేశంలో పెరిగిన గిరిజన జనాభా ప్రకారం 7 శాతం నుంచి 12 శాతానికి గిరిజన రిజర్వేషన్స్ పెంచకుండా అగ్రవర్ణ పేదల పేరుతో 10శాతం పెంచిందన్నారు. గిరిజన తెగల భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చడం లేదని, తెలంగాణలో పెంచిన 10 శాతం గిరిజన రిజర్వేషన్ జీ.ఓ. 33ను 9వ షెడ్యూల్ చేరుస్తామని హామీనిచ్చి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. వేలాదిమంది గిరిజన యువతకు ఉపాధి కల్పించే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడం అవకాశవాదానికి నిదర్శనమన్నారు.

గిరిజనులకు 80 శాతం ప్రవేశాల రిజర్వేషన్ కల్పిస్తూ ఏర్పాటు చేయాల్సిన యూనివర్సిటీని 7 శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయం అన్నారు. యురేనియం తవ్వకాలతో నల్లమల అడవులను ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గిరిజనులు గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంతోనే గిరిజన హక్కుల గర్జన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలు నాయక్, రమావత్ పాండు నాయక్, వి.రామ్ కుమార్, గోర్యా నాయక్, సభావట్ పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బ్యాంకా..

బీజేపీ బ్యాంకా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అవినీతిని కాపాడేందుకు బాండ్ల వివరాలు దాచిపెడుతున్నారని అన్నారు. బీజేపీకి వివిధ సంస్థలతోపాటు అనేక మార్గాల్లో వచ్చిన బాండ్ల వివరాలు, లెక్కలు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐ బ్యాంక్‌ను కోరినా ఇవ్వకుండా వాటిని దాచిపెడుతోందని విమర్శించారు. ప్రతిరోజూ దేశవ్యాప్తంగా ట్రాన్స్‌ఫర్ అవుతున్న లెక్కలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌లో క్లియర్‌గా ఉంటాయని, వాటి వివరాలు ఇవ్వడం కోసం ఎస్‌బీఐ నాలుగు నెలల సమయం కోరడం సరైంది కాదన్నారు. సాధారణ ప్రజలు, కార్మికులు, రైతులకు సంబంధించిన వివరాలు మాత్రం వెంటనే వస్తాయని, క్షణాల్లో వారిపై చర్య దిగుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ బీజేపీకి సంబంధించిన వివరాలను సుప్రీంకోర్టు అడిగినా ఎస్‌బీఐ చైర్మెన్ ఇవ్వడం లేదని తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంక్ ప్రజల బ్యాంకు తప్ప మోడీ బ్యాంక్ కాదన్నారు. ఇప్పటికైనా వెంటనే ఎస్‌బీఐ చైర్మెన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, ఎన్నికల కమిషన్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బి.ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, సీపీఐ(ఎం) నేతలు పాల్గొన్నారు.

ఖమ్మంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ఎస్‌బీఐ ఎదుట నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఇల్లందులో సీపీఐ(ఎం), పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంక్‌ను ముట్టడించారు. కార్యాలయంలోనికి ఎవరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. జూలూరుపాడు, కల్లూరులో ర్యాలీగా ఎస్‌బీఐ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు.

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా కేంద్రాలతోపాటు ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఎస్‌బీఐల ముందు ధర్నా చేపట్టారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ఎస్‌బీఐ బేఖాతరు చేయడం క్షమించరాని నేరమని నేతలు అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ఆందోళన నిర్వహించారు. తుర్కయంజాల్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్ ముందు ప్లకార్డులు ప్రదర్శించారు. బ్యాంక్ మేనేజర్‌కు మెమోరాండం అందజేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రాల్లో, నారాయణపేట జిల్లా దామరగిద్ద ఎస్‌బీఐ బ్యాంకు ముందు ధర్నా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోని ఎస్‌బీఐ బ్రాంచీల ఎదుట సీపీఐ(ఎం) నేతలు నిరసన కార్యక్రమాలు చేశారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎలక్టోరల్ బాండ్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలోని క్లాక్ టవర్ ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఎలక్టోరల్(ఎన్నికల) బాండ్లను రద్దు చేస్తూ, వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు సుప్రీంకోర్టుకు సమర్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాజీవ్ చౌక్ వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ధర్నా చేశారు.

సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి మాట్లాడారు. నూతనకల్ మండలంలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా అనంతరం బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట పట్టణంలోని ఏపూరు బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు. భువనగిరి పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. బీబీనగర్ స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

రైతులంటే మోడీకి ద్వేషం

కార్పొరేట్లపట్ల ఎనలేని ప్రేమ

- అటకెక్కించిన రుణమాఫీ ఇతర హామీలు
- మాట తప్పిన సర్కారుపై పోరాటం
- 14న ధర్నా చౌక్‌లో మహాధర్నా : విలేకర్ల సమావేశంలో ఎస్‌కేఎం నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశానికే అన్నం పెడుతున్న రైతన్నపట్ల మోడీ ప్రభుత్వం ద్వేషం పెంచుకున్నదని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) నేతలు టి సాగర్, పశ్యపద్మ, మండల వెంకన్న బిక్షపతి, బి రాము, వెంకటయ్యతోపాటు వ్యవసాయ కార్మిక, మహిళా, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. మోడీ సర్కారుకు మాటలు తప్పడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక, మహిళా సంఘాలు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ పోరాటాన్ని విరమిస్తే..తమ సమస్యలు పరిష్కరిస్తామంటూ మోడీ ప్రభుత్వం గతంలో రైతులకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వానికి రైతులంటే ఏ మాత్రం పట్టదనీ, వారి పట్ల తీవ్ర విద్వేషాన్ని పెంచుకున్నదని తెలిపారు. కార్పొరేట్లకు ప్రయోజనాలు చేకూర్చటమే విధిగా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌కేఎం పిలుపు మేరకు ఈ నెల 14న దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆందోళనలు చేపడుతున్నట్టు తెలిపారు. అదే రోజు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద అన్ని సంఘాల మద్దతులో మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పార్టీలకు అతీతంగా మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని, రుణమాఫీ చేయటంలోనూ



కేంద్ర సర్కార్ మీనమేషాలు లెక్కిస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల సబ్సిడీ తగ్గించటం, గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయించాల్సిన నిధుల్లో కోతలు విధించటమేంటని ప్రశ్నించారు. రైతు వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. పశ్యపద్మ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో సాగుతున్న రైతు ఉద్యమాన్ని అణచి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం వెనకాడటం లేదని చెప్పారు. ఈ పోరాటంలో ప్రభుత్వం చేపట్టిన కాల్పుల్లో రైతు చనిపోయాడని తెలిపారు. మద్దతు ధర కల్పిస్తే వినియోగదారులకు నష్టం వస్తుందని నీటి ఆయోగ్ చెప్పినట్టు వాదనలు చేయటం బాధాకరమన్నారు. రైతులకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన మాట అమలు చేసే వరకు పోరాటం సాగుతుందన్నారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బీకేఎంయూ అధ్యక్షులు కాంతయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు జి ఝాన్సీ, డీబీఎఫ్ జాతీయ అధ్యక్షులు శంకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, అరుణక్క మాట్లాడారు. 14న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

సంపాదకీయం

"యాత్రికుడు"



జమ్మూ-కాశ్మీర్‌కు 370వ అధికరణాన్ని రాజ్యాంగం నుంచి తొలగించిన అయిదేండ్లకు గానీ ప్రధానమంత్రికి కాశ్మీర్‌లో పర్యటించే తీరిక దొరకలేదు. కానీ, ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాల్లో కాలికి బలపం కట్టుకొని మరీ ఆయన ప్రచారం చేశారు. రామ మందిర ప్రతిష్టకు ముందైతే, దేశవ్యాప్తంగా అనేక దేవాలయాల్లో ఆయన ఆలయసేవ చేశారు. నిద్రలు చేశారు. వీటన్నిటిని గమనిస్తున్నవారు, ఆయన దేశానికి ప్రధానమంత్రా, ప్రధాన అర్చకుడా అని చెవులు కొరుకున్నారు కూడా. అంతే కాదు మోడీ ద్వారక శిథిలాలు ఉన్న సముద్రభాగంలో

> ప్రధానమంటేనే ఎన్నో రాచకార్యాలు, ఎంతో పనిఒత్తిడి ఉంటుంది. పైగా, ఎన్నికలు సమీపిస్తున్నందున, రాజకీయమైన పనిభారం కూడా ఆయన మీద ఎక్కువగానే ఉంటుంది. వీటన్నిటి మధ్య ఆయన ద్వారక సందర్శన చేశారంటే, అటు స్వామికార్యం ఇటు స్వకార్యం లేకుండా ఉంటుందంటే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఈ మధ్య మోడీ ఎక్కడికి ఏ అధికారిక, రాజకీయ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడికి సమీపంలోని గుడులు గోపురాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మోడీ తమ పార్టీ బలాన్ని 370కి పెంచుకునే మహాకార్యంలో ఉన్నారు.

కూర్చుని రెండు నెమలీకలు సమర్పించి దృశ్యీకరించి ప్రపంచంతో పంచుకున్నారు. అస్సాంలో ఏనుగు అంబారీ ఎక్కి ఊరేగే సరదా సమయమూ ఉంది. కానీ, గతేడాది మే నుంచి ఇప్పటికీ రావణకాష్టంలా మండుతున్న మణిపూర్‌లో పర్యటించి ప్రజలకు ఊరట కలిగించాలన్న సోయే ఇప్పటికీ పెద్దసారుకు లేకపాయే. నిన్న కాక మొన్న ప్రధాని కాశ్మీర్ పర్యటన సైతం అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్యే సాగింది. అసలు జనం వస్తారో రారోనన్న సందిగ్ధంలో ప్రభుత్వోద్యోగులందర్నీ ర్యాలీకి విధిగా హాజరు కావాలని హుకుం జారీ చేశారు. ఇలా ఏర్పాటుచేసిన ప్రేక్షకుల ముందు మోడీ అనర్గళ ఉపాన్యాసమంతా మునుపటి ప్రభుత్వాలు కాశ్మీర్‌ను మోసగించాయంటూ దుమ్మెత్తిపోశారు. ఆయనంటున్న ఆ గత ప్రభుత్వాల్లో వీరి ఎన్‌డీఏ-1 ప్రభుత్వం సైతం ఉందన్న సంగతి ప్రధాని మరిచారా లేకపోతే కావాలనే అన్నారా? మిగతా గీతలన్నింటినీ చిన్నవి చేస్తేనే గదా తన 'గీత' పెరిగేది!

గత ప్రభుత్వాల సంగతి సరే... కానీ, మీరొచ్చిన ఈ పదేండ్ల కాలంలో, 370వ అధికరణం రద్దు తరవాత పరిస్థితి ఏ మేరకు మెరుగుపడిందో చెప్పాల్సింది పోయి.. గతప్రభుత్వాలను ఎంతకాలం ఇలా నిందిస్తూ కూర్చుంటారు? 370వ అధికరణాన్ని రద్దు బిల్లు ప్రవేశపెట్టినప్పుడే అభివృద్ధి కుంటుపడినందువల్లే కాశ్మీర్‌లో భూముల ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్న అమిత్ షా వ్యాఖ్యల వెనుక అనుంగ మిత్రుల ప్రయోజనాలున్నాయన్న విషయం ఆలస్యంగా బోధపడింది. రోడ్డు వెడల్పు పేరుతో యాపిల్ తోటలను ధ్వంసం చేస్తూ రైతులను వారి భూములకు దూరం చేసే కుట్ర జరుగుతోంది. నూతన కాశ్మీర్ అవతరిస్తుందన్న ప్రచారం ఆచరణలో ఎక్కడకు పోయినట్టు? పోనీ శాంతి భద్రతల పరిస్థితి ఏమైనా మెరుగైందా అంటే అదీ లేదు. మోడీ కాశ్మీర్ పర్యటనలో గత ప్రభుత్వాన్ని నిందించడంతోనే సరిపెట్టుకున్నారు తప్ప కాశ్మీర్ ప్రజలకు ఏం ఒరగబెట్టారో మాత్రం చెప్పలేదు.

నిన్నటి అస్సాం పర్యటనలో సైతం కెమెరా భుజాన వేసుకొని ఒక టూరిస్టులా ఫొటోలు తీస్తూ, ఏనుగులకు చెరుకు గడలు తినిపిస్తూ పోజులిస్తూ ఆహ్లాదకరంగా సాగింది. అనుకుంటాం కానీ, దృశ్యం చాలా ప్రభావాన్ని చూపుతుంది. మంచో చెడో ఒక సందేశాన్ని ఇస్తుంది. వీక్షకుల మనసులో అది చెరగని ముద్రను వేస్తుంది. సరిగ్గా అదే పాయింట్‌ను పట్టుకున్నారు ప్రధాని. అందులో భాగంగానే ఆయన వేషాలుంటాయి. భాషలుంటాయి. విదేశీ పర్యటనల సంగతి సరేసరి.

ప్రధానమంటేనే ఎన్నో రాచకార్యాలు, ఎంతో పనిఒత్తిడి ఉంటుంది. పైగా, ఎన్నికలు సమీపిస్తున్నందున, రాజకీయమైన పనిభారం కూడా ఆయన మీద ఎక్కువగానే ఉంటుంది. వీటన్నిటి మధ్య ఆయన ద్వారక సందర్శన చేశారంటే, అటు స్వామికార్యం ఇటు స్వకార్యం లేకుండా ఉంటుందంటే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఈ మధ్య మోడీ ఎక్కడికి ఏ అధికారిక, రాజకీయ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడికి సమీపంలోని గుడులు గోపురాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మోడీ తమ పార్టీ బలాన్ని 370కి పెంచుకునే మహాకార్యంలో ఉన్నారు. ద్వారక సందర్శనతో సహా అన్ని ఆలయ పర్యటనలూ ఆ మహాకార్యంలో భాగాలే. కాబట్టి ఆయన ప్రతిక్షణమూ, ప్రతిచర్యా అతి జాగ్రత్తగా ముందస్తు రూపకల్పనతో, నిర్దిష్ట లక్ష్యంతో నిర్మితమవుతుంది.

ఇప్పటికీ జమ్మూ-కాశ్మీర్ వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ మీద అనేక ఆంక్షలున్నాయి. మోడీ పర్యటన సందర్భంగా "జాగ్రత్త"గా మసులుకోవాలని, ఇండ్ల నుంచి బయటకు రాకూడదని అధికారులు కట్టడి చేశారంటే ఏ మాత్రం స్వేచ్ఛ ఉందో అర్థం చేసుకోవచ్చు. లడాఖ్ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలులో చేర్చడం కోసం ఏర్పాటు చేసిన ఉపసంఘానికి, కేంద్రానికి మధ్య చర్చలు విఫలమైనాయి. జనం ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత వాంగ్ చుక్ మూడు వారాల నిరాహార దీక్ష ప్రారంభించారు. అవసరమైతే ఆమరణ దీక్షకు సిద్ధమంటున్నారు. ఒకే ఒక్క లోక్‌సభ సీటు ఉన్న లడాఖ్‌లో వచ్చే సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలన్న ఆలోచనలో ఆ ప్రాంత ప్రజలున్నారు. ఐదేండ్లుగా కాశ్మీర్‌లో ముస్లింల మత నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫారూఖ్ గృహ నిర్బంధంలోనే ఉన్నారు. ఆయనకు తీవ్రవాదుల నుంచి ముప్పు ఉందని ప్రభుత్వ అధికారులు హైకోర్టుకు తెలిపారు. అంటే తీవ్రవాదం బెడద మాయమైందన్న ప్రచారం అంతా డొల్లేనని ప్రత్యేకంగా చెప్పాలా! పెరిగిన ఉగ్రవాదాన్ని ముస్లిం మతంతో ముడిపెట్టడం సంఘపరివార్‌కు వెన్నతో పెట్టిన విద్య కదా!

రేవంత్ వందరోజుల పాలన.. తీరుతెన్నులు



జూలకంటి రంగారెడ్డి
9490098349

'వారు పోతే వీరొస్తారు...వీరు పోతే వారొస్తారు' అన్న చందంగా కాకుండా ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పాలన సాగించే ప్రభుత్వాలను, పార్టీలను ప్రజలు కోరుకుంటారు. వివిధ రాజకీయ పార్టీలు గద్దెనెక్కడానికి అనేక వాగ్దానాలు చేయడం పరిపాటిగా మారింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను అమలు జరపక ప్రజల చేత తిరస్కరించబడుతుంటారు. గత పదేండ్ల పాలన చూస్తే, నీళ్లు, నిధులు, నియామకాల మీద సాగిపోయింది. కోటి ఎకరాలకు నీళ్లిస్తామని లక్ష కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేండ్లకే బీటలు వారి ప్రజాధనం వృథాగా గోదావరిలో పోసినట్లయింది. మనకు న్యాయంగా రావాల్సిన కృష్ణా జలాల వాటాలో ఒక్క టీఎంసీ కూడా కేసీఆర్ ప్రభుత్వం రాబట్టలేకపోయింది. ఉద్యోగ నియామకాల విషయానికొస్తే

> అధికారం చేపట్టి వందరోజులు అవుతున్నా పూర్తి స్థాయిలో మంత్రివర్గం ఏర్పడలేదు. పదిమంది మంత్రులు మాత్రమే మొత్తం శాఖలకు అదనపు బాధ్యతలు నిర్వహించడం వల్ల కొన్ని శాఖలకు న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించి ప్రభుత్వ పాలన సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలి. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఆహ్వానించదగ్గవే. గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమల్లోకి తేవడం హర్షణీయం. అయితే, విద్యుత్ వినియోగం 200 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ ఎక్కువగా వాడినా, మొత్తం వాడకానికి బిల్లు చెల్లించాల్సిందేనని మెలిక పెట్టడం పేద వర్గాలకు ఇబ్బందికరమే.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. టీఎస్పీఎస్సీ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసింది. ఓట్ల కోసం చేపట్టిన అనేక జనాకర్షక పథకాలు చిత్తశుద్ధితో అమలు చేయకపోవడం వలన ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఏమాత్రం నమ్మకుండా తిరస్కరించారు. మాకు ఎదురులేదని, తామే శాశ్వత ప్రభువులమని, తమ మాటే శాసనంగా నిరంకుశ పోకడలతో కేసీఆర్ పాలన కొనసాగించారు. అంతేకాకుండా 'కూటిలో రాయి తీయలేనోడు.. ఏటిలో రాయి తీస్తానన్న' చందంగా టీఆర్ఎస్‌ను భారత రాష్ట్ర సమితి అని జాతీయ పార్టీగా ప్రకటించారు. జాతీయ స్థాయికి ఎదగకపోగా చివరకు సొంత రాష్ట్రంలోనే అధికారం కోల్పోయారు.

పదేండ్ల విరామం తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పథకాలతో అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన సహచర మంత్రుల పాలనా శైలి దూకుడుగా మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను ప్రజలకు వెల్లడించడం అవసరమే కానీ అసలు విషయాలు మరుగున పడకుండా ఆవేశం తగ్గించుకొని సంయమనంతో వ్యవహరించడం మంచిది. ఆరు గ్యారంటీలను వంద రోజులలో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు గ్యారంటీలను అమలు చేసింది. మిగతా రెండు గ్యారెంటీలను అమలు చేసే ప్రయత్నంలో ఉంది. వీటి అమలు కోసం ప్రభుత్వం నిధుల కొరతతో కింద మీద పడుతున్నట్టు అనిపి స్తున్నది. ఏదేమైనా గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం కొంత మేలన్నట్టుగా పరిపాలన మొదలైంది.ఈ ప్రభుత్వ పరిస్థితి గమనిస్తే, అప్పు తెచ్చుకుంటే తప్ప సంసారం సాగనట్టుగా ఉంది. ప్రజాసంక్షేమంతో పాటు దీర్ఘకాలిక ప్రణాళికతో రాష్ట్ర అభివృద్ధికి కృషి జరగాలి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గత ప్రభుత్వ పాలన కంటే భిన్నంగా అభివృద్ధికరంగా సాగుతుందా? అన్నది భవిష్యత్తు కాలం చెప్పాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ పాలన తీరు తెన్నులను దృష్టిలో ఉంచుకొని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తోడ్పడే విధంగా బడుగు బలహీన పేదవర్గాలకు ఉపయోగపడే విధంగా పథకాలుండాలి.

అధికారం చేపట్టి వందరోజులు అవుతున్నా పూర్తి స్థాయిలో మంత్రివర్గం ఏర్పడలేదు. పదిమంది మంత్రులు మాత్రమే మొత్తం శాఖలకు అదనపు బాధ్యతలు నిర్వహించడం వల్ల కొన్ని శాఖలకు న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించి ప్రభుత్వ పాలన సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలి.అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఆహ్వానించదగ్గవే. గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమల్లోకి తేవడం హర్షణీయం. అయితే, విద్యుత్ వినియోగం 200 యూనిట్లకు మించి ఒక్క యూనిట్ ఎక్కువగా వాడినా, మొత్తం వాడకానికి బిల్లు చెల్లించాల్సిందేనని మెలిక పెట్టడం పేద వర్గాలకు ఇబ్బందికరమే. తెల్లరేషన్ కార్డు కలిగిన వాళ్ళ 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే, ఆ పైన వినియోగించిన అదనపు యూనిట్లకు చార్జీ వసూలు చేయడం న్యాయమే కానీ మొత్తం బిల్లు చెల్లించాల్సిందేనని చెప్పడం గురించి పునరాలోచన చేయాలి. వికలాంగులకు, వృద్ధులకు పెన్షన్ అమలు కావలసి ఉంది. కౌలు రైతులకు రైతుబంధు, రైతాంగానికి రుణమాఫీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి అందించే పథకాలు త్వరితంగా అమలు చేస్తే ప్రభుత్వం పట్ల విశ్వాసం కలుగుతుంది. ధరణి ఉంచుతారా ఎత్తివేస్తారా? అన్నది తక్షణం ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. పోడు భూముల రైతులకు పట్టాలందజేయాలి. 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయించాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వం మీద ఉంది. 2006 అటవీ హక్కుల చట్టాన్ని కూడా అమలు జరపాలి.

రైతులు కరువు కాటకాలతో పెద్ద ఎత్తున పంటలు నష్టపోయారు. రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు 30 శాతం భూమి సాగు చేస్తున్నారు. రైతు భరోసా వాగ్దానాలను 2011 కౌలురైతు చట్టాలను పరిగణలోకి తీసుకొని అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి వివిధ సబ్సిడీలు ఎత్తివేసే పథకాలను ముందుకు తీసుకువస్తున్నది. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం, రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసే చట్టం ప్రభుత్వం తీసుకురావాలి. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం బోనస్ ఇవ్వాలి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల సేద్యానికి నీళ్లందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. వీరికి పంట నష్ట పరిహారంతో పాటు



రుణమాఫీ ఇస్తే కొంత ఊరట కలుగుతుంది.లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై తక్షణమే నిపుణులతో కమిటీ వేసి నిగ్గు తేల్చాలి. దీనికి బాధ్యులైన వారిపై కఠినంగా చర్యలు తీసుకొని జరిగిన నష్టానికి వారిని బాధ్యులను చేయాలి. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్ని పూర్తి చేసేందుకు తగు చర్యలు చేపట్టాలి. మూసీ నది ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ చేపట్టాలి. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు సక్రమంగా నిర్వహించి ఎన్నోఏండ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. వైద్యరంగంలో 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా ఖాళీలను భర్తీ చేయడంతో పాటు బస్తీ దవాఖానాలు, పల్లె దవఖానాలను ప్రజలకు దగ్గరగా చేయాలి. 73 షెడ్యూల్ పరిశ్రమలలో ఒక కోటి 20 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వారికి వేతనం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి. వారికి కనీస వేతన చట్టం అమలు చేయకపోగా, రూ.18వేలుగా ఉన్న వేతనాన్ని 11,300 తగ్గిస్తూ జీవోను విడుదల చేశారు. ఇది చాలా అన్యాయం, వెంటనే ఈ జీవోను రద్దుచేసి కార్మికులకు న్యాయం చేయాలి. చాలాకాలంగా ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. వారుంటున్న నివాస స్థలాలకు పట్టాలిచ్చి, ఇండ్లు మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇండ్ల కోసం 25 లక్షల దరఖాస్తులు ప్రభుత్వం వద్దకు చేరాయి. డబల్ బెడ్ రూమ్ పథకం కింద గతంలో మూడు లక్షల ఇండ్లు కట్టించడం జరిగింది. వాటిలో 50వేల ఇండ్లు మాత్రమే కేటాయించడం జరిగింది. మిగతా రెండున్నర లక్షల అర్హులైన లబ్దిదారులకు వెంటనే ఇండ్లను స్వాధీనం చేయాలి. భూముల పంపిణీ మీద కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫారసులను అమలు చేయాలి. రాష్ట్రంలో సమగ్ర భూసర్వే జరిపి సీలింగు మిగులు,ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంపిణీ చేయాలి.

మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు రవాణా సౌకర్యం నేపథ్యంలో బస్సుల సంఖ్యను మరింత పెంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల అవసరం ఎంతో ఉంది. వాటిని గుర్తించి, మరిన్ని బస్సులు కొనుగోలు చేసి ఆయా రూట్లలో తిప్పాల్సిన అవసరం ఉంది. బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోవాలాలకు గిరాకీ తగ్గిందని ఆందోళన చెందుతున్నారు. ఆటో కార్మికులకూ సరైన న్యాయం చేయాలి. కొత్త ప్రభుత్వం రాగానే కరువు భత్యం విడుదల చేస్తుందని ఉద్యోగులు ఎంతగానో ఆశించారు. దాదాపు 14శాతం ఉద్యోగులకు రావలసిన కరువు భత్యం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ఉద్యోగులు పెన్షనర్స్ ఎదురుచూస్తున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కార్పొరేట్ దవాఖానాలలో అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో ఈహెచ్ఎస్ పథకం కింద కార్పొరేట్ వైద్యమందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి. స్థానిక సహకార, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీ పోస్టులకు శాశ్వత నియామకాలు జరపాలి.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో బాల బాలికలకు, సిబ్బందికి మూత్రశాలలు మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు లేక ఎంతో మనోవేదనకు గురవుతున్నారు. దాంతో బాలికల చదువు పైస్థాయి వరకు కొనసాగించలేని (డ్రాప్ అవుట్) పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తరగతి గదులు పాఠశాల పరిసరాల పారిశుధ్య నిర్వహణకు స్కావెంజర్లు, స్వీపర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులే ఆ పనులు నిర్వహించవలసిన దుస్థితిలో రాష్ట్ర విద్యావ్యవస్థ కొనసాగుతున్నది. విద్యా బోధన సక్రమంగా జరిగేందుకు మంచి ఫలితాలు సాధించేందుకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, బోధన, బోధనేతర ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన తక్షణం భర్తీ చేయాలి. మధ్యాహ్న భోజన పథకం, కనీస నాణ్యతలేని అధ్వాన్న భోజనంగా ఉన్నట్టు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించడంతో పాటు సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీలను పెరిగిన ధరలకనుగుణంగా సకాలంలో అందేవిధంగా చర్యలు చేపట్టాలి. పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాల విద్యార్థులు ప్రయివేటు విద్యా సంస్థలలో లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఉంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ కొనసాగాలి. తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగాన్ని అన్ని వసతులతో విస్తరించి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మేలు జరిగే చర్యలు తీసుకోవాలి.

ముఖ్యంగా ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు ఆయా ప్రభుత్వ శాఖల విభాగాల మీద నిరంతరం పర్యవేక్షణ జరపాలి. శాసనసభ సమావేశాలలో ప్రజాసమస్యల పరిష్కారానికి, వివిధ అంశాల పట్ల హుందాగా చర్చలు జరగాలి. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు చేయకుండా అవినీతికి, పక్షపాతానికి తావు లేకుండా పనిచేయాలి. ప్రగతి భవన్‌కు వేసిన ముండ్ల కంచెను తొలగించడం మంచిదే. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అమలు చేయడంతో పాటు రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం, సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. ■

నిరుద్యోగుల్ని మోసం చేస్తున్నారా?




అనగంటి వెంకటేష్
9705030888

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో నియమకాలకై గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ రిక్రూట్మెంట్ బోర్డు (ట్రిబ్) తొమ్మిది కేటగిరీల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఆయా నోటిఫికేషన్‌ను అనుసరించే పరీక్షలు నిర్వహించి తర్వాత ఎన్నికలు రావడంతో ఫలితాలు వెల్లడించడానికి ఆటంకాలు ఏర్పడాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫలితాలు వెల్లడించి నియమాకాలను చేపట్టింది.ఈ పోస్టులను బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా, ఆటంకాలు లేకుండా భర్తీ చేయాలని గతంలో ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆందోళనలు కూడా చేసింది.బ్యాక్‌లాగ్ పోస్టులు ఉంచకుండా అవరోహణ క్రమంలో (డిసైండింగ్ ఆర్డర్)లో పోస్టులను నింపుతామని ప్రకటించింది. కానీ అభ్యర్థులు నుంచి స్వీకరించిన ఆప్షన్స్ ఆధారంగా ఆయా పోస్టులకు 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాలను ట్రిబ్ సిద్ధం చేసింది.కానీ నియమకాల్లో డిసెండింగ్ ఆర్డర్‌లో పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి అందుకు విరుద్ధంగా రిలిక్విష్మెంట్ తీసుకోకుండానే ట్రిబ్ నియామక పత్రాలను అందజేస్తున్నది. ఒక్క అభ్యర్థి మూడు పోస్టులకు అర్హత సాధించినా ఒక్కటే పోస్టును ఎంచుకుంటారు. మిగతా పోస్టులు బ్యాక్‌లాగ్‌గా ఉండిపోనున్నాయి. దీంతో మెరిట్ సాధించిన అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉన్నది. ఈ విధంగానే నియామకాలు చేపడితే సుమారు నాలుగువేల పోస్టులు బ్యాక్‌లాగ్‌గా ఉండనున్నాయి. గత పదేండ్లుగా నోటిఫికేషన్స్ కోసం ఎదురుచూసి ఉద్యోగాలు సాధించాలనే తపనతో కోచింగ్‌లు తీసుకుని మెరిట్ సాధించిన అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విస్తృతంగా నూతన గురుకులాలను నిర్మించింది. మొత్తం 1011 గురుకులాలను ఏర్పాటు చేసి టీచర్ల నియమకాలకు మొదట 10వేల పోస్టులు భర్తీ చేసింది. మరో పది వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాల్సిన దాంట్లో 1:2 రేషియోలో మొత్తం 9231 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. వాటిలో పిజిటి 1276, టిజిటి 4020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2876, టిజిటి స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 226, మ్యూజికల్ టీచర్ 124 ఇలా మొత్తం 9231 పోస్టుల భర్తీ ప్రక్రియకు నోటిఫికేషన్స్ ఇచ్చి ఆగష్టులో రాత పరీక్షలను నిర్వహించింది. 652413 మంది దరఖాస్తు చేసుకోగా 493727 మంది రాతపరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలకు సంబంధించి అందరికి(డిఎల్, జెఎల్, పిజిటి, టిజిటి) పోస్టులకు ఒకే రకమైన పేపర్‌ను ఇచ్చింది. పరీక్షా కేంద్రాలు ఒక్కపరీక్ష సొంత జిల్లా కేంద్రం అయితే మరో పరీక్ష హైదరాబాద్, మరో పరీక్ష మరోచోట నిర్వహించి అభాసుపాలైంది. ఫలితాలు అయిన సక్రమంగా ఇచ్చి ఉద్యోగాలు ఇస్తారేమో అనుకుంటే మళ్లీ మొదటికి తెచ్చారని నిరుద్యోగులు వాపోతున్నారు.

ట్రిబ్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఉన్న నిబంధనలు ప్రకారమే నియమకాలు చేపట్టాలని రిలిక్విష్మెంట్ ఆధారంగానే నియామక పత్రాలివ్వాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని విన్నవిస్తున్నారు. ముందు డిసైండింగ్ ఆర్డర్‌లో పోస్టులు భర్తీ చేస్తామని నాడు ట్రిబ్ కన్వీనర్ మల్లయ్య భట్టు పలుమార్లు ప్రకటించారు. నోటిఫికేషన్ కూడా ముందు అవరోహణ క్రమంలో డి.ఎల్ తర్వాత జె.ఎల్., పి.జి.టి., టి.జి.టి. పోస్టులు భర్తీచేస్తామని చెప్పింది. కానీ ఇప్పుడు రూటుమార్చి పోస్టులను బ్యాక్ లాగ్ పెట్టడం వల్ల అంటే నిరుద్యోగులను మోసం చేయడమే. అదేవిధంగా నియమకాల్లో హరిజంటల్ విధానంపై అభ్యర్థుల్లో సందిగ్ధం ఏర్పడినది. దీంతో మహిళ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్స్‌లో ఇచ్చిన ఆధారంగా నియమకాలను చేపట్టి బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండకుండా మెరిట్ ఆధారంగా పోస్టులన్నింటిని భర్తీచేసి అభ్యర్థులకు న్యాయం చేయాలి. రీలింక్విష్‌మెంట్‌తో డిసైండింగ్ ఆర్డర్‌లో రెండోలిస్టు ప్రకటించి బ్యాక్‌లాగ్ లేకుండా పోస్టులు భర్తీ చేయాలి. లేకపోతే గత ప్రభుత్వంలాగే భావించి నిరుద్యోగుల హక్కులకై పోరాటబాట తప్పదు. ■

కనీస వేతనాలు సవరించేదెప్పుడు?



గీట్ల ముకుందరెడ్డి
94900 98857

రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 1.20 కోట్ల మంది కార్మికులకు వర్తించే కనీస వేతనాల సవరణ ప్రతిపాదనలు నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువగా చేసింది. 15 ఏండ్ల తర్వాత సవరించిన వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేదు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం కనీస వేతనాలను 1957లో 15వ ఐఎల్‌సీ తీర్మానం ప్రకారంగా ఆక్రాయిడ్ ఫార్ములా ఆధారంగా లెక్కించి నిర్ణయించాలి. కార్మిక కుటుంబం బతకటానికి, మరీ తక్కువ కాకుండా నిర్ణయించేదే కనీస వేతనం. కార్మికుల పోరాటాల ఫలితంగా 1948లో కనీసవేతన చట్టం వచ్చింది. సెక్షన్ 5 ప్రకారం ప్రభుత్వం కనీసవేతన సలహాబోర్డును నియమించాలి. బోర్డు సలహా మేరకు కనీసవేతనాలను ఐదేండ్లకోసారి సవరించాలి. 1948 నవంబరులో జాతీయ సలహా మండలి సమంజస వేతనాలపై త్రైపాక్షిక కమిటీ (ఫెయిర్ వేజ్ కమిటీ) నియమించింది. ఈ కమిటీలో కార్మిక, యాజమాన్య, ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఫెయిర్ వేజ్ కమిటీ వేతనాలను 1. మినిమమ్ వేజ్ 2. ఫెయిర్ వేజ్ 3. లివింగ్ వేజ్ అని 3 కేటగిరీలుగా నిర్వచించింది. కనీస వేతనమన్నది కేవలం జీవితపు కనీస స్థాయి అవరాలను తీర్చ డమే కాదు, కార్మికుని సామర్థ్యం నిలిపేందుకు కూడా తోడ్పడాలి. ఇందుకోసం విద్యా, వైద్య అవసరాలు కూడా తీరాలి. పరిశ్రమ/సంస్థ ఆర్థిక స్తోమతతో నిమిత్తం లేకుండా కనీస వేతనమివ్వాలని సుప్రీంకోర్టు ప్రకటించింది. కనీస వేతన నిర్ణయ ప్రాతిపదికను, కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యాలు, యూనియన్లు ఆమోదించాయి. కార్మికుడు బతకాలంటే రోజుకి కనీసం 2400 క్యాలరీలు శక్తి గల ఆహారం తినాలని డాక్టర్ ఆక్రాయిడ్ తెలిపారు. కుటుంబం అంటే మూడు వినియోగ యూనిట్లు (భార్య, భర్త, ఇద్దరు పిల్లలు). ప్రతీ యూనిట్ కి 18 గజాల బట్ట చొప్పున 72 గజాల దుస్తులు, కనీస ఇంటి అద్దె 10శాతం, ఇంధనం, విద్యుత్ నిమిత్తం 20శాతం, విద్యా, వైద్యానికి 25శాతం అదనంగానూ కలిపి కనీసవేతనాన్ని నిర్ణయించాలని సెక్రటరీ కాన్ప్టిట్ కార్మికసంఘం వర్సెస్ రాష్ట్ర కాన్ప్టిట్ అండ్ కంపెనీ మేనేజ్ మెంట్ కేసు (1992 ఎల్ఎల్ఎస్ఎస్సీ)లో సుప్రీంకోర్టు చెప్పింది.

ఈ ఏడాది పెరిగిన నిత్యావసరాల ధరల ప్రకారం లెక్కించి చూస్తే నలుగురు ఉన్న కుటుంబానికి బియ్యం, కూరగాయల నుంచి మొదలుకుంటే ఇంటి అద్దె, విద్యా, వైద్యానికి సుమారు రూ.26,678 రూపాయల ఖర్చవుతుంది. అంటే ప్రస్తుత కాలంలో కుటుంబం బతకడానికి కనీసవేతనం రూ.26వేలు నిర్ణయించబడాలి. రాష్ట్రంలోని కార్మిక సంఘాలన్ని కలిసి అన్‌స్కిల్డ్ వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరాయి. ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలే తక్కువ. ఇవి కూడా అత్యధిక చోట్ల అమలుకు నోచుకోవడం లేదు. మొదట్లో రెండేండ్లకోసారి లేదా 50 పాయింట్లు వి.డి.ఎ. (వేరియబుల్ డియర్నెస్ అలవెన్సు) (కరువుభత్యం) పెరిగినా సవరించేవారు. దీనిని ఐదేండ్లకోసారి సవరించాలని చట్టం చేసారు.17 ఏండ్ల తర్వాత 2024 జనవరి 29న 73 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్లు ఇచ్చారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనాన్ని ప్రకటించాలి. కానీ గత ప్రభుత్వంలో ఐదు రంగాలకు నిర్ణయించిన రూ.18 వేలను కూడా తగ్గించి నోటిఫికేషన్ ఇచ్చారు. 73 షెడ్యూల్ పరిశ్రమలకు విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్స్‌లో రూ.8045 నుండి రూ.14,954 వరకు మినిమం వేజ్ ప్రతి పాదించడం కార్మికులకు తీవ్ర అన్యాయం చేయడమే.15 ఏండ్ల క్రితంనాటి జీవోలలోని బేసిక్ వేతనాలకు 1768 విడిఎ పాయింట్ల వద్ద ఆయా షెడ్యూల్డ్ ఎంప్లాయీస్ జీఓలకు వర్తించే రేట్ల ప్రకారం కొత్త బేసిక్ నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను సవరించకపోయినా ప్రస్తుతం పొందే వేతనానికి విడిఏ పాయింట్లు కలిపితే అంతే వేతనం పొందుతున్నారు.

> కనీస వేతనాల పెంపు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రభుత్వాలకు ఆదాయాలు పన్నుల ద్వారా రాబడి పెరుగుతాయి. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వస్తువుల వినియోగం పెరుగుతుంది. ఇప్పుడు దేశంలోని, రాష్ట్రంలోని పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్య సరుకుల ఉత్పత్తి సమస్య కాదు. సరుకుల అమ్మకం (మార్కెటింగ్) సమస్య. ఇది అధిగమించాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలంటే కనీస వేతనం రూ. 26వేలు ఉండాలి. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడంతో పారిశ్రామిక రంగంలోకి రావలసిన పెట్టుబడులు అనుత్పాదక రంగాలైన భూములు, బంగారం కొనుగోలు, గుళ్లల్లోని హుండీలకు తరలిపోతున్నాయి. ఇది అభివృద్ధిని ఆటంక పరుస్తున్నది.

కొత్త జీవోలలో కార్మికుడికి పెరిగిన జీతం శూన్యం. ఉదాహరణకు రైస్ మిల్స్, దాల్ మిల్స్‌కు వర్తించే జీవో. ఎంఎస్. నెంబర్ 82, గజిట్ నెంబర్ 690 తేదీ 12డిసెంబర్2007లో 525 విడిఎ పాయింట్స్ వద్ద అన్‌స్కిల్డ్ వేతనం రూ.3523గా నిర్ణయించారు. కరువు భత్యం ధర పాయింట్‌కి రూ. 6.70 పైసలు. ప్రస్తుత విడిఎ పాయింట్లు 1768 కాగా బేసిక్ కరువుభత్యం కలిపితే రూ.11,583 అన్‌స్కిల్డ్ వేతనం వస్తుంది. జీవో ఆర్టీ నెంబర్ 86 తేదీ 29 జనవరి2024 విడిఎ పాయింట్లు 1768 వద్ద ప్రతిపాదించిన అన్‌స్కిల్డ్ వేతనం రూ.11,851 అంటే వెయిటేజ్ ఇచ్చింది కేవలం రూ.268 మాత్రమే. మరో ఉదాహరణ స్టోన్ బ్రేకింగ్ అండ్ క్రషింగ్ గ్రానైట్ ఫ్యాక్టరీలకు కూడా వర్తించే జీవో.ఎంఎస్. నెంబర్ 5, గజిట్ నెంబర్ 71 తేదీ 14ఫిబ్రవరి2008లో 525 విడిఎ పాయింట్స్ వద్ద అన్‌స్కిల్డ్ వేతనం రూ. 3197గా నిర్ణయించారు. కరువు భత్యం ధర పాయింట్‌కి రూ. 6.05 పైసలు. ప్రస్తుత విడిఎ పాయింట్లు 1768 కాగా బేసిక్‌కరువుభత్యం కలిపితే రూ.10,475 అన్‌స్కిల్డ్ వేతనం వస్తుంది. జీవో ఆర్టీ నెంబర్ 107 తేదీ 29జనవరి2024 విడిఎ పాయింట్లు 1728 వద్ద ప్రతిపాదించిన అన్‌స్కిల్డ్ వేతనం రూ.10,717 అంటే వెయిటేజ్ ఇచ్చింది కేవలం రూ.247 మాత్రమే. కనీస వేతనాల సలహా మండలి 2015-16లో తీర్మానం చేసి ఆనాటి ధరల ప్రకారం కనీస బేసిక్ రూ.12వేలు నిర్ణయించింది. 2017 తరువాత రూ.18వేలు నిర్ణయించి 2021 జూన్‌లో టీ(బీ)ఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు జీవోలలో స్టోన్ బ్రేకింగ్ అండ్ క్రషింగ్ సంబంధించిన జీవో ఎంఎస్ నెంబర్ 23 ఫైనల్ నోటిఫికేషన్ లో ప్రతిపాదించిన అన్స్కిల్డ్ వేతనం రూ.18,019, విడిఎ పాయింట్ ఒక్కటి రూ.12, స్కిల్డ్ వేతనం రూ. 24,434, వీడిఏ పాయింట్ కు రూ.16.28 పైసలు, హైస్కిల్డ్ వేతనం-1 రూ.39,837 విడిఎ పాయింట్‌కు రూ. 26.54 గా నిర్ణయించారు. దాదాపు 190 రకాల డిసిగ్నేషన్స్ అందులో పేర్కొన్నారు. 26 సూచనలు చేశారు. మిగతా నాలుగు జీవోలలో కూడా ఇంచుమించు ఇవే ప్రతిపాదనలు చేశారు.కానీ, యాజమాన్య సంఘాలు గెజిట్ కాకుండా అడ్డుకోగలిగాయి.

కనీస వేతనాల పెంపు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రభుత్వాలకు ఆదాయాలు పన్నుల ద్వారా రాబడి పెరుగుతాయి. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వస్తువుల వినియోగం పెరుగుతుంది. ఇప్పుడు దేశంలోని, రాష్ట్రంలోని పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్య సరుకుల ఉత్పత్తి సమస్య కాదు. సరుకుల అమ్మకం (మార్కెటింగ్) సమస్య. ఇది అధిగమించాలంటే ప్రజల కొనుగోలుశక్తి పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలంటే కనీస వేతనం రూ. 26వేలు ఉండాలి. ప్రజల కొనుగోలుశక్తి పడిపోవడంతో పారిశ్రామిక రంగంలోకి రావలసిన పెట్టుబడులు అనుత్పా దక రంగాలైన భూములు, బంగారం కొనుగోలు, గుళ్లల్లోని హుండీలకు తరలిపోతున్నాయి. ఇది అభివృద్ధిని ఆటంకపరుస్తున్నది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించడం కోసం, ఓట్ల కోసం గృహజ్యోతి, ఉచిత బస్సు, రూ.500లకు గ్యాస్, ఉచిత విద్యుత్తు కంటితుడుపు చర్యలతో పాలకవర్గాలు ఎంతో కాలం ప్రజలను మోసపుచ్చలేవు. కనీస వేతనం నెలకు రూ.26వేలు నిర్ణయించి, అమలు చేయగలిగితే ఒక్కో కార్మికుడు కనీసం నెలకు రూ.పది వేల ఆదాయం అదనంగా పొందగలుగుతారు. వేతనాలు తక్కువగా నిర్ణయించడం వలన 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలోని 120 కోట్ల మంది కార్మికులు నెలకు కనీసం రూ. 12 వేల కోట్లు కోల్పోతున్నారు.

2021 జూన్ తర్వాత ఇప్పటివరకు పెరిగిన ధరల ప్రకారం చూసినా రూ.21,223 కనీస బేసిక్‌గా ఉండాలి. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారులను సంతృప్తిపర్చే తన వర్గ స్వభావాన్ని చాటుకుంది. మోదీ నాయకత్వం లోని బీజేపీ, ఎన్డీఏ కేంద్ర సర్కార్ కార్మికులకు కనీస వేతనం రోజుకు 176 రూపాయలు చాలంటున్నది. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరణలు చేస్తున్నది. కార్మిక సమస్యల విషయంలో బీజేపీ, కాంగ్రెస్‌కు ఏమీ తేడా లేదు. కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాల వైపు నిలబడటమే వారి విధానం. కార్మికులకు పోరాటం తప్ప మరో మార్గం లేదు. మార్చి 29 వరకు సవరణలు, సూచనలు చేస్తూ యూనియన్ల వారిగా, వ్యక్తిగతంగా లేఖలు రాయడం, వినపత్రాలివ్వడంతో పాటు కార్మిక సంఘాలు ఇచ్చిన ఆందోళన పోరాటంలో భాగస్వామ్యం కావాలి. ■





లక్ష్మీనరసింహుని సన్నిధిలో సీఎం దంపతులు

- పాల్గొన్న డిప్యూటీ సీఎం, మంత్రులు
- జ్యోతి ప్రజ్వలనతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దంపతులు సోమవారం సందర్శించారు. ఉదయం 10 గంటలకు యాదాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. వారితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చక బృందం ఆశీర్వాదం ఇచ్చారు. దేవాదాయశాఖ అధికారులు ధర్మకర్త నర్సింహా మూర్తి, ఈవో రామకృష్ణారావు సీఎం దంపతులకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రులతో కలిసి సీఎం జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభ అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, జెడ్పీ చైర్మెన్ సందీప్ రెడ్డి, రాచకొండ సీపీ తరుణ్ జోషి, జిల్లా కలెక్టర్ హనుమంత్ కె జెండగే, దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి, మున్సిపల్ చైర్మెన్ ఎరుకల సుధా హేమేందర్ గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ ఇతర నాయకులు పాల్గొన్నారు.

మిల్లులో గోదాం గోడ కూలి ఇద్దరు హమాలీల మృతి

- ఆదుకోవాలని ఇతర కార్మికుల ధర్నా
- పరిహారం అందజేస్తామన్న యాజమాన్యం

నవతెలంగాణ-మిర్యాలగూడ



రైస్ మిల్లు గోదాంలో గోడ కూలి అక్కడ పనిచేస్తున్న ఇద్దరు బీహార్ రాష్ట్రానికి చెందిన హమాలీలు మృతిచెందారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని భరణి రైస్ మిల్లులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుమారు 50 మంది భరణి రైస్ మిల్లులో హమాలీలుగా పనిచేస్తున్నారు. గోదాంలో ఉన్న బస్తాలను మిల్లింగ్ కోసం బయటకు తీస్తుండగా మధ్యలో ఉన్న ఎత్తైన గోడ కూలి హమాలీలపై పడిపోయింది. అది గమనించి అందరూ బయటకు పరుగులు తీయగా.. గోడ పక్కనే బస్తాలు ఎత్తుతున్న గంగా ప్రసాద్ (55), రఘువీర్ సాహూ (45) తప్పించుకోలేకపోయారు.

ఇద్దరూ గోడ శిథిలాల కింద పడిపోయారు. వారి పైనుంచి వందల బస్తాలు పడిపోవడంతో మిల్లు యాజమాన్యం, కార్మికులు వెంటనే జేసీబీని తీసుకొచ్చి బస్తాలను తొలగించారు. శిథిలాల నుంచి ఇద్దరినీ బయటకు తీయగా అప్పటికే ఇద్దరు మృతిచెందారు. ఇరువురి కుటుంబాలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీహార్ కార్మికులు మిల్లు ఎదుట ధర్నా చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకుంటామని మిల్లు యాజమాన్యం హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ సీఐ వీరబాబు తెలిపారు.

కేంద్రం ఓబీసీల రిజర్వేషన్ పెంచాలి

- కాంగ్రెస్ నేత వి.హనుమంతారావు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఓబీసీల రిజర్వేషన్ పెంచాలని కాంగ్రెస్ నేత వి. హనుమంతారావు డిమాండ్ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్రలో రైతులు, పేదల కష్టాలు తెలుసుకుంటూ ముందుకు వెళుతున్నారని అన్నారు. సోమవారం నాడిక్కడ హనుమంతారావు మీడియాతో మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరగాలని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేస్తే మన జీవితాలు బాగుంటాయని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 50 శాతం రిజర్వేషన్ డెడ్‌లైన్ తీసేసి, రిజర్వేషన్ పెంచుతామని రాహుల్ చెప్పారని అన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని తెలిపారు. తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటిస్తారని అన్నారు. తెలంగాణలోని బీసీలకు ప్రధాని మోడీ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పర్యటించే ముందు బీసీలకు రిజర్వేషన్లపై సరైన హామీ ఇవ్వాలని కోరారు. గతంలో ప్రధానిని తాను కలిసిన సమయంలో బీసీలకు రిజర్వేషన్లు గురించి మాట్లాడితే ఇంతవరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీల రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	66,270	-	---
22 క్యారెట్లు	60,750	-	---
కిలో వెండి	79,000	▼	100



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	112
రిటైల్ (లైవ్)	రూ.	134
స్కిన్‌తో	రూ.	194
స్కిన్‌లెస్	రూ.	221

'కోటా' బేఖాతర్...

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సీట్లు నిరాకరిస్తున్న ఐఐటీలు

- ఫ్యాకల్టీ నియామకాలు, పీహెచ్‌డీ ప్రవేశాలలో ఇదే పరిస్థితి
- నిత్యకృత్యమైన వేధింపులు, వివక్ష
- ఆత్మహత్యలకు పాల్పడుతున్న విద్యార్థులు



న్యూఢిల్లీ : ఫ్యాకల్టీ నియామకాలు, పీహెచ్‌డీ ప్రవేశాల స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ కోటాను ఐఐటీలు తోసిపుచ్చుతున్నాయి. ఆయా వర్గాలకు సీట్లు నిరాకరిస్తున్నాయి. దీంతో ఆ సంస్థల్లో వారి ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీహెచ్‌డీ అడ్మిషన్ల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన 34 మంది విద్యార్థులకు సీట్లు నిరాకరించారు. ఈ సంస్థలో 45 డిపార్ట్‌మెంట్లు ఉండగా వాటిలో 43 డిపార్ట్‌మెంట్లలో ఒక్క ఎస్టీ ఫ్యాకల్టీ కూడా లేరు. గత సంవత్సరం ఈ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన ఒక్క మహిళా ఫ్యాకల్టీని కూడా నియమించలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలు వెలుగు చూశాయి.

ప్రభుత్వ, న్యాయస్థానాల ఆదేశాలు ఉన్నప్పటికీ ఫ్యాకల్టీ నియామకాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో రిజర్వేషన్ నిబంధనల్ని ఖరగ్‌పూర్ ఐఐటీ ఉల్లంఘించిందని విద్యార్థులు ఆరోపించారు. పైగా ఆయా వర్గాల విద్యార్థులపై వేధింపులు నిత్యకృత్యమయ్యాయని, వివక్ష జడలు విప్పుతోందని, దీనిని భరించలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని చెబుతున్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఐఐఎంలలో గత ఐదు సంవత్సరాల కాలంలో 13,500 మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పారు. ఈ సంవత్సరం జనవరి నాటికి ఖరగ్‌పూర్ ఐఐటీలో 742 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. వీరిలో 92% మంది జనరల్ కేటగిరీ వారే. 40 మంది ఓబీసీలు, 17 మంది ఎస్సీలు, కేవలం ఇద్దరు మాత్రమే ఎస్టీలు ఫ్యాకల్టీ స్థాయిలో ఉన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రవేశాలు, ఫ్యాకల్టీ నియామకాలలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5%, ఓబీసీలకు 27% రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంటుంది. గత సంవత్సరం ఈ సంస్థలో ఒక్క ఎస్టీని కూడా ఫ్యాకల్టీగా తీసుకోలేదు.

గత ఏడాది ఖరగ్‌పూర్ ఐఐటీ 101 మంది బోధనా సిబ్బందిని నియమించింది. వీరిలో ఎస్సీలు ఇద్దరు మాత్రమే ఉండగా ఓబీసీలు పది మంది ఉన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. 345 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తే వారిలో ఎస్సీలు 46, ఎస్టీలు 9, ఓబీసీలు 82 మంది ఉన్నారు. ఇది ఒక్క ఖరగ్‌పూర్ ఐఐటీలో నెలకొన్న పరిస్థితి మాత్రమే. దేశంలో మొత్తం 22 ఐఐటీలు ఉన్నాయి. అవన్నీ దాదాపుగా బలహీన వర్గాలకు సీట్లను నిరాకరిస్తున్నాయి. ఉదాహరణకు ఢిల్లీ ఐఐటీలో 32 డిపార్ట్‌మెంట్లు ఉండగా వాటిలో 25 బ్రాంచీలలో ఒక్క ఎస్టీ విద్యార్థి కూడా లేడు. పది డిపార్ట్‌మెంట్లలో ఎస్సీ విద్యార్థి లేడు. ఆరింటిలో ఓబీసీ విద్యార్థులు లేరు. పీహెచ్‌డీ ప్రవేశాలలో సుమారు 70% జనరల్ కేటగిరీకి చెందిన వారే ఉన్నారు. ఫలితంగా బలహీనవర్గాలకు దక్కాల్సిన 132 సీట్లను ఢిల్లీ ఐఐటీ నిరాకరించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆ సంస్థలో ఇద్దరు ఎస్టీ విద్యార్థులు మాత్రమే పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందారు.

గత ఎనిమిది నెలల కాలంలో ఐఐటీలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు వేధింపులు, వివక్ష భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు దళితులు కాగా ఒకరు ఓబీసీ. ఇక కాన్పూర్ ఐఐటీలో జనవరి నాటికి 567 మంది ఫ్యాకల్టీ సభ్యులు ఉండగా వారిలో 87% మంది జనరల్ కేటగిరీకి చెందిన వారే. ఈ సంస్థలోని 14 డిపార్ట్‌మెంట్లలో ఎస్టీ ఫ్యాకల్టీలు లేరు. 19 బ్రాంచీలలో ఒక్క ఎస్సీ ఫ్యాకల్టీ కూడా లేరు. మూడు బ్రాంచీలలో ఓబీసీ ఫ్యాకల్టీలు లేరు. బాంబే ఐఐటీలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ప్రస్తుత సంవత్సరంలో 394 మంది ఈ సంస్థలో చేరగా వారిలో 66% మంది జనరల్ కేటగిరీకి చెందిన వారే. 20 బ్రాంచీలలో ఎస్టీ విద్యార్థులు, 11 బ్రాంచీలలో ఎస్సీ విద్యార్థులు, ఐదు డిపార్ట్‌మెంట్లలో ఓబీసీ విద్యార్థులు లేరు.

పంటలకు నీరు విడుదల చేయాలని రాస్తారోకో

జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు

ఇరిగేషన్ డీఈఈ హామీతో విరమణ



నవతెలంగాణ -నంగునూరు

అక్కెనపల్లి పెద్ద వాగు లోకి రంగనాయక్ సాగర్ కుడి కాలువ నుంచి సాగు నీరు విడుదల చేసి పంట పొలాలను రక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద సిద్దిపేట-హన్మకొండ జాతీయ రహదారి పై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. వాగు అవతలి గ్రామాలైన అక్కెనపల్లి, ఘనపూర్ చెందిన సుమారు 50 మంది రైతులు ఆందోళనకు దిగారు. సాగు చేసిన పంటలకు సంబంధిత అధికారులు తక్షణమే సాగు నీరు అందించి పంట పొలాలను కాపాడి, ఆదుకోవాలని నినాదాలు చేశారు. సాగు చేసిన పంటలు ఎండుముఖానికి చేరుకున్నాయని రెండు రోజుల్లో సాగు నీరు అందకుంటే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పెద్దవాగు లోకి సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో వల్ల వాహనాలు ఆగిన విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి నప్పటికి రైతులు భీష్మించుకుని కూర్చున్నారు.

విషయాన్ని ఎస్ఐ భాస్కర్ రెడ్డి సంబంధిత ఇరిగేషన్ డిఈఈ చంద్రశేఖర్ కు అందించగా సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకోను విరమించారు. సుమారు 25 నిమిషాల పాటు రాస్తారోకో చేపట్టడంతో రహదారి పై వాహనాలు నిలిచి పోయాయి. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, నంగునూరు సొసైటీ చైర్మన్ కోల రమేష్ గౌడ్ రైతులకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రైతులు నాగేందర్, సత్యనారాయణ రెడ్డి, విజేందర్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సుధాకర్, యాదగిరి, సదానందం, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడిపై కొడవలితో దాడి

- చెవి, వీపు భాగంలో గాయాలు
- సీసీ కెమెరాకు చిక్కిన పాత నేరస్థుడు బాబా

నవతెలంగాణ-భువనగిరి

డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకునిపై పాత నేరస్థుడు, నయీమ్ అనుచరుడు వేట కొడవలితో దాడి చేశాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామానికి చెందిన శిగ నరేష్ భువనగిరిలో డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. సోమవారం సెంటర్ తెరిచి బయట ఫోన్ మాట్లాడుతుండగా పాత నేరస్థుడు, నయీమ్ అనుచరుడు రౌడీ షీటర్ బాబా అతనిపై వెనుక నుంచి వేట కొడవలితో దాడి చేశాడు. రెండు దెబ్బలు వేయగా నరేష్ పరిగెత్తి ప్రాణాలతో బయటపడ్డాడు. అతని చెవి, వీపు భాగంలో గాయాలయ్యాయి. నయీమ్ ఉన్నప్పుడు ల్యాబ్ ఖాళీ చేయాలని బెదిరించినట్టు సమాచారం. పాత కక్షలతోనే దాడి జరిగినటుగా పోలీసులు అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాలలో నిందితున్ని గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా బాధితుడు నరేష్ మాట్లాడుతూ బాబా అంబులెన్స్ నడిపిస్తున్నాడని, రెండ్రోజులుగా పాతకేసు ఉందని తన ల్యాబ్‌కు వచ్చిపోతున్నాడని ఇక్కడ పనిచేసేవారు తెలిపినట్టు వివరించారు. అతనితో తనకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఎలాంటి వివాదమూ లేదని తెలిపారు .గతంలో నయీమ్ పేరు మీద కొందరు తనను బెదిరించినట్టు వివరించారు.తనకు రక్షణ కల్పించాలని కోరారు. నరేష్‌ని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇలాంటి ఘటనలు జరగకుం డా పోలీసలు నిందితున్ని అదుపులోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబా కేసులో మహా సర్కార్‌కు సుప్రీం షాక్

తీర్పుపై స్టేకి అత్యున్నత న్యాయస్థానం నిరాకరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మావోయిస్టులతో లింకు ఉన్న కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించిన ముంబాయి హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన మహారాష్ట్ర సర్కార్‌కు చుక్కెదురైంది. మహారాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. త్వరగా ఈ కేసులో వాదనలు చేపట్టాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు చేసిన అభ్యర్థనను కూడా సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. సరైన సమయంలోనే ఈ కేసులో విచారణ ఉంటుందన్నారు. నిర్దోషిగా ప్రకటించిన తీర్పును అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సమంజసంగానే ఉందని, ప్రాథమికంగా నిర్ధారణ అవుతోందని వెల్లడించింది.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: సీతారాం ఏచూరి



సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నామని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంపై ఆయన స్పందించారు. "హైకోర్టు చాలా సహేతుకమైన తీర్పునిచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని స్వీకరించలేము" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని అన్నారు.

మణిపూర్‌లో పర్యటించండి

- మోడీని కోరుతూ మణిపూర్ యువతి నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: గతసంవత్సరం మే నుండి మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లేందుకు దేశ రాజధానిలో 26 సంవత్సరాల మాలెమ్ తంగమ్ నిరాహార దీక్ష ప్రారంభించి మూడు వారాలు గడిచాయి. మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించాలని, శాంతిని, సాధారణ పరిస్థితులను నెలకొల్పే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ఆమె కోరుతున్నారు. ఆపరేషన్స్ నిలిపివేతపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, కుకీ గ్రూపుల మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయాలని కూడా ఆమె డిమాండ్ చేస్తున్నారు. తంగమ్ గత నెల 22న తన స్నేహితులతో కలిసి ఢిల్లీ యూనివర్సిటీలో నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఆ తర్వాత ఆమె వివిధ రూపాల్లో తన నిరసనను తెలియజేశారు. ఫిబ్రవరి 27న తిరిగి మణిపూర్ చేరుకున్నప్పటికీ ఇంఫాల్‌లో దీక్షను కొనసాగించారు.

ఆత్మహత్యకు పూనుకున్నారన్న ఆరోపణపై మణిపూర్ పోలీసులు ఆమెను ఈ నెల 2న అరెస్ట్ చేశారు. ఐదవ తేదీని విడుదల చేసి తిరిగి 6న అరెస్ట్ చేశారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగేలా నిరసనలను తెలిపారం టూ ఆరోపణ మోపారు. తంగమ్ ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను పోలీసు లు ఆస్పత్రిలో చేర్చారు. అయితే చికిత్సకు నిరాకరించిన తంగమ్ తన దీక్షను కొనసాగిస్తున్నారు.

నిరూపిస్తే రాజీనామా చేస్తా

- నగేశ్‌తో నాకు వ్యాపారసంబంధాల్లేవు
- 17 తర్వాత గ్యారెంటీలపై నిలదీస్తాం : పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటీవల తమ పార్టీలో చేరిన మాజీ ఎంపీ నగేశ్‌తో తనకు ఎలాంటి వ్యాపార సంబంధాల్లేవనీ, ఉన్నట్టు ఎవరైనా నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ ఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నగేశ్ బీజేపీలోకి రావడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. అయనకు టికెట్ ఇవ్వాలని తాను ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు. తమ పార్టీ తనకన్నా లక్షరెట్లు ఎక్కువ ఆలోచిస్తుందనీ, ఎవరికి టికెట్ ఇవ్వాలన్నదని అధిష్టానం నిర్ణయమని తేల్చిచెప్పారు. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నేతల మధ్య ఎలాంటి విభేదాల్లేవని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ నెల 17కి వందరోజులు పూర్తవుతాయనీ, ఆ తర్వాత ఆరు గ్యారెంటీలపై తమ పార్టీ తరపున అడుగడుగునా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న క్యాబినెట్ సమావేశంలో గ్యారెంటీలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి అమలు చేయలేకపోతున్నామని చెబితే ఊరుకోబోమన్నారు. వందరోజుల్లోపు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు కూడా అడగబోమన్నట్టుగా ఎన్నికల ప్రచారంలో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. గ్యారెంటీలకు నిధుల్ని ఎక్కడ నుంచి సమకూర్చుకుంటారు? పథకాల మార్గదర్శకాలేంటి? తదితరాలపై క్యాబినెట్‌లో ప్రజలకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

నష్టాల్లో హరిత హోటళ్లు

రూ.100 కోట్లకు పైగా బకాయిలు

- నోటీసులు, కోర్టు కేసులతోనే సరి
- వసూలు చేయలేక చేతులెత్తేసిన సంస్థ
- కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతి చీడ
- కాంగ్రెస్ సర్కార్ కాయకల్ప చికిత్స చేయాలని వినతులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత పదేండ్లలో తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్‌టీడీసీఎల్) నిర్వీర్యమైంది. ఆర్థిక ప్రణాళిక లేకుండా కమీషన్ల కోసం ఇష్టారీతిన ఏర్పాటు చేసిన హరిత హోటళ్లు పీకల్లోతు నష్టాల్లో కూరుకు పోయాయి. లీజులు, సబ్‌లీజుల కేటాయింపుల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఫలితంగా రూ.100 కోట్లకు పైగా బకాయిలు పేరుకు పోయాయి. లీజు దార్లకు వకాల్తా పుచ్చుకున్న అధికారులు నోటీసులతోనే సరిపెట్టారనే విమర్శలున్నాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌టీడీసీఎల్‌కు కాయకల్ప చికిత్స చేసి గాడీలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 2020లో పలు హరిత రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వహణ కోసం టీఎస్‌టీడీసీఎల్ టెండర్లను పిలిచింది. బుద్ధవనంలోని హరిత హోటళ్లలో ఒకదానికి హైదరాబాద్‌కు చెందిన సూరజ్‌రామ్ హోటల్స్ అత్యధిక బిడ్డర్‌గా నిలిచింది. అయితే కాంట్రాక్ట్ మరొక బిడ్డర్‌కు వెళ్లింది. బెంగుళూరుకు చెందిన స్పైసెస్ రెస్టారెంట్ యజమాని రవిందర్ రావుకు కాంట్రాక్ట్ దక్కింది. దాంతో టెండర్ ప్రక్రియను సవాల్ చేస్తూ సదరు సూరజ్ రాం హోటల్స్ యాజమాన్యం హైకోర్టు తలుపుతట్టింది. ఇలాంటి విచిత్రాలు గత పదేండ్లలో అనేకం జరిగాయి. టూరిజం కార్పొరేషన్‌లో అధికారుల చేతివాటం వల్ల అనేక అక్రమాలు జరిగాయి. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత కూడా ఎలాంటి మార్పు కనిపించడం లేదని తెలుస్తోంది. ఒక్క ఎండీ మినహా అందరూ పాత అధికారులే ఉండటంతో గత సర్కార్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఎలా బయటకు వస్తాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా జరిగిన ఓ సంఘటన ఇందుకు అద్దం పడుతోంది. హన్మకొండలోని హరిత హోటల్‌ను టీఎస్‌టీడీసీఎల్ స్వయంగా నిర్వహిస్తోంది. ఈ హోటల్లో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపణలున్నాయి. దాంతో పక్షం రోజుల క్రితం అధికారులు విచారణకు ఆదేశించారు. విచారణకు ఒక రోజు ముందు ఆ హోటల్లోని కిచెన్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హరిత హోటల్ అక్రమాలపై, ఫిర్యాదులు, విచారణ నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగింది. ఉన్నతాధికా రులు క్షేత్రస్థాయి విచారణకు వస్తున్నారని తెలిసి స్థానిక సిబ్బందే మంటలు లేపారనే అనుమానాలు వ్యక్తమయ్యా యి. ఫుడ్ మెటిరీయల్‌కు లెక్కలు లేకపోవడం, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారనే ఆరోపణలు ఉన్నాయి. అత్యాధునిక పద్ధతులతో నిర్మించిన కిచెన్‌లో మంట లు చెలరేగడంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది. హరిత హోటళ్లను ఇష్టారీతిన కమీషన్ల కోసం నిబంధనలకు విరుద్ధంగా కేటాయించడం, వారి వద్ద నుంచి అద్దెలు వసూలు చేయకపోవడం షరా మామూలుగా మారింది. ఫలితంగా దాదాపు రూ. 100 కోట్ల వరకు బకాయిలు పేరుకు పోయాయి. వాటిని వసూలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. లీజు దారునికి నోటీసులు ఇచ్చి చేతులు దులువు కున్నారు. నోటీసులందు కున్న లీజుదారులు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చి ఏండ్లుగా నెట్టు కొస్తున్నారు. కమిషన్ల కోసం కోర్టుకు వెళ్లేలా కొంత మంది అధికారులు సహకరించినట్టు తెలుస్తోంది.

అసాంఘీక కార్యక్రమాలకు అడ్డా..

రాష్ట్రంలోని హరిత హోటళ్లు సెటిల్మెంట్లు, అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయనే విమర్శలు వినిపి స్తున్నాయి. పర్యాటకులకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచా ల్సిన టూరిస్టు ప్రాంతాల్లో జరుగుతున్న కార్యకలాపాలు అధికార వర్గాలకు సైతం పెద్ద తలనొప్పిగా మారింది. లీజు తో పాటు సొంతగా నడుపుతున్న హోటళ్లలో సైతం ఈ దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందనే విమర్శలు న్నాయి. పలు హోటళ్లపై పోలీసులు దాడి చేసి కేసులు నమోదు చేసిన దాఖలాలు సైతం ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ వీటిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

మోడీని కడుగుతాం.. కేడీని ఉతుకుతాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలేనన్నారు. ఖమ్మం జిల్లాలో 9 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ఖమ్మం నుంచి ప్రారంభించామన్నారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో హామీలను అమలు చేయకుండా కేసీఆర్ మోసం చేశారు కాబట్టే ప్రజలు బీఆర్ఎస్‌ను 100 మీటర్ల లోతుకు తొక్కారని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బలరాం నాయక్‌ను లక్షన్నర మెజార్టీతో గెలవనున్నారని జోస్యం చెప్పారు.

పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగుద్దా..?

తాము మంచి చేస్తుంటే చూడబుద్ధి కాక తండ్రీకొడుకులు, బిడ్డ, అల్లుడు శాపాలు పెడుతున్నారన్నారు. 'ఉట్టిమీద ఉన్న పాల కోసం కింద ఉన్న పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టి తెగుద్దా?' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు, చీకటి ఒప్పందాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. మోడీ, కేడీ కలిసినా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలయ్యాక ఈ ప్రభుత్వం ఉండదని బీజేపీ నాయకుడు డాక్టర్ లక్ష్మణ్ రోజుకోసారి అంటున్నారని, ఆ పార్టీకి ఉన్న 8 మంది ఎమ్మెల్యేలతో ఎలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన 9 సీట్లలో బీఆర్ఎస్ తన అభ్యర్థులను ప్రకటించలేదని, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నాలుగు సీట్లలో బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదని ఆరోపించారు. కలిసి కనిపిస్తే తెలంగాణ ప్రజలు ఒప్పుకోరనే భయంతో, చీకట్లో ఒప్పందం చేసుకొని అలాయ్ బలాయ్ చేసుకొని మోడీ, కేడీ కాంగ్రెస్ ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని అన్నారు. తాను గేట్లు తెరిస్తే

బీఆర్ఎస్.. బిల్లా రంగా సమితి..

ఇందిరమ్మ ఇండ్లు వద్దు.. అవి డబ్బా ఇండ్లు అంటూ కేసీఆర్ భాష, యాసలతో మోసగించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యుడు తూర్పున ఉదయించి.. ప్రపంచానికి ఎలా వెలుగు ఇస్తాడో.. అలానే తెలంగాణకు ఖమ్మం జిల్లా భద్రాచలం, మణుగూరు తూర్పునే ఉంటుందని, అందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని భద్రాచలంలో శ్రీరామచంద్రస్వామి ఆశీర్వాదంతో ప్రారంభించామన్నారు. 90 రోజుల్లోనే తాము హామీలన్నీ అమలు చేస్తున్నామని, బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు పదేండ్లలో అమలయ్యాయా అని కేటీఆర్ ఆయన తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించాలని సూచించారు. బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి అని, హరీశ్‌రావు, కేటీఆర్ రాష్ట్రాన్ని కొల్లగొట్టిన తోడు దొంగలని మండిపడ్డారు. కేసీఆర్ ఛార్లెస్ శోభరాజ్ అని, ఆయన పాపాలతో కాళేశ్వరం కూలిపోయి, మేడగడ్డ మేడిపండై, అన్నారం పగిలిపోయి సుందిళ్ల దెబ్బతిందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రారంభిస్తే సీతారామ, భక్తరామదాసు ఎత్తిపోతల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్లు కొల్లగొట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తాగడానికి నీళ్ల లేకుండా చేసిందన్నారు. ఈ దేశంలో మాట తప్పని, మడమ తిప్పని నాయకులు సోనియా గాంధీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. అధికారంలోకి వచ్చిన 92 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని హామీ ఇచ్చిన మోడీ.. ఈ పదేండ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. అలా చేసి ఉంటే తెలంగాణలో 60 లక్షల ఉద్యోగాలు వచ్చేవని, నిరుద్యోగ సమస్య ఉండేది కాదని అన్నారు. కేసీఆర్, మోడీ ఒక్కటై ప్రజలపై భారాలు మోపారన్నారు. రూ.500 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200 చేశారని, రూ.55 ఉన్న పెట్రోల్‌ను రూ.110 చేశారని వివరించారు. నాడు వైఎస్ఆర్ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన చోట తాము ఓట్లు అడుగుతామని, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చిన చోట కేసీఆర్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇండ్లున్న చోట మోడీ ఓట్లు అడగగలరా అని ప్రశ్నించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు బొమ్మకే పరిమితం : మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వ పదేండ్ల పాలనలో ఎన్ని ఇండ్లు ఇచ్చారని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు బొమ్మకే పరిమితమైందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిన గత ప్రభుత్వం భద్రాద్రి రాముడికి రూ.100కోట్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదో గ్యారంటీగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మంజూరు చేస్తామని తెలిపారు. దళిత, గిరిజనులకు రూ.6లక్షల చొప్పున, మిగిలిన వారికి రూ.5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి ఇస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2.90లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల టెండర్లు పిలిచి 1.49 లక్షలు మాత్రమే నిర్మించి.. కేవలం 90వేలు మాత్రమే లబ్దిదారులకు పంపిణీ చేసిందని తెలిపారు. గత ప్రభుత్వం లాగా పింక్ కండువాలకే కాకుండా.. గ్రామసభలు నిర్వహించి అర్హులందరికీ ఇండ్ల పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ఈ సభల్లో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, రాంచందర్ నాయక్, తెల్లం వెంకట్రావ్, కూనంనేని సాంబశివరావు, రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షులు పోదెం వీరయ్య, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



జేవీవీ నేత అనుమకొండ సురేష్ కన్నుమూత

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య సబ్‌కమిటీ కన్వీనర్ అనుమకొండ సురేష్ (60) సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన కొంతకాలం యశోద ఆస్పత్రిలో చికిత్స తీసుకుని కోలుకున్నారు. మళ్లీ వ్యాధి తిరగబడటంతో పది రోజుల క్రితం కుటుంబసభ్యులు ఆయన్ను ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం సురేష్ మృతిచెందారు. మృతదేహాన్ని తెల్లాపూర్‌లోని ఆయన కుమార్తె ఇంటికి తరలించారు. మంగళవారం ఉదయం తెల్లాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.సురేష్ మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. 1995లో సీపీఐ(ఎం)లో చేరిన సురేష్...ప్రజాశక్తి దినపత్రికలో కూడా పనిచేశారు. మెడికల్ రిప్రజెంటేటివ్ సంఘం రాష్ట్ర నాయకునిగా, విశాఖ సిటీ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శిగా సేవలందించారు. సురేష్ మృతిపట్ల వార్వా నివాస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజా, ఇతర నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆ నాలుగు జిల్లాలు
సింగరేణి స్థానికతే...

- డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి పొన్నం
- సవరిస్తామని హామీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలు సింగరేణి స్థానికత కిందికే వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. జిల్లాల పునర్విభజన సమయంలో గత ప్రభుత్వం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, అక్కన్నపేట్, కొహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో కలిపారనీ, దీనితో ఇక్కడి ఉద్యోగావకాశాలు హైదరాబాద్ జోన్‌లోకి రావడంతో సింగరేణి ఉద్యోగాలకు స్థానికతను కోల్పోయారని వివరించారు. ఈ విషయాన్ని ఆయా మండలాలకు చెందిన నిరుద్యోగులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయాన్ని ఆయన డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే సింగరేణి సీఎండీతో మాట్లాడారు. సమస్యను చర్చించి, ఉద్యోగావకాశాల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆ నాలుగు మండలాలకూ సింగరేణి స్థానికత వర్తిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇక నుంచి సింగరేణి కాలరీస్ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఉమ్మడి నాలుగు జిల్లాల నిరుద్యోగులకు అర్హత ఉంటుందని స్పష్టం చేశారు.

సీఎం సారు మాటిచ్చారు.. క్రమబద్ధీకరించండి

- చాయ్ తాగేలోపే చేస్తానన్న మాటలను గుర్తుచేసుకుంటున్న సీఆర్పీలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న 2వేలకుపైగా సీఆర్పీ కుటుంబాలు
- చాలీచాలని వేతనాలతో ఏండ్లుగా శ్రమదోపిడీకి గురవుతున్నామని గగ్గోలు..
- ఏపీలో ఒక సీఆర్పీకి ఇచ్చే జీతంకంటే రూ.5-6వేలు తక్కువ వేతనమే చెల్లింపు..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యాబుద్ధులతో సమాజాభివృద్ధి సాధ్య మంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతియేటా వందల కోట్లు వెచ్చిస్తున్నాయి. విద్యాశాఖలో పనిచేసే ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బందికి భారీగా వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తున్నాయి. కానీ వారితో పాటే ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లపై (సీఆర్పీల) మాత్రం ప్రభుత్వాలు కనికరం చూపడం లేదు. పదేండ్లుగా శ్రమ దోపిడీకి గురవుతున్నామని సీఆర్పీలు గగ్గోలు పెడుతున్నారు. తాము చాలీచాలని వేతనాలతో బతుకుబండి లాగాల్సిన దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటు న్నామని చెబుతున్నారు. తమకు ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించకపోగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కూడా చెల్లించడం లేదని వందలాది సీఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2011లో ఎమ్మార్పీ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం సెక్షన్ 25(1), 25(2) ప్రకారం పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యా యులు బోధనేతర పనులు చేయడానికి వీలులేదు. సెక్షన్ 27 మినహా జనాభా లెక్కలకు, ఎన్నికల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం వినియోగిం చుకుంటుంది. ఆ నేపథ్యంలో ఎమ్మార్పీ వ్యవస్థను రద్దు చేసి.. సీఆర్పీల వ్యవస్థను ప్రభుత్వం సర్వశిక్షాభియాన్ ద్వారా తీసుకువచ్చింది. ఈ వ్యవస్థలో పనిచేసే సీఆర్పీ లను నియమించడానికి డిగ్రీతో పాటు బీఈడీ లేదా టీటీసీ, టెట్ అర్హత చూస్తోంది. వారికి వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో చెల్లించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చే నిధుల నుంచి మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం సీఆర్పీలకు అమలు చేయడం లేదు. ఒక్కో కాంప్లెక్స్‌లో సుమారు 18 పాఠశాలలు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1817 కాంప్లెక్సులుండగా 2,117 మంది సీఆర్పీలు పని చేస్తున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం రూ.19,500 మాత్రమే వేతనాలు చెల్లిస్తూ.. కాలం వెళ్లదీస్తున్నది. ఏపీలో రూ.23,500 ఇవ్వడం గమనార్హం. దాంతో స్వరాష్ట్రంలో మంచి రోజులు వస్తాయని భావించిన వారికి.. 5-6వేల తక్కువ వేతనంతో పని చేయాల్సిన దుస్థితి దాపురించింది. కాంగ్రెస్ పార్టీ హయాంలోనైనా సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరుగుతుందని గంపెడాశలతో సీఆర్పీలు ఎదురుచూస్తున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలకు సీఆర్పీల సేవలే దిక్కు!

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించడం, పాఠశాల లను సందర్శించి నివేదికను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయు లకు, హైదరాబాద్ పరిధిలో డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లకు, జిల్లాల్లో ఎంఈవోలకు అందజేస్తారు. అలాగే ఆ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ప్రతి నెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తారు. ఆ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని రకాల రిజిస్టర్లను అందుబాటులో ఉంచుతారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు హాజరు కానీ పక్షంలో... ఆ రోజు పాఠశాల విధులను సీఆర్పీలు నిర్వర్తిస్తారు. మధ్యాహ్న భోజనం పని తీరును ప్రతినిత్యం పరిశీలించాలి. మరుగు దొడ్లు, స్కూల్ జీఐఎస్ ఛాయాచిత్రాలను అప్ లోడ్ చేయడం, విద్యార్థులకు పుస్తకాలు, యూని ఫామ్స్, పరీక్ష పేపర్లు అందేలా చూడటం వీరి బాధ్యత. మన ఊరు- మన బడి, చదువు-ఆనందించు-అభివృద్ధి చెందు కార్యక్రమాల పర్యవేక్షణ, స్వచ్ఛ పాఠశాల వంటి కార్యక్రమాల్లో సీఆర్పీలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సీఆర్పీలు ప్రతిరోజూ 20-30 కిలోమీటర్లు కాంప్లెక్స్ పరిధిలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయు లకు ప్రతినిత్యం ఫోన్ ద్వారా సమాచారం అందిస్తూ ఉంటారు. గతంలో ఎమ్మార్పీ వ్యవస్థ ఉన్నప్పుడు వారికి రవాణా భత్యం, ఫోన్ బిల్లులు చెల్లించేవారు. కానీ ఇప్పుడు సీఆర్పీలకు చెల్లించడం లేదు. అనేక రకాల పనులు చేస్తున్న సీఆర్పీలకు అతి తక్కువ వేతనంతో పాటు రవాణా భత్యం (టీఏ), ఫోన్ బిల్లులు చెల్లించక పోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవు తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా విధి నిర్వహణలో దాదాపు 10 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు రోడ్డు ప్రమాదాలకు గురికాగా.. ముగ్గురు సీఆర్పీలు ప్రాణాలు కోల్పోగా.. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కానీ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్కరినీ ఆదుకోలేదు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. అంతేగాక గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలో సీఆర్పీల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చాయి తాగేలోపు మినిమం టైం స్కేల్ సీఆర్పీలకు ఇవ్వొచ్చునని చేసిన వ్యాఖ్యలను వారు గుర్తుచేస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించి అధికారం చేపట్టింది కూడా. ఆనాడు సీఆర్పీలకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలని వారు కోరుతున్నారు.

సీఆర్పీలను రెగ్యులరైజ్ చేయాలి



గత ప్రభుత్వం ఎన్నికల ముందు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం పథకం పేరిట సీఆర్పీలను రెగ్యులర్ చేయకుండా దశాబ్దకాలం మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం సీఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం. భవిష్యనిధి నగదు రహిత వైద్య సదు పాయం కల్పించాలి. గతేడాది సెప్టెంబర్ 13న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హన్మకొండలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

- తిరందాస్ సంతోష్ కుమార్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్ (టీసీఆర్పీఏ)

పొరుగునున్న ఏపీలో జీతాలు పెరిగాయి



పొరుగునున్న ఏపీలో ప్రస్తుతం సీఆర్పీల వేతనం నెలకు రూ 23,500 చెల్లిస్తుండగా.. మన రాష్ట్రంలో అయిదేండ్లుగా రూ.19,500 చెల్లిస్తున్నారు. చని పోయిన ఒప్పంద ఉద్యోగులకు సాధారణ మరణమైతే రూ.2లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, అంత్యక్రియలకూ ఖర్చులు చెల్లిస్తున్నారు. మహిళా కాంట్రాక్టు ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వంటి అనేక సదుపాయాలు కల్పిస్తు న్నారు. మన రాష్ట్రంలో అలాంటి సదుపాయాలు లేవు.

- నవనీత రెడ్డి, (సీఆర్పీ సికింద్రాబాద్), టీసీఆర్పీఏ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

నిషేధిత భూముల్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంది

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయం వద్ద కమిటీ సభ్యులు సునిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్ట్ బీలోకి వెళ్లిన పేదల భూములకు విముక్తి కలగక పోగా నిషేధిత జాబితాలో ఉన్న సర్కార్ భూములను బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారి పేరిట బదలాయించారని ఆరోపించారు. మాజీ ఎంపీ సంతోష్ రావు కుటుంబీకుల పేరిట జరిగిన భూ కుంభకోణమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంపెనీలను కాదని, విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతను అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ ఇవ్వడం వెనక పెద్ద భూ కుంభకోణం దాగుందని అన్నారు. మొదట ఐఎల్ఎఫ్ఎస్‌కు, అనంతరం టెర్రాస్‌కు, ఆ తర్వాత క్వాంటెల్లా సంస్థకు ధరణి బాధ్యతలను అప్పగించారని గుర్తు చేశారు. 2020లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం ఆధారంగా ఏర్పాటు చేసిన లోపభూయిష్టమైన ధరణి వ్యవస్థ వల్ల పేదలు భూమిపై హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 70 లక్షల మంది రైతులకు చెందిన కోటి 35 లక్షల ఎకరాల భూమిని ధరణి అనే చెరసాలలో పెట్టి ఇష్టా రాజ్యంగా కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు బదలాయించుకున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్ అప్పగింతతో పాటు దాని ద్వారా జరిగిన భూ అక్రమాలను ఆధారాలతో సహా బయట పెడతామని తెలిపారు.

లక్ష దరఖాస్తులకు మోక్షం : సునీల్

ఈ నెల 1 నుంచి 9 వరకు నిర్వహించిన ధరణి స్పెషల్ డ్రైవ్‌లో పరిష్కరించిన లక్ష దరఖాస్తులను త్వరలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ధరణి కమిటీ సభ్యులు సునిల్ తెలిపారు. ఇందుకు సంబంధించి మాడ్యూల్స్‌లో మార్పులు చేస్తున్నామన్నారు. రెండో దఫా స్పెషల్ డ్రైవ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తుల పరిశీలనకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో 2 నుంచి 3 బందాలు పని చేస్తాయని చెప్పారు. అసైన్మెంట్, ఇతర ముఖ్య భూ వివాదాలకు సంబంధించి మాత్రం తహసీల్దార్ ధ్రువీకరించిన తర్వాత, సమస్యను బట్టి, ఆర్డీవో, కలెక్టర్, అనంతరం సీసీఎల్‌కు బదిలీ చేస్తారనీ, తుది నిర్ణయం సీసీఎల్ తీసుకోనుందని వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్ అనంతరం ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ఎలాంటి తప్పులు జరగకుండా మూడు స్థాయిల్లో పరిశీలన చేసి నివేదికలను రపొందిస్తున్నామని చెప్పారు.

ధరణి స్పెషల్ డ్రైవ్ పొడగింపు

రాష్ట్రంలో కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్‌ను ప్రభుత్వం మరో వారం పొడిగించింది. ఈ నెల 11 నుంచి 17 వరకు పొడగిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 9 వరకు నిర్వహించిన మొదటి విడత స్పెషల్ డ్రైవ్‌లో లక్ష ధరఖాస్తులకు పరిష్కారం లభించగా, మాడ్యూల్లో మార్పుల అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న క్వాంటెల్లా సంస్థ మార్పులు చేర్పులకు సంబంధించిన లాగిన్ ఆథరైజేషన్‌ను తహసీల్దార్లు, ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లకు ఇంకా బదలాయించలేదు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి ఆమోదయోగ్యమైనవని ఎంఆర్‌వోలు నివేదికలు ఇచ్చినా వాటిని పోర్టల్‌లో నమోదు చేయలేదు. సాంకేతిక కారణాల వల్లనే వాటిని ఇంకా పోర్టల్‌లో ఎక్కించలేదని తెలుస్తోంది. కాగా ప్రభుత్వం గత నెల 29న ఇచ్చిన మెమో ఆధారంగా రెండో విడతలో పెండింగ్ భూ సమస్యలను పరిష్కరించనున్నట్టు స్పెషల్ డ్రైవ్ పొడగింపు కోసం జారీ చేసిన మెమోలో సీసీఎల్ఏ పేర్కొంది. కరెక్షన్ చేసిన దరఖాస్తుల వివరాలను డిజిటల్ రూపంలో భద్రపర్చనున్నారు. ఆధార్ నెంబర్ మిస్ మ్యాచ్, రైతుల పేర్లు తప్పుగా నమోదై ఆగిపోయిన అప్లికేషన్లు, ఫొటో మిస్ మ్యాచ్‌లకు రెండో దఫాలో పరిష్కారం లభించనుంది. దరఖాస్తుదారునికి ఫోన్, వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం అందించనున్నారు. అప్లికేషన్లను క్లియర్ చేసే ముందు ప్రభుత్వ రికార్డుల్లో వాటి వివరాలను నమోదు చేస్తారు. రెండో దఫా తర్వాత కూడా తిరస్కరణకు గురయిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు సీసీఎల్ఏకు రిపోర్ట్ చేయనున్నారు.

డిప్యూటీ సీఎం పట్ల కులవివక్ష సరికాదు

- ఆధిపత్య కులదురహంకారానికి ఇది నిదర్శనం
- సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి
- కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పట్ల కుల వివక్ష పాటించటం దారుణమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, తప్పెట్ల స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాదాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ప్రభుత్వం తరఫున వెళ్ళిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నేలపై కూర్చోబెట్టి సీఎం రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వారి సతీమణుల సైతం కుర్చీల్లో కూర్చున్నారని తెలిపారు. భట్టి విక్రమార్క పట్ల కుల వివక్ష పాటించారనీ, ఇది ఆధిపత్యకుల దురహంకారా నికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అమానుష సంఘటనను ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

సాగు చేస్తున్న భూమి ఇతరులకు ఇవ్వం

- అటవీ అధికారులను అడ్డుకున్న ఆదివాసులు

నవతెలంగాణ - కడెం

తాము చదును చేసి సాగు చేసుకుంటున్న భూమిని ఇతరులకు ఇవ్వడాన్ని ఆదివాసీ గిరిజనులు వ్యతిరేకించారు. కొలతలకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ శివారులోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల అటవీ భూమిలో పునరా వాసుల కోసం సోమవారం రెవెన్యూ అధికారులు కొలతలు చేపట్టేందుకు వెళ్లారు. అయితే, నచ్చన్‌ఎల్లాపూర్ ఆదివాసీ గిరిజనులు అడ్డుకున్నారు. ఖానాపూర్ డివిజనల్ అటవీ శాఖ అధికారి భవాని శంకర్, సీఐ మోహన్ గిరిజనులతో గంటల తరబడి చర్చలు జరిపారు. గతంలో ఆ భూమిని తాము చదును చేసుకొని వ్యవసాయం సాగు చేశామని, తమపై కేసులు కూడా నమోదయ్యాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం



చేశారు. ఆ భూమిని తమకే కేటాయిం చాలని డిమాండ్ చేశారు. కాగా, తాత్కాలికంగా కొలతలు వేసేందుకు గిరి జనులు ఒప్పుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాథోడ్ సుదర్శన్, తహసీల్దార్ సుజాత, ఎఫ్ఆర్ఓలు అనిత, వినాయక్, రామకృష్ణ రావ్, డీఆర్వో సిద్ధార్థ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్రియేటర్స్ అవార్డ్సుకు గుండోజు వెన్నెల హాజరు



నవతెలంగాణ - హైదరాబాద్

కేంద్ర ఐటి, కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన నేషనల్ క్రియేటర్స్ అవార్డ్స్ కార్యక్రమానికి తెలంగాణ నుంచి గుండోజు వెన్నెల హాజరయ్యారు. మహిళ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో 23 మంది యువతులకు నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. యువతలో సృజన శీలతను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఐటి శాఖ ఏర్పాటు చేసిన ఈ అవార్డుల కార్యాక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన డిజిటల్ క్రియేటివిటీలో అద్భుత ప్రతిభా కలిగిన కొంతమంది యువతులకు ప్రత్యేక ఆహ్వానాలను పంపారు. దీనికి తెలంగాణ నుంచి హైదరాబాద్ నగరానికి చెందిన బిటెక్, ఢిల్లీ యూనివర్శిటీలో లా పూర్తి చేసిన యువతి గుండోజు వెన్నెల హాజర య్యారు. రాబోయే కాలంలో తాను ఎంపిక చేసుకున్న విభాగంలో అద్భుత మైన డిజిటల్ కంటెంట్‌ని క్రియేట్ చేసి విశ్వ వేదికపై ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటానని వెన్నెల విశ్వాసం వ్యక్తం చేశారు. వచ్చే 2025లో నేషనల్ క్రియేటర్స్ అవార్డుల జాబితాలో తమ కుమార్తె పేరు ఉంటుందని వెన్నెల తల్లి దండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల ఫిట్‌మెంట్‌ను 30 శాతానికి పెంచాలి

- బకాయిలు చెల్లించాలి
- సర్వీస్ కండీషన్లపై యూనియన్లతో చర్చించాలి
- టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన 21 శాతం ఫిట్‌మెంట్‌ను 30 శాతానికి పెంచాలని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పనిభారాలు పెరిగాయన్నారు. ఇప్పుడు ప్రకటించిన 21 శాతం ఫిట్‌మెంట్ 2017 నాటిదనీ, ఆర్టీసీ కార్మికులకు ఇంకా 2021 వేతన సవరణ జరగాల్సి ఉందని గుర్తుచేశారు. దానితో పాటే 2025లో మరో వేతన సవరణ జరగాల్సి ఉంటుందని చెప్పారు. 2021 వేతన సవరణ అమలు చేసేంత వరకు ఇప్పటిదాకా అమలు చేస్తున్న 16 శాతం మధ్యంతర భృతిని భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరారు. వేతన సవరణ బకాయిలు రిటైర్మెంట్ సమయంలో చెల్లించటం వల్ల పీఎఫ్ చెల్లింపులో యాజమాన్య వాటాను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వచ్చే మూడు, నాలుగేండ్లలో రిటైరయ్యే వారికి హయర్ పెన్షన్ పెంపుదలలో ఇబ్బందులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్లతో సర్వీసు కండీషన్లపై చర్చలు చేసేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలవెన్సుల్ని ఐదురెట్లు పెంచాలని కోరారు. ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలని అనుమతించటం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

జీతాల కోసం మోడల్ స్కూల్ టీచర్ల ఎదురుచూపు

- వెంటనే చెల్లించాలి : టీఎంఎస్టీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫిబ్రవరి జీతాల కోసం మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. వెంటనే చెల్లించాలని టీఎంఎస్టీఏ అధ్యక్షులు భూతం యాకమల్లు, ప్రధాన కార్యదర్శి కె నగేశ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికీ జీతాలు అందక 5,500 మంది మోడల్ స్కూల్ సిబ్బంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న రెగ్యులర్ ఉద్యోగు లందరికీ ఒకటో తేదీన జీతాలిచ్చిందని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులైనా మోడల్ స్కూల్ సిబ్బంది జీతాలు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. బడ్జెట్ లేక పోవడంతో జీతాలు రాలేదని పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

టీఎన్జీవో అధ్యక్షులుగా మారం జగదీశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల (టీఎన్జీవో) కేంద్రసంఘం నూతన అధ్యక్షులుగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. టీఎన్జీవో ప్రధాన కార్యదర్శిగా ఉన్న జగదీశ్వర్‌ను రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్న అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కేంద్ర సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో ఉద్యోగుల సమస్యల సాధనకు కృషిచేస్తామని అన్నారు. ప్రభుత్వంతో చర్చల ద్వారా అన్ని సమస్యలనూ పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 ఎమ్మెల్యే స్థానాలు

- జనసేనకు కోత
- బాబు నివాసంలో కుదిరిన ఒప్పందం

అమరావతి : గత ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా సాధించని బీజేపీ తాజా ఎన్నికల్లో ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. ఉండవల్లిలోని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నివాసంలో సోమవారం జరిగిన మూడు పార్టీల నేతల కీలక భేటీలో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో చంద్రబాబునాయుడుతో పాటు, కేంద్రమంత్రి గజేంద్ర షేకావత్ , బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు జైజయంత్ పాండా, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశం సాగింది.

సీట్ల లెక్క ఇలా...

పార్టీ	ఎంపిస్థానాలు	ఎమ్మెల్యే స్థానాలు
బీజేపీ	6	10
టీడీపీ	17	144
జనసేన	2	21

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

'రంజాన్ సందర్భంగా సమస్యలు తలెత్తకుండా చూడాలి'



నవతెలంగాణ-సంతోష్ నగర్

రంజాన్ పండుగ సందర్భంగా ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని అధికారులతో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గార్బేజీ, గాంధీనగర్ అస్మాన్ ఘడ్, సైదాబాద్ డివిజన్ పరిధిలో పర్యటించారు. రంజాన్ పండుగ సందర్భంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడవలసిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదన్నారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

ముస్లింలకు రంజాన్ మాసం శుభాకాంక్షలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు కఠినంగా ఉపవాస దీక్షలు పాటిస్తూ, ప్రార్థనలు చేసి దైవ చింతనలో గడపటం గొప్ప విషయ మన్నారు.దైవ భక్తి,క్రమశిక్షణ,ధార్మిక చింతనల కలయికే కాక రంజాన్ మాసం పేదలకు అండగా ఉండాలనే గొప్ప సందేశం ఇస్తుందన్నారు.ఉపవాసం (రోజా) ఉండి పేదల ఆకలి బాధలు తెలుసుకొని ఫిత్రా,జాకాత్ లతో వారికి ఉన్న దాంట్లో దాన ధర్మాలు చేసే గొప్ప ధార్మిక మాసంగా రంజాన్ నెల ఉంటుందన్నారు.

మేయర్ పై వీగిన అవిశ్వాస తీర్మానం

- సరైన కోరం లేకపోవడంతోనే..
- నమ్మించి మోసం చేశారు : కార్పొరేటర్ నీలా రవి నాయక్



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ పై పెట్టిన అవిశ్వాసం వీగడంతో ఉత్కంఠకు నేటితో తెరపడింది. గత నెలలో 31మంది కార్పొరేటర్లు మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నిరూపణకు కందుకూర్ ఆర్డీవో సూరజ్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బీజేపీ కార్పొరేటర్లు 14 మంది, బీఆర్ఎస్ కార్పొరేటర్లు 8 మంది, కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏడుగురు కార్పొరేటర్లు సమావేశానికి హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గాలంటే 31మంది కార్పొరేటర్లు అవసరం. కానీ సమావేశానికి 29మంది కార్పొరేటర్లు మాత్రమే రావడంతో సమావేశం నిర్వహించాలంటే 2/3 మెజారిటీ(కోరం 31) లేదు. అయినా మరో గంట సమయం అవకాశం ఇస్తూ నోటీస్ ఇచ్చారు. అయినా కార్పొరేటర్లు 29మంది మాత్రమే ఉండడంతో ప్రిసైడింగ్ అధికారి సమావేశం నిర్వహించటానికి అవసరమైన సంఖ్య లేనందున అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్టు ప్రకటించారు.

నమ్మించి మోసం చేశారు..

అవిశ్వాసం వీగిపోవడానికి ప్రధాన కారణం ముగ్గురు కార్పొరేటర్లు రాకపోవడం. స్థానిక ఎమ్మెల్యే ముగ్గురు కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసింది. ఆ ముగ్గురు కార్పొరేటర్లు నమ్మించి మోసం చేశారు. చివరి సమయం వరకు వస్తున్నాం అని చెప్పి రాకుండా పోయారు.

\- కార్పొరేటర్ నీలా రవి నాయక్ (మేయర్ అభ్యర్థి)

ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

- బీజేపీకి ఎస్‌బీఐ వత్తాసు పలకడం సిగ్గుచేటు.
- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్



నవతెలంగాణ-తుర్కయంజాల్

ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ వెంటనే బహిర్గతం చేయాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ లోని ఎస్‌బీఐ బ్రాంచ్ ముందు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేసి ఎస్‌బీఐ మేనేజర్‌కు మెమోరండం అందజేశారు. సీపీఐ(ఎం) తుర్కయాంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశించినా ఎన్నికల బాండ్ల విషయంలో ఎస్‌బీఐ ప్రదర్శిస్తున్న కపటత్వాన్ని, దాపరికాన్ని, పారదర్శకతని పాతరేసే విధానాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడంతో ఎస్‌బీఐ కస్టమర్ల విశ్వాసం కోల్పోతోందని అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీజేపీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన లెక్కల్లో వారికి రూ.2360.84కోట్ల వివరాలు రాగా, రూ.2120.06 కోట్లు ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో వచ్చిందని పేర్కొన్నారని చెప్పారు. అలాంటి విషయాన్ని బయట పెట్టమని సుప్రీంకోర్టు కోరితే సాంకేతిక సమస్యలను చూపి సాగదీసి పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను దాటించి బీజేపీకి సహాయపడే వైఖరిని ఎస్‌బీఐ ప్రదర్శిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఎస్‌బీఐ యాజమాన్యం బీజేపీ చేస్తున్న అవినీతి అరాచకత్వాన్ని పెంచి పోషించే విధంగా తోడ్పడడం అత్యంత దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనుక ఎలక్ట్రోరల్ బాండ్ల వివరా లను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. సామేల్, డి.జగదీష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె జగన్, ఇ.నర్సింహ, ఆలంపల్లి నరసింహ, ఏ రవికుమార్ నాయకులు ఎంఎ ప్రకాష్ కరత్, బి.శంకర్, ప్రణయ్, మస్కు చరణ్, జె రుద్ర కుమార్, జీ కుర్మయ్య, సీహెచ్ ఎల్లేష్, వెంకన్న, ఎం.విజయ్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యల మీద సాధ్యసాధ్యాలపై చర్చించి వాటి పరిష్కరిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ ఇంద్రప్రస్థ కాలనీలో మాతృభూమి ఉత్సవ సమితి, సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో కెత్రిష్ ల్యాండ్ మార్క్ అపార్ట్మెంట్‌లో దాదాపు 23 కాలనీ వాసులకు సంబంధించిన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దానిలో భాగంగా ముఖ్యంగా ఆనంద్ నగర్ నుంచి పతుళ్ళగూడ వైపు వెళ్లే దారి ఇరుకుగా ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆయన దష్టికి తెచ్చారు. రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. అదేవిధంగా స్ట్రీట్ లైట్స్,నూతన మంచినీటి పైప్ లైన్స్ వ్యవస్థ, సీ.సీ.కెమెరాలు,ప్రస్తుతం ఉన్న డ్రైన్స్ స్థానంలో నూతన డ్రైన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన అదనపు మంచినీటి పైప్ లైన్స్, నూతన డ్రైన్స్ కోసం ఇప్పటికే వాటర్ వర్క్స్ ఎండీని కలవగా ఆయన అదనపు పైప్ లైన్స్ మంజూరు చేసినట్టు చెప్పారు. మంచినీటి సౌకర్యం లేని శివారు కాలనీ వాసులందరికీ నూతన వాటర్ పైప్ లైన్స్ వేయిస్తామని తెలిపారు. అలాగే స్ట్రీట్ లైట్స్, అదనపు డ్రైన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయించడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్డు వెడల్పు విషయంలో సాధ్యాసాధ్యాలపై చర్చించి తగు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సుర్వీ రాజు గౌడ్,సతీశ్ యాదవ్, పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బకుంటను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ గ్రామ కంఠం పరుధిలోని దుబ్బకుంట కట్టను చదును చేసి హద్దులు చెరిపి కబ్జాకు పాల్పడుతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెర నుంచి దుబ్బకుంటను కాపాడాలని కోరుతూ తుర్కయంజాల్ గ్రామ యువకులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డివోలకు వినతి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తుర్కయం జాల్ మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి వెంటనే బోర్డ్ ఏర్పాటు చేయాలని చెప్పారన్నారు. కబ్జా కు గురైన దుబ్బకుంటాను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాచిగళ్ళ రమేష్, కొమ్మని దర్శన్, గుడ్ల అర్జున్, మేతరి యాదగిరి, మేతరి కుమార్, కొమ్మని దయానంద్, గుడ్ల శ్రీను, రఘు, గుడ్ల గణేష్ ఉన్నారు.

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణిలో 334 విన్నపాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి విన్నపాలు వెల్లువలా వచ్చాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల విన్నపాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు పంపించారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా మొత్తం 334 విన్నపాలు వచ్చాయి, హెడ్ ఆఫీస్‌లో 257 విన్నపాలు రాగా జోనల్‌లో మొత్తం 77 విన్నపాలు వచ్చాయి. చార్మినార్ జోన్‌లో 1, సికింద్రాబాద్ జోన్ 5, కూకట్ పల్లి జోన్ 42, శేరిలింగంపల్లి పల్లిలో 17, ఖైరతాబాద్ జోన్‌లో 5, ఎల్.బి నగర్ జోన్‌లో 7 విన్నపాలు వచ్చాయి. ఈ విన్నపాలను సకాలంలో పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజా వాణిలో ఈ.ఎస్.సి జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా మాధురి, సత్యనారాయణ, యాదగి రిరావు, జయరాజ్ కెన్నడి, సీసీపీ రాజేంద్రప్రసాద్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజి డా.రాం బాబు, హౌసింగ్ ఎస్.ఈ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎల్బీనగర్ రెవెన్యూ అధికారి



నవతెలంగాణ-ఎల్‌బీ నగర్

ఎల్బీనగర్ జీహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఎం రాధాకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా శ్రీధర్ అనే వ్యక్తి తన ఇంటి ఓనర్ షిప్ ను మార్చాలని దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తు పరిశీలించిన రాధాకృష్ణ రూ. 8000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దాంతో శ్రీధర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం శ్రీధర్ నుంచి రాధాకృష్ణ రూ. 8000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రైడ్ చేసి రెడ్ హ్యాండడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతు ఎవరైనా లంచం అడిగితే 1064 కు ఫోన్ చేసి తమను సంప్రదించాలని కోరారు.



కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా జాలె వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మన్సురాబాద్ డివిజన్‌కు చెందిన జాలె వెంకటరెడ్డి నియమితులయ్యారు. నియామక పత్రాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ వెంకటరెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా జాల వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కష్టి చేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా పనిచేస్తానన్నారు. నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్ల నర్సింహారెడ్డి, టీపీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బుద్దా సత్యనారాయణ, కొండ జనయ్యా గౌడ్, చనగని వెంకన్నగౌడ్,దుబ్బాక గోపాల్ రెడ్డి,ఎర్ర శేఖర్ గౌడ్,కూడారి బాలకృష్ణ యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : మాజీ కౌన్సిలర్ దండు గణేష్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కల్గుతుందని మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపూర్ 14వ డివిజన్ పరిధిలో ఉన్న వికాస్ సెక్షన్ కాలనీలో ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్పాన్సర్‌గా దండు గణేష్ ముదిరాజ్ ఉన్నారు. నాలుగు టీంలు పాల్గొని 7 మ్యాచ్‌లు ఆడగా ఫైనల్‌లో విన్నర్ టీం కెప్టెన్ మధు, వైస్ కెప్టెన్ మస్కూరి రోహిత్ కప్పుతో పాటు నగదు రూ .10000 నగదు గెలుపొందారు. రన్నర్ టీం కెప్టెన్ విష్ణు రాజ్, వైస్ కెప్టెన్ జగన్ రూ.5000తో పాటు కప్పును అందుకున్నారు. అందులో బెస్ట్ బౌలర్ బెస్ట్ బ్యాట్ మెన్‌గా జగన్ మధు గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆర్గనైజర్స్ మస్కూరి రాజేష్ రోహిత్ మల్లేష్ జగన్ విజయ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దండు గణేష్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. చెడు దారులకు వెళ్లకుండా క్రికెట్ క్రీడలో పాల్గొని మన గ్రామానికి మున్సిపాలిటీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడారంగంలో యువకులు ముందుకు రావాలని వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ పోరాడి వెంకట్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు వరికుప్పల వెంకటేష్, కుంచేటి సాయిరాం, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సాంబశివ, కడారి పెద్దయ్య, మస్కూరి సుధాకర్, మోర కష్ణ, కుక్కల సదానందం, భాస్కర్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న గట్టు గిరి

- మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులకు మాతృదేవోభవ అనాథ ఆశ్రమం చైర్మెన్ గట్టు గిరి అప్పగించారు. వివరాల్లోకెళ్తే.. చిత్తూరు జిల్లా మాధవరం మండలం బండివాండ్ల గ్రామానికి చెందిన 46 ఏండ్ల బందిలి కుమారస్వామికి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో చిత్తూరులో రైలు ఎక్కి కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగాడు. అతను రోడ్ల పైన తిరుగుతూ 5 రోజుల క్రితం బాలాపూర్ మండలం, నాదర్గుల్ గ్రామంలో ఉన్నటువంటి వంశీదర స్కూల్‌లోనికి వెళ్లి స్కూల్ యాజమాన్యాన్ని ఇబ్బంది పెట్టడంతో ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ వారు ఈ విషయాన్ని మాతృదేవోభవ అనాధాశ్రమానికి తెలియజేయడంతో వెంటనే కుమారస్వామిని ఆశ్రమానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. 3 రోజులుగా అతనికి పౌష్టికహారం, మెరుగైన వైద్యం అందించిన తర్వాత మానసిక స్థితి కుదుటపడి తర్వాత అతను అడ్రస్ చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గట్టుగిరి మానవత్వం చాటుకున్నారు. కుమారస్వామి కుటుంబ సభ్యులను సోమవారం పిలిపించారు. ఆదిబట్ల ఎస్.ఐ. కృష్ణయ్య సమక్షంలో కుమారస్వామిని తన కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్.ఐ. కృష్ణయ్య మాట్లాడుతూ సొంత తల్లిదండ్రులను పట్టించుకోని ఈ రోజుల్లో గిరి మానవ సేవే మాధవ సేవగా భావించి ఇలాంటి సేవ కార్యక్రమలు చేయడం చాలా సంతోషమని తెలిపారు. కుమారస్వామిని క్షేమంగా తమకు అప్పగించిన గట్టు గిరికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కుమారస్వామి కుటుంబసభ్యులు తెలియజేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని మాత దేవోభవ అనాథ ఆశ్రమం చైర్మన్ గట్టు గిరి మాట్లాడుతూ మతిస్థిమితం సరిగాలేని ఎంతో మందికి ఆశ్రమం కల్పించి వారిని ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాలాపూర్ మండలం బాలాజీ నగర్ మల్లాపూర్ గ్రామానికి చెందిన రాతలావత్ శ్రీరాం (46) ఆటో డ్రైవర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 4న ఆటో నెంబర్ 11 యు.డి.3793ను తీసుకొని శ్రీరాం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులను స్నేహితులను సంప్రదించారు. సమాచారం అందకపోవటంతో కుటుంబ సభ్యులు బాలాపూర్ పోలీస్ స్టేషన్ పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్ నగర్ అధ్యక్షుడిగా దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా

నవతెలంగాణ - చైతన్యపురి

నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ప్రతి ఒక్కరూ నడుస్తూ తోటి వారిని నడిపించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 301 గవర్నర్ శ్రీనివాస చారి తెలిపారు. వాకర్స్ క్లబ్ అఫ్ గ్రేటర్ దిల్ సుఖ్ నగర్ ఇన్స్టలేషన్ కార్యక్రమం హుడా కాంప్లెక్స్‌లోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో జరిగింది . ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా చోలేటి ఆనంద్, కోశాధికారిగా నరసింహలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు జగిని శ్రీనివాస్ గుప్తా నుంచి నూతన అధ్యక్షులు దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీనివాస చారి మాట్లాడుతూ.. వాకర్స్ క్లబ్ అఫ్ గ్రేటర్ దిల్ సుఖ్ నగర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని... వాటిని కొనసాగించాలని అన్నారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తనకు అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన గవర్నర్ శ్రీనివాస చారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వహిస్తు సంఘానికి మంచి పేరు తీసుకొని వస్తానన్నారు. దాచేపల్లి శ్రీనివాస్ గుప్తాను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ బాధ్యులు శివ ప్రసాద్, చక్రపాణి, లింగ ప్రకాష్, మాధవ రావు, సంపత్ రెడ్డి, గంగాధర్ రెడ్డి,గౌరీ శంకర్,మురళి కృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న కబ్జాదారులు

- కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

అధికారులను కబ్జాదారులు తప్పుదోవ పట్టిస్తున్నారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ మండలం సాహెబ్ నగర్ కుర్దు పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తప్పుడు సమాచారం అధికారులకు ఇవ్వడంతో గంగిరెద్దుల వాళ్ల వేసుకున్న గుడిసెలను తొలగించారని తెలిపారు. పెద్ద చెరువును అభివృద్ధి కానివ్వకుండా కొంతమంది కబ్జాదారులు రాత్రి పూట డిస్మెంటల్ మట్టిని రాత్రికి రాత్రి పోసి కబ్జా చేయడానికి తీవ్ర ప్రయత్నాలు అవుతున్నాయని ఆరోపించారు. అందులో భాగంగా ఇక్కడ వేసుకున్న గుడిసె వాళ్ళు అడ్డుకోవడంతో ఇలా ఫిర్యాదులు చేసి పలు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పెద్ద చెరువుని అభివద్ధి కానివ్వకుండా కొంతమంది కోర్టులలో కేసులు వేసి అభివద్ధిని అడకుంటున్నారని విమర్శించారు. ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని కబ్జా చేయడానికి చేస్తున్న కుట్రలో భాగంగా ఇలా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని సంబంధిత అధికారులకు సూచించారు.

పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ

- సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు సేకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ సీపీ తరుణ్ జోషి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాచకొండ కమిషనరేట్‌లో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం మహేశ్వరం జోన్ పరిధిలోని పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్, సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కమిషనర్ స్వయంగా సిబ్బంది ప్రతీ ఒక్కరి పని విధానాన్ని పరిశీలించి, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలకు అందించే సేవలపై వివరించారు. విధి నిర్వహణలో ఉపయోగపడే పలు రకాల మెళకువలను సిబ్బందికి తెలియజేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సునీత రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



'ఆశారామ్‌ను వెంటనే విడుదల చేయాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

సంత్ శ్రీ ఆశారామ్ బాపూ ఆరోగ్య పరిస్థితిని దష్టిలో పెట్టుకొని వెంటనే విడుదల చేసి వైద్య సదుపాయాలు కల్పించాలని శ్రీ యోగ వేదాంత సేవా సమితి హైదరాబాద్ ఇన్‌చార్జి విజయ్ ఫరిక్ డిమాండ్ చేశారు. చైతన్యపురిలోని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు వేలాది మంది సాధ కులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలతో 86 ఏండ్ల సంత్ ఆశారామ్‌ను జోధ్ పూర్ జైల్లో ఉంచారని తెలి పారు. బాపూ ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగాఉందని అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆయన జీవితమంతా సమాజ శ్రేయస్సుకు పని చేశాడని గుర్తు చేశారు. అనారోగ్యం కారణాలతో ఖైదీకి మధ్యంతర బెయిలు మంజూరు చేయడంలో ఉదాసీనత పాటించాలని 2022లో సుప్రీంకోర్టు పేర్కొం దని తెలిపారు. వెంటనే ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ రూమ్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా కోర్టు లో పునర్నిర్మించిన రంగారెడ్డి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటీవ్ రూమ్‌ను జిల్లా కోర్టు ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శశిధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి కోర్టు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు , రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీకొండ రవీందర్,ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, ఉపాధ్యక్షుడు చల్లా వినోద్ కుమార్ ,సంయుక్త కార్యదర్శి రామ్ చెందర్ చక్రాల, మహిళా విభాగం ప్రతినిధి జ్యోతి దేవరకొండ, కోశాధికారి రామకృష్ణ ముక్కల, గ్రంథాలయం కార్యదర్శి రామకృష్ణ యజ్ఞ మూర్తి, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి సందీప్ గౌడ్ పెద్దగోని, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ అనితా జూపల్లి, దీప్తీ నాగేందర్.వి ,రామకృష్ణ రెడ్డి గోపాల్ .జి. వెంకట్ రెడ్డి గణపురం ,కిరణ్ కుమార్ గౌడ్ బజారు ,సాయ్ కుమార్ రెడ్డి, జిల్లా కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

సీల్ట్ వెహికిల్ నిధులు వెంటనే విడుదల చేయాలి

నవ తెలంగాణ - ముషీరాబాద్



సిల్ట్ వెహికిల్ నిధులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ దళిత్ సిల్ట్ వెహికిల్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్సీ కోఆపరేటివ్ డెవలప్మెంట్ వైస్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. కరుణాకర్‌ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ రామచందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, మాట్లాడుతూ తెలంగాణ దళిత బందు స్కీం ద్వారా వచ్చిన స్టీల్ వెహికల్స్‌కు రావలసిన నిధులు 50 వేలు సకాలంలో రావడం లేదన్నారు. దాదాపు 88 మందికి రావాలని హైదరాబాద్ సంబంధిత దళిత బంధు సభ్యులకు ఎన్నికల కోడ్ రావడంతో నిధులు మంజూరు చేయడం నిలిపివేశారన్నారు. కావున చొరవ తీసుకొని నిధులు మంజూరు అయ్యేవిధంగా చూడాలని కోరారు.

కళాత్మకంగా ఆలోచిస్తే ప్రతీ వస్తువుతో కళాకృతుల్ని రూపొందించవచ్చు

నవతెలంగాణ-ముషీరాబాద్



కళాత్మకంగా ఆలోచిస్తే ప్రతీ వస్తువుతో కళాకృతుల్ని రూపొందించవచ్చని రెడ్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ కమటం రఘు తెలిపారు. అందుబాటులో ఉన్న వస్తువులతో నమూనలను తయారుచేసి విద్యార్థులు ఔరా అనిపించారు. సోమవారం రాంనగర్ లోని పాఠశాల ఆవరణలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శించారు. టీ కప్పులు, ఐక్రీమ్ స్పూన్స్ వినియోగిస్తూ రంగుల రట్నం, కూల్డ్రింక్స్ బాటిల్స్ తో ఫ్లవర్ వాజ్, గాజు సీసాలకు పెయింట్, ఈయర్ బడ్స్, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ స్పూన్స్, అట్టముక్కలు, చాక్లెట్స్ కవర్లు ఇలా వివిధ రూపాల్లో నమూనాలను తయారీ చేసి అందరిని ఆకట్టుకున్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో సృజనను వెలికి తీయవచ్చని పాఠశాలు ప్రిన్సిపాల్ కమటం సౌజన్య వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- ఎమ్మెల్యే ముఠాగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్ నగర్ మండల ఆఫీస్ లో రాంనగర్ డివిజన్, కవాడిగూడ డివిజన్, గాంధీనగర్ డివిజన్‌కి చెందిన నాలుగు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ 16 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జయసింహ, కవాడిగూడ డివిజన్ ప్రెసిడెంట్ వల్లల శ్యామ్ యాదవ్, గాంధీనగర్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆకుల శ్రీనివాస్, కొండమడుగు మధు, కళ్యాణ్, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్, రమేష్ యాదవ్, శంకర్, సుధాకర్, మండల్ ఆఫీసు డిప్యూటీ తహసీల్దార్, రఘు విష్ణు, ఆర్ఐ మధు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలకు చర్యలు చేపడుతున్నాం

- కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రభుత్వ పాటశాలలో మెరుగైన సౌకర్యాలకు చర్యలు చేపడుతున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్, ఎస్ఆర్‌టీలోని జవహర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కార్పొరేటర్ సందర్శించారు. పాఠశాలలో చదివే పిల్లలకు అందచేస్తున్న సదుపాయాల గురించి స్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యసభ ఎంపీ, ఎస్ఆర్‌టీ మోర్చ జాతీయ అధ్యక్షులు డా. కె.లక్ష్మణ్ ప్రత్యేక చర్వత 5 లక్షల సిఎస్ఆర్ నిధుల వ్యయంతో ఆరో ప్లాంట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. వాటితో పాటు అధ్యాపకులకు, విద్యార్థులకు మెరుగైన వసతుల ఏర్పాటుకు నూతన ఫర్నీచర్, చదువుకునే బల్లలు, కుర్చీలు తో పాటు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ .వినయ్ కుమార్ ,నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ అంబర్ పేట డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి అన్నారు. అంబర్ పేట డివిజన్ పరిధిలో సోమవారం పటేల్ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బడుగు బలహీన వర్గాల ప్రధానమంత్రి పై మాజీ ముఖ్యమంత్రి లాలు ప్రసాద్ యాదవ్ చేసిన వాక్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, యశ్వంతు, రామచందరు గుప్తా, మైలారం రాజు, పెంటం రాజు, కృష్ణ ముదిరాజ్, తిరుపతి గుప్తా, మనోజ్ యాదవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన జనాభా దామాషా ప్రకారం 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- భారతీయ బంజారా సేన



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గిరిజన జనాభా దామాషా ప్రకారం 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని భారతీయ బంజారా సేన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో బంజారా సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బంజారా సేన జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షులు శేషు రామ్ నాయక్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రుక్మిణి నాయక్ మాట్లాడుతూ మైదాన ప్రాంతా గిరిజనులకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బంజారా భాష మాట్లాడుతున్న వారిని ఒకే కులంలో చేర్చాలని, గ్యార్ బోలీ భాషను ప్రవేశ పెట్టాలని, గిరిజన జనాభా దామాషా ప్రకారం 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని,బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రేమ్ చంద్ నాయక్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం అయన తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి రైల్వే స్టేషన్ వాషింగ్ యార్డులో 30-35 ఏళ్ల వయస్సున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడితో ఎలాంటి గుర్తింపు లభించలేదు. మరణించిన వ్యక్తి తన కుడి చెవికి ఒక ఇయర్ రింగ్ కలిగి దాదాపు 5.6' సరసమైన రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. మిగతా వివరాల కోసం నాంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.

పది పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగొద్దు

- ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి
- సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈనెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగొద్దని, పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళభవన్‌లో చీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చీఫ్ సూపరిటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, డిపార్టుమెంటల్ అధికారులు పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ రావు, డీప్యూటీ ఈవోలు చిరంజీవి, రాధాకృష్ణ, నెహ్రూబాబు, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ముందున్న ముషీరాబాద్

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ అభివృద్ధి పథంలో ముందుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌లో దీన్ దయాల్ నగర్ రూ.14 లక్షలతో నాలా పహరి గోడ పనులను, బోలక్ పూర్ డివిజన్ మహాత్మా నగర్‌లో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు పనులను బోలక్పూర్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. నియోజకవర్గంలో ప్రతి బస్తీలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గ ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు అత్యధిక నిధులు కేటాయించి నాణ్యతతో పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సురేందర్, ఖదీర్, గురుదీప్ సింగ్, మీడియా ఇంచార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, అస్లాం, ప్రవీణ్ రాజ్, సత్య నారాయణ , జీహెచ్ఎంసీ డిఎ సన్నీ బోలకపూర్ డివిజన్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, మొహమ్మద్ అలీ, రహీం, మున్వర్ చాంద్, మసి, ముబారక్, లోకేష్, శివ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

'అడ్మిషన్ ఒకచోట తరగతులు ఇంకోచోట'

- రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని జూనియర్ కళాశాలల జాబితాను ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రకటించాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అడ్మిషన్ ఒకచోట తరగతులు ఇంకోచోట నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలల ఆగడాలకు ఇంటర్ బోర్డ్ అడ్డుకట్ట వేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని జూనియర్ కళాశాలల జాబితాను ఇంటర్మీడియట్ విద్యా మండలి ప్రకటించాలని, ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడక ముందే నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి శృతి ఓజాకు ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యా మండలి గుర్తింపు పొందకుండా కార్పొరేట్ (శ్రీచైతన్య, నారాయణ, ఎస్.ఆర్, అవినాష్, రీసోనెన్స్ తదితర కళాశాలలు విచ్చల విడిగా నడుస్తున్నాయని ఆరోపించారు. నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు అనుమతులు ఉన్న కళాశాలల్లోనే చేరాలని సూచించారు. కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు మంజూరు కానీ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వల్ల నష్టపోతున్నారన్నారు. అడ్మిషన్ ఒక చోట తరగతులు ఒక చోట నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఈ కార్పొరేట్ కళాశాలలు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2023 విద్య సంవత్సరంలో ఇంటర్ బోర్డు ఎన్ని జూనియర్ కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చిందో వివరాలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉమ్మడి హైదరాబాద్‌లోని కూకట్ పల్లి, మియాపూర్, మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీ, నారాయణగూడలోని ప్రాంత్రాల్లో అనధికార కళాశాలలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ పాల్గొన్నారు.

నూతన కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

- బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బోయిని విజయ్ కుమార్
- జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-ధూల్‌పేట్

జంగంమెట్ నాగుల బండ అంబేద్కర్ బస్తీలో నూతన కమ్యూనిటీ హల్ నిర్మించాలని బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బోయిని విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో బాగంగా సోమవారం ఆయన జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి ఆయనను సత్కరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా కమ్యూనిటీ హాల్ శిథి లావస్థకు చేరిందన్నారు. పలుమార్లు అధికా రుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడం లేదన్నారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్ బస్తీ వాసులకు ఫంక్షన్ లకు, పలు కార్యక్రమాలకు వెసులుబాటుగా ఉండేదన్నారు. శిథిలావస్థకు రావడతో స్థానికులు ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. 40 ఏళ్ల క్రితం భవనం నిరుపయోగంగా మారిందని తెలిపారు. ఆ ప్రాంతంలోనే నూతన్ కమ్యూనిటీ హల్ నిర్మించాలని, పవర్ బోర్, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు.

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే ముఠాగోపాల్
- కవాడిగూడ డివిజన్ ఈశ్వరమ్మవాడ బస్తీలో పర్యటన



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ దోమలగూడలో ఈశ్వరమ్మ వాడ, సూరజ్ నగర్ బస్తీ వాసుల వినతి మేరకు సంబంధిత అధికారంతో పర్యటించి కలుషిత మంచినీరు, రోడ్లు, ఇండ్లకు దగ్గరగా ఉన్న కరెంటు స్తంభాల సమస్యలపై సంబంధిత అధికారులతో పర్యటించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారుల ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లకు దగ్గరగా ఉన్న కరెంటు స్తంభాలు ఆ ఇంటి వారికి, బస్తీ వాసులకు ప్రమాదకరంగా ఉన్నాయని వెంటనే ఇనుప స్తంభాల బదులు సిమెంటు పోళ్లను వేయాలని అధికారులకు ఆదేశించారు. కలుషిత మంచినీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జలమండలి అధికారులకు తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడవద్దని ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జై సింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయి కృష్ణ, ప్రభాకర్, రాజేష్, శ్రీకాంత్, మీడియా ఇంచార్జ్ ముచ్చ కుర్తి ప్రభాకర్, బస్తీవాసులు హరీష్ యాదవ్, కుమార్ యాదవ్, సురేందర్ గౌడ్, క్రాంతి, శ్రీకాంత్ కుమార్, జంగయ్య గౌడ్, శ్రీకాంత్, సాయి , జీహెచ్ఎంసీ డిఈ సన్నీ, జలమండలి అధికారి డీజీఎం కార్తీక్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ పవన్, తదితరులున్నారు.

టెట్ తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
- సైఫాబాద్‌లోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

టెట్ పరీక్ష నిర్వహించిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాజ్య సభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు జి.అనంతయ్య సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం టెట్ నోటిఫికేషన్ వేయాలని, టీచర్ పోస్టులు 24 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ భారీ ఎత్తున వందలాది మంది నిరుద్యోగులు సైఫాబాద్ లోని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించడం సాంప్రదాయమని గతంలో మన రాష్ట్రంలో ప్రతిసారి డీఎస్సీతో పాటు టెట్ పరీక్ష నిర్వహించారని గుర్తు చేశారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, చత్తీస్ ఘడ్, ఏపీలలో డీఎస్సీతో పాటు టెట్ నోటిఫికేషన్ వేశారని పేర్కొన్నారు. టెట్ పాస్ కాకుండా టీచర్ పోస్టు రాయడానికి అర్హత రాదని, టెట్ వేయడానికి ప్రభుత్వానికి అభ్యంతరాలు ఏమిటని ఆయన ప్రశ్నించారు. డీఎస్సీ, టెట్ ఒకేసారి వేస్తే ప్రభుత్వానికి ఇబ్బంది ఏమీ లేదని కావున వెంటనే టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్కూల్ అసిస్టెంట్ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయని, బీఈడీ చేసిన వారు 4 లక్షలకు పైగా ఉన్నారన్నారు. 11 వేల పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటించారని, కానీ 24 వేలకు పైగా టీచరు పోస్టులు ఉన్నాయని, సంఖ్య విషయంలో అధికారులు ఆధార పడకుండా నిరుద్యోగ సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరపాలని ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరారు. ఈ ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులతో బీసీ విద్యార్థి సేన అధ్యక్షులు వేముల రామకృష్ణ, బీసీ సంక్షే మ సంఘం రాష్ట్ర నాయకులు ఉదయ్, మట్ట జయంతి, కె.కృష్ణ, నిరుద్యోగ జేఏసీ నాయకులు చందు, సందేశ్, శివ, హరిణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే వేతనాలివ్వాలి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణా వైద్య, ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్‌హెచ్ఎం ఫెడరేషన్ యూనియన్ కమీషనర్ వెంటనే జీతాలు చెల్లించాలని కోరినట్టు అధ్యక్షులు శ్రవన్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు 3 నెలలుగా ఇవ్వాల్సిన జీతాలు వెంటనే ఇవ్వలని, 2021 సం.లో ఇచ్చిన పీఆర్‌సీ ఏరియర్స్(7నెలలు) ఇవ్వాలని జీ.వో 510 అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమలో ఫెడరేషన్ నాయకులు మల్లయ్య, రహీం, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని కోఠిలో ప్రారంభిస్తున్న రాష్ట్ర లెప్రసీ అధికారి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జోహన్ బాబు, అడిషనల్ డాక్టర్ నిర్మల్ ప్రభావతి, కింగు కోఠి క్లస్టర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ మనోజ్ రెడ్డి ,డీపీవోసీడీవోలు. తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

'వాంబే ఇండ్ల కేటాయింపుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి'

- కృష్ణానగర్ కట్ట మైసమ్మ వాంబే వెల్ఫేర్ అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



కృష్ణానగర్ కట్ట మైసమ్మ వాంబే ఇండ్ల కేటాయింపుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ చేత జ్యుడీషియల్ విచారణ జరిపించి గూడు లేని పేదలకు న్యాయం చేయాలని కృష్ణానగర్ కట్ట మైసమ్మ వాంబే వెల్ఫేర్ అసోసి యేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సుదర్శన్, గడ్డం ఏవేల్, మడుగుల జనార్ధన్, వి.ఆర్.విజయ రామరాజు తదితరులు కలిసి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా స్థానికంగా పూరి గుడిసెలు, తమ స్తోమతకు తగ్గట్టుగా రేకులు వేసుకుని పక్కా ఇండ్లను నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్న 693 మందికి అప్పటి ప్రభుత్వం ఫారం 'డి' పట్టాలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కొంత కాలం తర్వాత శాశ్వత నివాసం కోసం అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు వాంబే వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన పక్కా ఇళ్లను నిర్మించేందుకు రెవెన్యూ శాఖ ద్వారా తమకు ఇచ్చిన పట్టాలను తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వానికి పట్టాలు ఇచ్చి అర్హులైన ఇండ్లు లేని పేదవారు దాదాపు 60 కుటుంబాల వరకు ఉన్నాయని తెలిపారు.ఈ విషయంపై సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని ఇల్లు లేక వీధిన పడ్డ నిరుపేద కుటుంబాలను ఆదుకుని వారికి న్యాయం చేయాలని వారు కోరారు.ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు బి.వి.వెంకట్ రావు, సయ్యద్ సలీం, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడాలి

నవతెలంగాణ-ధూల్ పేట్



నాణ్యతా ప్రమాణాలకు లోబడి వారికి ఉత్తమ వస్తు సేవలను అందించాలని బీఐఎస్ పూర్వ అధ్యక్షులు ఎ.పి. శాస్త్రి అన్నారు. మార్చి 15 ప్రపంచ వినియోగదా రుల దినోత్సవం సందర్భంగా సిటీ కాలేజి స్టాండర్డ్ క్లబ్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాం డర్డ్స్ సంయుక్తంగా డిజిటల్ వస్తుసేవల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విని యోగదారులు లేకుండా వ్యాపార రంగాల అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఎల్లప్పుడూ నాణ్యతా ప్రమాణాలకు లోబడి వసు సేవలను కొనసాగించాలన్నారు. టెక్నాలజీ సేవలు విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో 2024వ సంవత్సరానికి 'వినియోగదారుల కోసం న్యాయమైన, బాధ్యతా యుతమైన ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్' అనే నినాదాన్ని ఐక్య రాజ్యసమితి ప్రకటించిందన్నారు. స్టాండర్డ్ క్లబ్ మెంటర్ డాక్టర్. వై. వాసుదేవ రెడ్డి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యక్షులు డా.రత్న ప్రభాకర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల గురించి అందరికీ అవగాహన ఉండాలన్నారు. వాటికి భంగం కలిగితే వినియోదారుల ఫోరంలో న్యాయం పొందవచ్చన్నారు. సదస్సు అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలిచిన పూజ, మీనా, కావ్య జగదీష్, నాగు, ఉదయ్ కిరణ్, మురళీ కృష్ణ తదితర విద్యార్థులకు రూ.15వేలు నగదు బహుమతులను అందచేశారు.

సంవత్సరానికి గోల్డెన్ పీకాక్ అవార్డు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఇన్స్టిట్యూట్ అఫ్ డైరెక్టర్స్ ఏటా నిర్వహించే గోల్డెన్ పీకాక్ అవార్డు 2024 సంవత్సరానికిగాను హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా (ఇఎస్‌సీఐ)కి దక్కడం పట్ల ఆ కాలేజ్ డైరెక్టర్ జీ. రామేశ్వర రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యతో పాటుగా విద్యుత్ ఎనర్జీ, క్లైమేట్ చేంజ్, నీటి అవసరాలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మైనింగ్, సివిల్, రవాణా ఇంజనీరింగ్ ఎకో-ఇన్నోవేషన్, ఎఫెక్టివ్ అండ్ ఎనర్జీ గ్రీన్ సొసైటీ, సుస్థిరత సమస్యలపై నైపుణ్యాన్ని పెంపొందించే సంస్కతిని ప్రోత్సహించే విధంగా భారత్‌తో పాటుగా ఇతర దేశాల్లో కూడా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఇంజనీర్లకు, శాస్త్రవేత్తలకు, మేనేజర్లకు సుమారు నాలుగు దశాబ్దాలుగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ అవార్డు కోసం ఆయారంగాల్లో పనిచేస్తున్న దేశంలోని పలు సంస్థలు పోటీ పడగా హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాకు ఈ అవార్డు దక్కిందన్నారు. అవార్డు రావడం వెనుక ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో పనిచేస్తున్న ప్రతి సిబ్బంది యొక్క కృషి, మేదస్సు ఉందదన్నారు. మార్చ్ 5, 2024 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఈ అవార్డును బహుకరించినట్లు డైరెక్టర్ జీ. రామేశ్వరరావు తెలిపాడు. ఈ సందర్భంగా కాలేజ్ బోర్డు రూమ్ లో సోమవారం జరిగిన సిబ్బంది సమీక్షా సమావేశంలో సంస్థలో పనిచేస్తున్న సిబ్బందితో డైరెక్టర్ అవార్డును పంచుకున్నారు.



జగద్గిరిగుట్ట డివిజన్లో నెలకొని ఉన్న పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధి భూదేవి హిల్స్ కాలనీలో స్థానికులతో కలిసి (సి)బ్లాక్, (ఎ)బ్లాక్ వద్ద డ్రయినేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. తక్షణమే సంబంధిత అధికారులను పిలిపించి ఆ ప్రాంతంలో పర్యటించారు. సదరు సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు రాయి విగ్నేష్,కాలనీ అధ్యక్షులు పేర్తి విటల్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

ప్రజావాణికి 77 అర్జీలు

- మేడ్చల్-మల్కాజిగిరి డీఆర్వో హరిప్రియ

నవతెలంగాణ-సిటీబ్యూరో



కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి 77 అర్జీలు వచ్చినట్టు మేడ్చల్-మల్కాజిగిరి డీఆర్వో హరిప్రియ తెలిపారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బయటపెట్టాలి



- సీపీఐ(ఎం) కమిటీ డిమాండ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎలక్ట్రోరల్ బాండ్ వివరాలను సుప్రీంకోర్టుకు తెలియజేయాలి, లేనిపక్షంలో ఎస్బిఐ బ్యాంకు చైర్మెన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, కూకట్‌పల్లి మండలం ప్రశాంత్ నగర్ ఎస్‌బిఐ బ్యాంకు ఎదుట సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల కమిటీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కూకట్ పల్లి మండల కమిటీ నాయకులు మాట్లాడుతు.. బీజేపీ ప్రభుత్వం అనుసరించిన ఎస్‌బిఐ బాండ్ల కొనుగోలు విషయంలో, గోప్యత పాటించడం వెనక దేశ ప్రజానీకానికి బీజేపీ ప్రభుత్వంపై అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. దానిని నివృత్తి చేయాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివరాలను తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కూడా ఎసీబీఐ చైర్మెన్ చెప్పకుండా ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. ఈ బాండ్ లో పెద్ద అవినీతి బాగోతం దాగి ఉందని, బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు భయపడుతుందని నాయకులు తెలియజేశారు. ఈ ఎన్నికల బాండ్లను మార్చి 6 తారీకు లోపల తెలియపరచాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికి పట్టించుకోవడంలేదని, బీజేపీ ప్రభుత్వం ఒత్తిడి కారణంగా 116 రోజులు గడువు కోరిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ఈ గోప్యత దాచి పెట్టాలని ప్రభుత్వం చూస్తుందని, దానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ మండల నాయకులు కే కృష్ణ నాయక్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ధర్మారావు, తాజుద్దీన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మెన్‌ను వెంటనే అరెస్టు చేయాలి



కుత్బుల్లాపూర్ : సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా బీజేపీ మోడీకి తొత్తుగా వ్యవహరిస్తున్న ఎస్బిఐ చైర్మెన్‌ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం షాపూర్ నగర్ పార్టీ కార్యాలయంలో కీలుకానీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్బిఐ పాటించకుండా బీజేపీ మోడీ సర్కార్‌కు తొత్తుగా ఎస్బిఐ యాజమాన్యం వ్యవహరిస్తుందని మోడీ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు అయ్యేదాకా ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా నాన్చాలని ఎస్బిఐ యాజమాన్యం చూస్తుందన్నారు.

కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్
- ప్రజావాణిలో ఇచ్చిన వినతిపత్రాల దగ్ధం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని సీపీఐ ఆధ్వర్యంలో గత రెండేండ్లుగా పోరాటంతో పాటు అధికారులకు వినతిపత్రాలు అందజేస్తుంటే చీమకుట్టినట్లైనా లేదని నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ అధికారుల తీరుపై మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ సోమవారం ప్రజావాణి సందర్భంగా ప్రజావాణిలో ఇచ్చిన వినతిపత్రాలకు విలువలేదని ఆ వినతి పత్రాలను మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం ముందు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్ రావులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు, అన్ని చెరువులు కబ్జాకు గురవుతున్నాయని సీపీఐ ఆధ్వర్యంలో 2002 సంవత్సరం నుంచి వినతిపత్రాలను ఇవ్వడమే కాకుండా, వందలాది మంది ప్రజలతో ధర్నా చెయ్యగా ఆ ధర్నాకు స్వయంగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారని అప్పటి కలెక్టర్ హరీష్ వెంటనే స్పందించి, స్థలాన్ని పరిశీలించి వెంటనే కుల్చీవెయ్యాలని ఆదేశించినా ప్రయోజనం లేదని విమర్శించారు. సీపీఐ పోరాటాలు, వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వయంగా 3000 వరకు అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే కూల్చివేయ్యాల్సిందిగా ఆదేశాలు జమచేసి 8 నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం, కబ్జాలు మరింత పెరిగయే తప్ప తగ్గలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తే ఆది లేదని అన్నారు. ఇప్పటికైనా ఈ నిరసన ద్వారా నైనా అధికారులు కండ్లు తెరిచి కబ్జాలను అరికట్టాలని కోరారు. కేవలం దామెర్ చెరువు దగ్గర కూల్చివేస్తే అది రాజకీయ ప్రేరేపిత చర్యగానే భావించాల్సి వస్తుందని అన్నారు. రెవెన్యూ అధికారులు కఠినమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల భూకబ్జా దారులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా చలమణి అవుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు ఉదయం బోర్డులు పాతితే సాయంత్రం కల్లా కబ్జాదారులు వాటిని తొలగించి అక్రమించుకుంటున్నారని అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఏమి పట్టనట్టు ఉంటున్నారని ఎద్దేవా చేశారు. అదే పేద ప్రజలు గుడిసెలు వేస్తే వందలాది పోలీసులను పంపించి తొలగించే అధికారులు కబ్జాదారులను మాత్రం ఏమనకపోవడం దారుణ మన్నారు. అలాంటి అధికారులు ప్రజలకు ఏమి చేస్తారని అధికారులు కబ్జాదారుల వైపే ఉన్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఒక్కో కబ్జాదారుడిపై పదుల కేసులు ఉన్న వారు దర్జాగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, అధికారులతో సన్నిహితంగా ఉన్నట్లు కనిపించడం వల్ల ప్రజలకు అధికారులపై, కార్యాలయాలకు రావలంటేనే చిదరించుకుంటున్నారన్నారు. తక్షణమే అధికారులు నీతి నిజాయితీ నిరూపించుకోవలంటే కబ్జాలను అరికట్టి భూములను, చెరువులను కాపాడి కబ్జాదారులను కటకటాల్లోకి పంపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు వంగాల శ్రీనివాస్, ఆకుబత్తిని ప్రవీణ్, ఎం.సహదేవరెడ్డి, మండల నాయకులు ఇమామ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్, సామెల్, ఆశప్ప, సతీష్, రాజులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి




- ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీలు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలు అన్నారు. కూకట్‌పల్లి మండలానికి సంబంధించి 266 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను సోమవారం కూకట్‌పల్లి ఎంఆర్‌ఓ కార్యాల యం అవరణంలో వారు పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల ఆడబిడ్డ పెండ్లికి దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టన టువంటి పథకాన్ని మానవతా దృక్పథంతో గత ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 18 వేల మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసామని తెలిపారు. చెక్కులు అందించే సమయంలో వారికి భోజన సదుపాయం కల్పించి ప్రతి ఆడబిడ్డని గౌరవించి చెక్కులు ఇచ్చి పంపించేవారమన్నారు. ప్రభుత్వ సూచన మేరకు ఎమ్మార్వో కార్యాలయం నందు నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. మంచి పని చేసినప్పుడు ఎవరినైనా అభినందించాల్సిన అవసరం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.1లక్ష 116 తో సహా తులం బంగారం కూడా అందిస్తే సంతోషిస్తామని అన్నారు. తామెప్పుడూ ప్రజల పక్షాన్నే ఉంటామని ప్రజల కోసం మంచి చేసే ఏ ప్రభుత్వాన్ని అయినా సమరిస్తామన్నారు. సంక్షేమమే ధ్యేయం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివా సరావు, జూపల్లి సత్యనారాయణ, సబియా గౌసుద్దీన్, పగుడాల శిరీష బాబురావు,ఎమ్మార్వో స్వామి, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పగుడాల బాబురావు. తదితరులు పాల్గొన్నారు.

'మేకప్ సెమినార్, ప్రత్యక్ష ప్రదర్శనలు, హ్యాండ్-ఆన్'పై వర్క్‌షాప్

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఐబీఏ (ఇండియన్ బ్యూటీ అసోసియేషన్)తో కలిసి ఎస్‌బీ ఇన్నోవేషన్ రెండు రోజుల మేకప్ సెమినార్, ప్రత్యక్ష ప్రదర్శనలు, హ్యాండ్-ఆన్ వర్క్‌షాప్‌లను లక్డీకపూల్‌లోని వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. "మా సెమినార్ తాజా ట్రెండ్, టెక్నిక్‌లు, మీ మేకప్ జ్ఞానంను కొత్త ఎత్తులకు చేర్చేదుకు తోడ్పడుతుంది. మీరు బేసిక్స్‌లో ప్రావీణ్యం సంపాదించాలని చూస్తున్న అనుభవశూన్యుడైనా, అధునాతన చిట్కాలను కోరుకునే అనుభవజ్ఞుడైనా మా సెమినార్‌లో ప్రతి ఒక్కరికీ మరింత కొత్తగా తెలుసుకునేందుకు తోడ్పడుతుంది. మీ మేకప్ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, మీ సజనాత్మకతను వెలికితీసే ఈ ప్రత్యేక అవకాశాన్ని కోల్పోకండి. మీరు మేకప్ ఆర్టిస్ట్ అయినా, బ్యూటీ పార్లర్ అయినా లేదా సౌందర్య సాధనాలపై మక్కువ కలిగి ఉన్నా, ఈ సెమినార్‌కు తప్పనిసరిగా హాజరు కావాల్సిన ఈవెంట్" అని ఎస్‌బీ, ఐబీఏ వ్యవస్థాపకుడు అండ్ డైరెక్టర్ వంశీకష్ణ తెలిపారు. ఈ సెమినార్‌లో మొదటి రోజు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన బ్యూటీషన్స్‌కి అతితులతో అవార్డులు ప్రదానం చేశారు.

సీఐకు కార్పొరేటర్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అల్లాపూర్ సీఐగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంకట్ రెడ్డిని సోమవారం స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసోద్దిన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్‌లు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, అనుబంధ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, మహిళా ప్రధాన కార్యదర్శి ముత్యాల

కార్మికుల శ్రేయస్సే ముఖ్యమంత్రి ఆశయం



- కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు 21 శాతం పీఆర్సీని, 4శాతం డీఏను ప్రకటించడంతో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియ జేస్తూ కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్టీసీ కార్మికులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు మేడ్చెల్ మల్కా జిగిరి జిల్లా అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, మహిళా క్రికెట్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

"రన్ ఫర్ జీసస్" పోస్టర్ ఆవిష్కరించిన హ్యాట్రిక్ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నార్త్ జోన్ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్, పాస్టర్స్ క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి వారి చేతుల మీదుగా ఈనెల 30 వ తేది ఆదివారం రోజున నిర్వహించనున్న "రన్ ఫర్ జీసస్" వాల్ పోస్టర్ ను సోమవారం అవిష్కరింపచేశారు. అనంతరం ఏసుక్రీస్తును స్తుతిస్తూ ఎమ్మెల్యేకి దీవెనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవా. గోడి శేఖర్, బిషప్ థామస్ సీజే, రాజ్ శేఖర్, రేవా. పి.డేవిడ్, బెళ్తాకర్, డేవిడ్, డేవిడ్ గండిమైసమ్మ ప్రభుదాస్, రమేష్, దేవదాస్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు పకడ్బందీగా జరగాలి



- జేఎన్టీయూ హెచ్ రిసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా రామకృష్ణ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పీహెచ్‌డి అడ్మిషన్లు పకడ్బందిగా జరగాలని జేఎన్టీయూహెచ్ రిసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా రామకృష్ణ అన్నారు. సోమవారం జేఎన్టీయూ హెచ్ రిసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్టీయూ హెచ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ సైదానాయక్ను కలిసి పార్ట్ టైం పీహెచ్‌డి అప్లికేషన్ల విషయమై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పీహెచ్ డి అడ్మిషన్ల అప్లికేషన్లలో 2, 3 ఎన్‌ఓసీలు తప్పుగా సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందేనన్నారు. నూతనంగా వచ్చిన పార్ట్ టైం పీహెచ్ డి నోటిఫికేషన్ కి సంబంధించిన అప్లికేషన్ల సేకరణ విషయంలో ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగానికి సంబంధించిన ఆఫిసర్ అపాయిట్ మెంట్ లెటర్, ఎన్‌ఓసీ జత పరుస్తూ కంపెనీకి సంబంధించిన మెయిల్ ఐడి, మొబైల్ నంబర్ తీసుకోవాలన్నారు. గతంలో కొంత మంది విద్యార్థులు, ప్రొఫెసర్స్ కూడా వారి సొంత ప్రయోజనాల కోసం యూనివర్సిటీ పేరును దెబ్బ తీసే విధంగా పీహెచ్డి అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని అనేక సందర్భాలలో ఆరోపించారు. జేఎన్టీయూ హెచ్ విద్యార్థులుగా మేము దానిని తప్పు పడుతూ విశ్వ విద్యాలయా ఉన్నతికి తోడ్పడటం జరిగిందన్నారు. నోటిఫికేషన్ సజావుగా జరుపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు జవ్వాజి దిలీప్, సందీప్, భరత్, విద్యార్థి నాయకులు పవన్, రాహుల్, శివకృష్ణ, బ్రహ్మం, వంశీ, మనోజ్, శశిప్రీతమ్, ప్రియతమ్ రాజ్, రంజీత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నోట డిగ్రీ కాలేజీ మాట రాకపోవడం దుర్మార్గం

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్
- మేడ్చల్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు మాట రాకపోవడం దుర్మార్గం అని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మేడ్చల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణి ఇన్‌వార్డులో ఆర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మేడ్చల్ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 2007 నుంచి పోరాటం చేస్తున్నా. ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం చాలా దారుణం అన్నారు. మేడ్చల్ మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల్లో ప్రతి సంవత్సరం దాదాపు 3,500 మందికి పైగా ఇంటర్మీడియట్ విద్యార్థిని, విద్యార్థులు విద్యను పూర్తి చేసుకుని ఉన్నత చదువుల కోసం ప్రయివేటు కాలేజీలో చదవలేక కంపెనీలు, హెూటల్లో పనులకు చేరుతున్నారని తెలిపారు. అమ్మాయిలను పట్టణాకి పంపించలేక పెళ్ళిలు చేసి వారి బంగారు భవిషత్‌ను మొగ్గలోనే తుంచేస్తున్నారన్నారు. నేటి బాలలే రేపటి బావి భారత పౌరులు అనే విషయన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని డిమాండ్ కోరారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేస్తే మేడ్చల్, సుచిత్ర, అల్వాల్, శామిర్‌పేట, అలియాబాద్, తుర్కపల్లి, వంటిమామిడి కోకోండా, తుప్రాస్, కీసర, ఘట్కేసర్ ప్రాంతాల విద్యార్థులకు న్యాయం చేసినవారు అవుతారని తెలిపారు. మొన్నటి కాంగ్రెస్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురించి మాట్లాడతారేమో అని విద్యార్థులు వెయ్యి కండ్లతో ఎదురు చూస్తే.. సీఎం ఆ విషయం ప్రస్తావించక పోవడంతో విద్యార్థులు నిరాశకు గురయ్యారని తెలిపారు. విద్యార్థులు, విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ఎన్నిసార్లు పోరాటాలు చేసినా పాలకులు పట్టించుకోక పోవడం సిగ్గు చేటు అన్నారు. గత ప్రభుత్వ హయంలో అనేక పోరాటాలు చేసినా డిగ్రీ కాలేజీ రాలేదనీ, ప్రస్తుత ప్రభుత్వం గత ఎన్నికల్లో మేడ్చల్‌లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ అకాడమిక్ ఇయర్ 2024-2025లో డిగ్రీ కాలేజీ ప్రారంభమయ్యేలా అధికారులు, పాలకులు చూడాలని కోరారు.

ఇంటర్ కాలేజీలు కూడా..

మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు లేని శామిర్‌పేట, కీసర, ఘట్కేసర్, మేడిపల్లి మండలాల్లో ఇంటర్మీడియట్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆర్జీ అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ముఖ్యర కిరణ్ కుమార్, కట్టకూరి మనోజ్ కుమార్ ఉన్నారు.

ప్రాథమిక పాఠశాల భవనం పరిశీలన



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజునగర్‌లో గల ప్రాథమిక పాఠశాల పాత భవనం శిథిలావస్థలో ఉన్నందున అదేస్థలంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి చొరవతో గ్లాండ్ ఫార్మా లిమిటెడ్ వారి సహకారంతో సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వార సరికొత్త హంగులతో రెండంతస్తుల నూతన ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సైట్ ఇంజనీర్ వంశీతో కలిసి జరుగుతున్న భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, స్వామి గౌడ్ స్థానికులు చిలుక సాగర్, ఓదయ్య, చంద్రయ్య, బాలరాజ్, బిట్టు పాల్గొన్నారు.

జిల్లా ట్రస్మా అధ్యక్ష, కార్యదర్శులుగా జే.నాగరాజు, జి.అశోక్‌లు ఎన్నిక

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్ష కార్యదర్శులుగా జెరిపోతుల నాగరాజు గుంజడి అశోక్, కోశాధికారిగా కందునూరి పరుశురామ్ గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయి ట్రస్మా కార్యవర్గ ఎన్నికలు ట్రస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శివరాత్రి యాదగిరి పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. ఈ ట్రస్మా జిల్లా స్థాయి ఎన్నికల్లో బోడుప్పల్, మేడిపల్లిలోని పద్మశ్రీ హై స్కూల్ కరస్పాండెంట్ జేరిపోతుల నాగరాజు జిల్లా అధ్యక్షులుగా, కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ లోగల శ్రీ వాసర విద్యాలయ హై స్కూల్ కరస్పాండెంట్ గుంజడి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, కుత్బుల్లాపూర్ సూరారం కాలనీ, కి చెందిన విద్యా కిరణ్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ కందునూరి పరశురామ్ గౌడ్ కోశాధికారిగా(2024-26) రెండేండ్లకు గాను ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎన్నికల అధికారిగా ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారులు యాదగిరి శేఖర్ రావు, పరిశీలకులుగా కే. ఇన్నా రెడ్డిలు వ్యవహరించారు. ఈ ఎన్నికలలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా సుమారు 268 మంది పాఠశాల కరస్పాండెంట్స్, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారుల తోపాటు ట్రస్మ రాష్ట్ర సీనియర్ నాయకులు నల్లా భాస్కర్ రెడ్డి,భీష్మా రెడ్డి, రామకృష్ణ,సురభి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గాంధీ నగర్‌లో, డ్రయినేజీ, రోడ్లు మొదలగు సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకునిరాగా, కార్పొరేటర్ గాంధీ నగర్‌లో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాంధీ నగర్ కాలనీలో ఇప్పటికే డ్రైనేజీ లైన్ సాంక్షన్ అయ్యి ఉంది కాబట్టి , ఇంకో రెండు లేదా మూడు రోజులలో నిర్మాణ పనులు మొదలుపెడతారు అని అన్నారు. అలాగే సీసీ రోడ్లు కూడా త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వారు మా దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. విద్యుత్ వైర్ల సమస్య కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదని కాలనీ వారు కార్పొరేటర్‌కు వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, గాంధీ నగర్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సదానంద్ గౌడ్, మల్లేష్, మహేష్, మధురెడ్డి, రమాదేవి, ప్రకాష్, శంకర్, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



మహిళలు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సోమవారం 129 డివిజన్ సూరారం విశ్వకర్మ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను కాలనీ ప్రెసిడెంట్ కొండకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, సంస్కృతిక, రాజకీయ తదితర రంగాలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు ఎందులోనూ తక్కువ కాకుండా వివక్షతకు తావులేకుండా చైతన్యవంతులై ఉండాలని చెప్పారు. మహిళల విజయానికి సంకేతంగా అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు జరుపుకుంటామన్నారు. మహిళలు సమిష్టిగా ఉండి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాలనీ ప్రెసిడెంట్ కొండకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... దీని ముఖ్య ఉద్దేశం పురుషులతో పాటు మహిళలు సమానమేనా అని తెలిపారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మైళ్లు రాళ్లు సాధించాలన్నారు. అనంతరం మహిళలను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీజేపీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-కంటోన్మెంట్



మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కంటోన్మెంట్ సెగ్మెంట్లో సోమ వారం ఉద యం బిజెపి బైక్ ర్యాలీ నిర్వహించింది ఇంపీరియల్ గార్డెన్ నుంచి ఈ ర్యాలీ బోయిన పల్లి తిరు మలగిరి బొల్లారం గుండా సాగింది. అభ్యర్థి ఈటల రాజేందర్ రాజేం దర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కంటెస్టడీ ఎమ్మెల్యే గణేష్ నాయకత్వంతో కొనసాగిన ఈ ర్యాలీలో నాయకులు మల్లికార్జున్, పిట్ల నాగేష్ సరిత విజయ్ ఆనంద్,సతీష్, నర్సింగ్‌రావు, శంకర్,అజయ్ రాజుమల్లేష్,అశోక, కనకరాజు, వీరవర్దన్, విజయ్, ప్రశాంత,కిరణ్, బీజేపీ నాయకులు యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఓయూలో టీఎన్‌వీఎస్ 10వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ నవ నిర్మాణ్ విద్యార్థి సేన 10వ, ఆవిర్భావ దినోత్సవన్ని సోమ వారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు టికే. శివప్రసాద్ (ఓయూ జేఏసీ అధ్యక్షులు) అధ్వర్యంలో విద్యార్థులతో కలిసి జెండా ఎగరవేసి అనంతరం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమ వుతున్న విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చింతల పవన్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దుర్గ, ఎండీ. ఇస్మాయిల్, రవి పటేల్, ప్రవీణ్ రెడ్డి, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరిస్తాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



రాష్ట్రంలో ఎరుకల కులస్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉం టుందని చెప్పారు. సోమవారం బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్ట ర్స్‌లో ఎరుకల సమస్యలపై తెలం గాణ ఎరుకల సంఘం కుర్రు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోకిని రాజు నేతృతంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అంద జేశారు. గత పదేండ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎరుకల కులస్తుల స్థితిగతులు తెలుసు అని.. తప్పకుండా అన్ని విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ ఎరుకల సంఘం కుర్రు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ ంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలం గాణ వ్యాప్తంగా 138 పందుల సహకార సంఘాలకు ప్రభుత్వ భూములు కేటాయించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. గ్రూప్-1,2,3,4 ఉద్యోగాలు పొందడానికి ప్రత్యేకంగా హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎరుకల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారికే చైర్మెన్ పదవి ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కోనేటి నరసింహ, గోపాల్, వనం రమేష్, పాతపల్లి నరసింహ, కూతాడి సురేష్, రుద్రాక్షి నరసింహ, రాయపురం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నగరంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

● ప్రజలు సైతం నీటిని పొదుపుగా వాడుకోవాలి
● టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



నగరంలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసు కోవాలని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సాయిబాబా అన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం ప్రారంభమైన మార్చ్ నెలలోనే నగర శివారు ప్రాంతాలలో తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొవడం జరుగుతోందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి నీటి విపత్తును నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోతే ఏప్రిల్, మే నెలలో మరింత దిగజారిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికే భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయని, ప్రజలుకూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.జలాశయాల్లో గత సంవత్సరం కంటే 515 టీఎంసీలు తక్కువగా ఉన్నాయని, ప్రాజెక్టులన్ని డెడ్ స్టోరేజ్ నీటి మట్టానికి పడిపోయాయన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 1505.56 టీఎంసీలు తక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలాశయాలలో నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయన్నారు. ఇప్పుడే ఇలావుంటే వచ్చే రెండు నెలల్లో ఇంకెన్ని ఇబ్బందులు తలెత్తుతాయో ప్రభుత్వ వాస్తవాన్ని గ్రహించి, ముందస్తు చర్యలు చేపట్టాలని సాయిబాబా కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, జీ.బాలరాజ్ గౌడ్, యాదగిరిరావు, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గన్నారు.

సమాజంలో మహిళలదే కీలక పాత్ర



● భారతీయం సంపాదకురాలు సత్యవాణి
● కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలు చాలా శక్తి మం తులని, ఓర్పు, నేర్పు నిబద్ధ తతో పనిచేస్తారని భారతీయం సంపాద కురాలు, శ్రీ ధర్మపురి క్షేత్రం వ్యవ స్థాపకురాలు సత్యవాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో, కుటుంబంలో స్త్రీయే ప్రధాన బిందువని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్ర తదితర చిన్నతనంలోనే అధ్యయనం చేయాలన్నారు. సమాజంలో మహిళలది కీలక పాత్ర అని, మహిళలు ఓర్పు నేర్పు నిబద్ధతతో పని చేస్తారన్నారు. మా దేశానికి పట్టుకొమ్మలు కుటుంబ వ్యవస్థ అని, మహిళలు స్త్రీ తత్వాన్ని, మాతృత్వాన్ని కోల్పోవద్దని దీనివల్ల జాతి నిర్వీర్యమైపోతుందన్నారు. నీతివంతమైన సమాజం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగ, కుటుంబ బాధ్యతలను సమానంగా చూసుకోవాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. తోటి మహిళలు ఆపదలో ఉన్నప్పుడు సాయం చేసి ఆదుకోవాలని తెలి పారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సత్యవాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరవన్, డీఆర్వో వెంకటాచారి, డిప్యూటీ కలెక్టర్లు లావణ్య, అపర్ణ, తహసిల్దార్లు, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గన్నారు.

దళిత క్రైస్తవులకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

● దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి.వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆట గడుగున దళిత క్రైస్తవులకు ద్రోహం చేయడం కాకుండా గత మూడు నెలలు గా దళిత క్రైస్తవులపై దాడులు చర్చిల కూల్చివేత కాల్చివేత జరుగు తున్న ముఖ్యమంత్రి స్పందించకపోవడం క్రైస్తవ మైనార్టీ కమిషన్ చైర్మన్ పదవి సైతం తన సామాజిక వర్గానికి తెలంగాణ కాని వాడికి కట్టబెట్టడం దుర్మా ర్గమని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొ గాలివినోద్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా మార్చి 14న, మహబూబ్ నగర్ లో అంబేద్కర్ కళా నిలయంలో దళిత క్రైస్తవులపై జరు గుతున్న దాడులకు నిరసనగా జరిగే దళిత క్రైస్తవ గర్జన సభ పోస్టర్స్ ప్రొ.వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో సుమారు కోటి మంది ఉన్న దళిత క్రైస్తవుల సత్తా ఏమిటో నిరూపిస్తామని 17 పార్లమెంటు స్థానాల్లో దళిత క్రైస్తవులను పోటీలో నిలబెడతామని ఆయన ప్రకటించారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి

● జనరల్ సెక్రటరీ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ వాసిరెడ్డి శివాజీ డిమాండ్




నవ తెలంగాణ-కంటోన్మెంట్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని, కార్మిక. హక్కులను కాపాడాలని, ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ డిమాండ్ చేశారు.ఆదివారం సికింద్రాబాద్ పద్మారావు నగర్‌లో గల తపాలా కార్యాలయం ప్రాంగణంలో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్-సి, గ్రూప్ పోస్టుమెన్, ఎంటీఎస్ సికింద్రాబాద్ డివిజనల్ సంఘాల 28 వ ద్వైవార్షికోత్సవ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సభలో వాసిరెడ్డి శివాజీ తో పాటు, మాజీ సెక్రటరీ జనరల్ డి.కిషన్ రావు, సికింద్రాబాద్ డివిజనల్ అధికారి ఎ.సుబ్రమణ్యం,సబ్ డివిజనల్ ఐపివో రాకేష్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శులు రామ్ కుమార్ , కృష్ణ, నర్సింహారెడ్డి, డివిజనల్ అధ్యక్షులు టి.శ్రీనివాస్ రెడ్డి,మసూద్, కార్యదర్శులు సిరాజు ద్దీన్, శ్రీనివాసాచారి, మాజీ కార్యదర్శులు గవ్వల శ్రీనివాసులు, టి.శ్రీనివాస్ రావు,మూర్తి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా వాసిరెడ్డి శివాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తిరిగి పాత పెన్షన్ స్కీమ్ ను అమలు చేయాలని కూడా కోరారు.సమస్యల సాధనలో కృషి చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు ఆర్గనైజేషన్ మాజీ సెక్రటరీ జనరల్ డి.కిషన్ రావు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ట్రేడ్ యూనియన్ హక్కులను కాపాడాలని కూడా డిమాండ్ చేశారు. ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరంపర కొనసాగుతోంది కిషన్ రావు అనేక విమర్శ విమర్శించారు ప్రజలతో ఎంతో సంబంధాలు ఉన్న పోస్టల్ శాఖ పై కూడా కేంద్రం కన్నెర్ర చేసిందని, అంచెలంచెలుగా ప్రైవేటీకరణ పూనుకోవడం జరుగుతుందని, సంవత్సరానికి మూడు పథకాలను ప్రవేశపెట్టి ఉద్యోగుల నడ్డి విరుస్తుందని ఆయన తెలిపారు. పోస్టల్ శాఖలో ఉన్న ప్రధాన యూనియన్ లపై కూడా బెదిరింపులకు పాల్పడి యాభై శాతం పైబడిన సభ్యత్వం ఉన్న ఎన్ఎఫ్‌పీయూ సంఘాన్ని రద్దు చేయడం జరుగిందన్నారు దేశంలో అనేక సమస్యలతో సతమతమవుతున్న పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై అనేక విధాలుగా పోరాడుతున్నారని, జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, డివిజన్ స్థాయిలో యూనియన్ లు పటిష్టతకు తీవ్ర కృషి చేయాలని, సభ్యత్వం పెంచాలని డి.కిషన్‌రావు సూచించారు. అనంతరం సెక్రటరీ జనరల్, జనరల్ అతిధులందరికి, రిటైర్డ్ యూనియన్ నాయకులకు పుష్ప గుచ్చాలు అందజేసి శాలువలు కప్పి సన్మానించారు. చివరగా గ్రూప్ సి,పోస్ట్‌మెన్ ఎంటిఎస్ సంఘాల నూతన కార్యవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.



నేషనల్ మీదవిఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్, గాంధీ మెడికల్ కాలేజ్ ఆఫ్ నర్సి ంగ్ వారి అద్వర్యంలో నేషనల్ మీదవిఫరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ మాట్లా డుతూ మినిస్ట్రీ అఫ్ హెల్త్ అండ్ ఫ్యా మిలి వెల్ఫేర్ కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన 14నేష నల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లలో మన రాష్ట్రానికి 2 వుండటం అది కూడా ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఒకటి, ఫెర్నాండేజ్‌కి ఒకటి వుండటం మన తెలంగాణ రాష్ట్రానికి గర్వకరణం అని చెప్పారు. దూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సంరక్షణ సవాళ్లలో నిపుణులు, శిక్షణ పొందిన సిబ్బంది కొరతమాత్రమే కాకుండా అధిక సంఖ్యలో సిజేరియన్ ప్రసవాలు కూడా ఉన్నాయని అని పేర్కొన్నారు. 88శాతం ప్రసూతి మరణాలు, నవజాత శిశువుల మరణాలను ఈ సెంటర్ ద్వారా నివారించవచ్చున్నారు. ఇది మన రాష్ట్రానికే లాభదాయకం కాకుండా ఇతర రాష్ట్రాల వారికి కూడా అందు బాటులో ఉండి దేశ లక్ష్యాలను చేరుకుం టుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్. చొంగ్తు , మెడికల్ డైరెక్టర్ డా.ఎన్.వాణి , డా.రవీందర్ నాయక్ , వైద్య విధాన పరిషత్ డా.జె. అజయ్ కుమార్ ఆరోగ్య శాఖ సిబంది పాల్గొన్నారు.

ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్‌ను అరెస్టు చేయాలి



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎస్‌బీఐ చైర్మెన్‌ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఆబిడ్స్ ఎస్బీఐ బ్యాంక్ ఎదుట సీపీఐ(ఎం) పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సిహెచ్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఎన్నికల బాండులను మార్చి 6 వరకు బయటపెట్టాలని ఎస్బీఐకి నోటీసులు ఇచ్చిందని, 10 నిమిషాల్లో బయటపెట్టే పనికి జూన్ వరకు టైం అడిగి బీజేపీకి అనుకూలంగా బ్యాంకులాగా పని చేస్తుందన్నారు. అందువల్ల సుప్రీంకోర్టు ఎస్బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రజాధనాన్ని బిజెపి పార్టీ ఎన్నికల ఖర్చు కోసం ఇస్తున్న ఎస్బీఐ వ్యవ హారం చూస్తే చాలా ఆందోళనకరంగా ఉంది. ప్రజలందరూ కూడా స్పందించి ఎస్బీఐ వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, సాయిశేషగిరిరావు, జితిన్‌ప్రసాద్,సికిందర్ , రాములు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే యావత్తు తెలంగాణకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

● బీఆర్ఎస్ నాయకులు తుంగబాలు

నవతెలంగాణ-ఓయూ



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సాక్షాత్తు యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధికార మదంతో కాళ్ళ దగ్గర కూర్చోబెట్టడం యా వత్తు తెలంగాణ సమాజం నిజంగా సిగ్గుపడాల్సిన విష యమని బీఆర్ఎస్ నాయకులు తుంగబాలు పేర్కొన్నారు. తక్షణమే యావత్తు దళిత జాతికి బేషరతుగా సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని తుంగబాలు డిమాండ్ చేశారు.భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తే పదవిలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి దళితులను దగా చేస్తున్నా దన్నారు. ఏమన్నా అంటే కొప్పుల ఈశ్వర్‌ని సీఎం కేసీఆర్ జర పక్కకు వెళ్ళయ్య అంటే దానిని ట్రోల్ చేసిన కాంగ్రెస్ పార్టీ సాక్షాత్తు డిప్యూటీ సీఎంగా ఉన్న భట్టిని వారి కాళ్ళ దగ్గర కూర్చోబెట్టడం పై సమాధానం ఏమిటి? అని ప్రశ్నించారు. సహజంగా సీఎల్పీ నేతనే సీఎం అవుతారుమరి సీఎల్పీ హోదాలో ఉన్న భట్టికి ఆరో వేలు లాంటి డిప్యూటీ సీఎం పదవి ఎలా ఇచ్చారు. ఇది కాదా దళిత ద్రోహం అని, ఇంకా రాష్ట్రంలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి సంక్షేమం కోసం ఇచ్చిన పదమూడు హామీల అమలు ఏమైందని కాంగ్రెస్‌ని తుంగబాలు ప్రశ్నించారు. ఎమ్మెల్యే, మంత్రి ,డిప్యూటీ సీఎం అయిన భట్టిని కాళ్ల కింద కూర్చుబెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డిపై తుంగబాలు ఘాటుగా విమర్శించారు. తక్షణమే యావత్తు దళిత జాతికి బేష రతుగా సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని తుంగబాలు డిమాండ్ చేశారు.

మంచినీటి, సివరేజీ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఓయూ



సికింద్రాబాద్ పరిధిలో మంచి నీటిసరఫరా, సివరేజి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాగాలిగామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ మునిసిపల్ డివిజన్ పరిధిలో రూ.47 లక్షల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులను పద్మారావు గౌడ్ సోమ వారం ప్రారంభిం చారు. జోషి కాంపౌండ్‌లో రూ.35 లక్షల ఖర్చుతో సివరేజి లైన్ నిర్మాణం, రూ.12 లక్షల ఖర్చుతో సితాఫల మండీ రిజర్వాయర్ మరమ్మతు పనులను ఈ సందర్భంగా ప్రారంభిచారు. కార్యక్రమంలో అయిన మాట్లాడుతూ. సికింద్రాబాద్ పరిధి లో మంచి నీటి సరఫరా, సివ రేజి సమస్యల పరిష్కా రానికి అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నమని తెలిపా రు.2014 సంవత్సరానికి ముందు నాటి పరిస్థి తులతో పోల్చితే సికింద్రాబాద్ పరిధిలో మంచి నీటి సరఫరా గణనీయంగా మెరుగు పడిందని తెలిపారు. గతంలో 310 కిలోమీటర్ల మేరకు దూరాన్ని కలుపు తూ 38,912 కనెక్షన్ లతో 55 ఎం ఎల్ డీ సామర్ధ్యంలో మాత్రమే నీటి సరఫరా సాగేదని, ప్రస్తుతం 13 రిజర్వాయర్ల తో నీటి సరఫరా సామర్థ్యం 73 ఎం ఎల్ డీ ల మేరకు పెంచుకున్నామని తెలిపారు. సీతాఫలమండీ రిజర్వాయర్‌ను పునర్నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి నిపు ణుల నుంచి నివేదికను సిద్ధం చేసి పక్షం రోజుల్లో అందించాలని సూచిం చారు. జలమండలి డీజీఎం వై.కృష్ణ, కార్పొరేటర్ కుమారి సామల హేమ, మేనే జర్ అన్విత్ కుమార్, ఏఈ కౌశిక్, నేతలు తీగుల్ల రామేశ్వర్ గౌడ్, కరాటే రాజు, జోషి కాంపౌండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ సుందర్, నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

● ఎమ్మెల్యే అక్బర్ ఓవైసీ

నవతెలంగాణ-బంజారాహిల్స్



రక్తదానం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవస రమని చంద్రాయన గుట్ట ఎమ్మెల్యే అక్బర్ ఓవైసీ అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడు తు న్న వారి కోసం తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అక్బరు ద్దీన్ ఓవైసీ టీఎస్‌టీఎస్ అధ్యక్షులు చంద్రకాంత్ అగ ర్వాల్, సెక్రటరీ సుమన్ జైన్, జాయింట్ సెక్రెటరీ బిగ్‌లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. జన్యు సం బంధ సమస్యలతో తలసీమియా వ్యాధి బారిన పడ్డ చిన్నారులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఆవేదన గురవుతున్నారని అన్నారు. అలాంటి కుటుంబాలను ఆర్థిక ఇబ్బందులు సైతం మరింత ఆవేదన కలిగిస్తాయని అన్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తాన్ని అందించేందుకు ఏర్పడ్డ తల సేమియా అండ్ సికిల్ సొసైటీ సేవలు వెలకట్టలేనివని అన్నారు. సమయానికి రక్తం అందక వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు పడే ఆవేదన వర్ణనాతీతమన్నారు. స్వచ్ఛందంగా రక్తాన్ని అందిం చేందుకు కృషి చేస్తున్న సంస్థలకు అండగా నిలవా ల్సిన అవసరం ఉందన్నారు. నగరానికి చెందిన వం దలాది మంది యువతీ యువకులు పాల్గొని రక్తాన్ని దానం చేశారు. 1050 యూనిట్ల రక్తాన్ని స్వీకరిం చినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు.



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోని సమస్యాత్మక పోలీస్ స్టేషన్ల పరిధిలో తీసుకోవాల్సిన భద్రత, జాగ్రత్తలపై జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తో పాటు, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఎల్ అండ్ ఓ) శ్రీ విక్రమ్ సింగ్ మాన్ తదితర అధికారులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
11
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

'సంస్కృతాంధ్ర భాషా పండితుడు వేటూరి ప్రభాకర శాస్త్రి'



నవతెలంగాణ-కల్చరల్

సంస్కృతంలో విశేష పాండిత్యం కల వేటూరి ప్రభాకర శాస్త్రి ప్రామాణికమైన తెలుగు భాషా వేత్త అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమంలో భాగంగా వేటూరి ప్రభాకర శాస్త్రి సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయనపాల్గొని మాట్లాడుతూ ప్రభాకర శాస్త్రి అన్నమయ్య కీర్తనలు వ్యాఖ్యా సహితంగా పరిష్కృతం చేసిన ప్రజ్ఞానిధి అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై పత్రికా రచయిత జయ సూర్య, గాన సభ పాలక మండలి సభ్యులు బండి శ్రీనివాస్, ద్రావిడ గుందావరపు గీతా దేవి పాల్గొన్నారు.

నవభారత సాక్షరతను విజయవంతం చేయాలి



- ఈ ఏడాది 9135 మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయం
- అదనపు కలెక్టర్ కదిరవన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పి. కదిరవన్ కోరారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవభారత సాక్షరతా కార్యక్రమంపై కన్వర్జేన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో 68,454 మంది నిరక్షరాస్యులు ఉన్నట్టు పట్టణ ప్రగతి సర్వే ద్వారా గుర్తించామని, ఈ ఏడాది 9135 మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించామన్నారు. నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలని ఆయన సూచించారు. నవభారత సాక్షరతా కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం ప్రయోజిత కార్యక్రమమని 2022-27 వరకు అయిదేండ్లపాటు అమలయ్యేలా ప్రకటించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు ఖర్చు పెడుతాయని, 15-35 ఏండ్ల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం పూర్తిగా స్వచ్ఛంద సేవా కార్యక్రమమని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదువుతున్న పిల్లలు, రిటైర్డ్ ఉద్యోగులు, అంగన్వాడీ టీచర్లు, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, జీహెచ్ఎంసీ(ఎస్‌హెచ్‌జీ) నిర్వహించే కార్యక్రమమని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వయోజన విద్య డిడి నాగలక్ష్మి, డీఈవో ఆర్.రోహిణి, డీడీ ఎస్సీ వెల్ఫేర్ పెరిక యాదయ్య, డీఎండబ్ల్యూవో ఇలియాజ్ అహ్మద్, బీసీడబ్ల్యూవో జి.ఆశన్న, డీటీడబ్ల్యూ కోటాజి, సికింద్రాబాద్, హైదరాబాద్ ఆర్డీవోలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 132 దరఖాస్తులు

సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాలకు చెందిన 132 మంది దరఖాస్తు చేసుకున్నారని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ పి.కదిరవన్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసిల్దార్లతో మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 132 అర్జీలు రాగా.. 117 గృహ నిర్మాణ శాఖవి, ఇతర శాఖలకు సంబంధించినవి 15 వచ్చాయని ఆయన తెలిపారు.

విద్యార్థుల విజ్ఞానం వెలికి తీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు



- ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రతి పాఠశాలలో విద్యార్థుల విజ్ఞానమును వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని,విద్యతోనే సమాజంలో ప్రతీ ఒక్కరికి మంచి గుర్తింపు వస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని క్యూబా కాలనీలో ఉన్న ఫైన్ మాడల్ స్కూల్ లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ ఒక్కరు కృషి పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.బాగా చదువుకొని తల్లి దండ్రులకు పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుక రావాలని కోరారు.నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు అందుకోసం ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థు లకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జల్ పల్లి మున్సిపాలిటీ చైర్మెన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, ఫైన్ మోడల్ స్కూల్ చైర్మన్, వైస్ చైర్మెన్, ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆందోళన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని గన్ ఫౌండ్రీ ఎస్‌బీఐ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆ ఎన్నికల బాండ్లకు చట్టం చేసిన రోజే లంచగొండితనాన్ని చట్టబద్ధం చేయడమేనని సీపీఐ (ఎం)తోపాటు ఇతర ప్రతిపక్షాలు స్పష్టం చేశాయన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో దొడ్డి దారిన డబ్బు పోగేసి బీజేపీ ఎన్నికల ఖర్చులు నిర్వహించుకు నేందుకు ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కుల్చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అయినా ఆ ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలను బట్టబయలు చేయాల్సి బాధ్యత ఎస్‌బీఐ చైర్మెన్‌పై ఉందన్నారు. ఎస్‌బీఐ వద్ద అత్యాధునిక టెక్నాలజీ, కావాల్సినంత యంత్రాంగం ఉందన్నారు. ఒక్క క్లిక్‌తో సమాచారం మొత్తం తీసుకునే అవకాశం ఉన్నా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మోడీ తప్పుడు వ్యవహారాలను కాపాడేందుకు దాచి పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారే తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ చైర్మెన్ వివరాలను కోర్టుకు అందజేయాలని లేనిపక్షంలో పోలీసులు కోర్టు ధిక్కార నేరం కింద ఎస్‌బీఐ చైర్మెన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. దశరథ్, ఎం. మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బి. ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్, సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.



'మాల్కాజిగిరి' అభివృద్ధికి నిరంతరం కృషి

నవతెలంగాణ -ఎల్‌బీనగర్

అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు మాల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటి చేస్తున్నట్టు వైష్ణవి ప్రసాద్(వైష్ణవి క్యాటరర్స్ ప్రసాద్) తెలిపారు. అంజిరెడ్డి గార్డెన్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, బ్రహ్మణ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల బ్రాహ్మణ సంఘాలు వైష్ణవి ప్రసాద్ కు మద్దతు ఇవ్వాలని తీర్మానం చేసి సంఘీభావం ప్రకటించారు. భాగ్యనగర్ బ్రహ్మణ సొసైటీ అధ్యక్షులు దుడ్డు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బ్రహ్మణుల శంఖారావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి ఉమ్మడి రాష్ట్రంలో, నగరంలో అన్ని వర్గాల ప్రజలకు విద్యా, వైద్య రంగాల్లో చేయూతనందించి సేవ చేశానని తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధికి పాటుపడతానన్నారు. ప్రతి నియోజకవర్గం లో 10 మంది సభ్యులతో కమిటీ వేసి ఆఫీస్‌ను ఏర్పాటుచేస్తానని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని మధ్యతరగతి, పేదవారికి విద్య, వైద్యం, ఉచితంగా అందేలాగా సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మణ సంఘాల అధ్యక్షులు మంగపతి రావు, దర్శనం శర్మ, తులసి శ్రీనివాస్, టీబీఎస్‌ఎస్‌ఎస్ నాయకులు జగన్మోహన్ శర్మ, బసవరాజు శ్రీనివాస్, ఎంవీశాస్త్రి, నందిరాజు లక్ష్మీనారాయణ. వెంట్రా ప్రగడ సుబ్బారావు, వక్కలంక శ్రీనివా స్ రావు, వారణాసి వంశీ, మంగు రాఘ వరావు, శ్రీధర్ బాబు, యాద గిరి రావు, గోపి క్రిష్ణమా చార్యులు, సీతారామయ్య, మునిపల్లె శ్రీనివాస్, గొల్లపూడి రాజేశ్వరరావు, సోమయాజులు, మూర్తి, కల్పవల్లి, అనురాధ, భవాని, శ్రీదేవి, వివిధ సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- ముఖ్యమంత్రికి టీఎస్ఈఈయూ-327 (ఐఎన్‌టీయూసీ) విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-327 (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశమనంతరం ఆయన విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఇనుగాల శ్రీధర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులందరికి పాతపెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, 1999 నుంచి 2004 వరకు విద్యుత్ సంస్థల్లో నియమితులైన వారికి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్టిజన్ కార్మికులందరికీ ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలన్నారు. ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మాన్డ్ కార్మికుందరిని ఆర్టిజన్‌లుగా గుర్తించాలని, చనిపోయిన అన్‌మాన్డ్ కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. కార్మికుల నాయకులకు ఆపివేసిన ఫుల్ టైం సౌకర్యం వెంటనే పునరుద్ధరించాలని, గత మూడేండ్ల నుంచి అన్ని క్యాడర్లలో ఆగిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల పిల్లలకు బీటెక్, డిప్లొమా అర్హత ఉన్నవారికి సబ్ ఇంజనీర్ ఉద్యోగాలు కల్పించాలని, విద్యుత్ సంస్థలో మిగిలిపోయిన కాంట్రాక్టు కార్మికులందరిని ఆర్టిజన్‌లుగా గుర్తించాలన్నారు. 2011లో రెగ్యులరైన జూనియర్ లైన్‌మెన్లకు ఎరియర్స్ చెల్లించాలని, అన్ని సబ్ స్టేషన్స్‌లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2022 వేతన సవరణలో ఆ ఏడాది ఏప్రిల్,1 తర్వాత ఉద్యోగంలో చేరినవారికి పాతస్కేల్ కాకుండా.. వారికి కొత్త స్కేల్ ఇవ్వాలన్నారు. జెన్‌కోలో ఆగిపోయిన కారుణ్య నియామకాలను వెంటనే ఇవ్వాలని, సింగరేణి మాదిరిగా విద్యుత్ ఉద్యోగులకూ కోటి రూపాయాల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పరిష్కారానికి ప్రయత్నాలు మొదలు



- మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి అన్ని మార్గాలను అధ్యయనం చేస్తున్నామని, అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తున్నట్టు మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయనను హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించింది. హెచ్‌యూజే నూతన డైరీని ఆయనకు నేతలు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే బృందంతో జర్నలిస్టుల సమస్యలపై మీడియా అకాడమీ చైర్మెన్ చర్చించారు. ప్రధానంగా ఇండ్ల స్థలాల విషయంలో ఏం చేయాలనే దానిపైనా దృష్టి సారించినట్టు శ్రీనివాస్? రెడ్డి వివరించారు. జేఎన్‌జే ఇష్యూను పరిష్కరిస్తూనే.. ఇతర సొసైటీలలో ఉన్న జర్నలిస్టులకు ఏ ప్రాతిపదికన ఇండ్ల స్థలాలు ఇవ్వాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. రాజధాని కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఒకేచోట ఇండ్ల స్థలాలు ఇవ్వడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదని, నగరం నలువైపులా స్థలాలు కేటాయించే అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు మరింత ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్లనున్నట్టు స్పష్టం చేశారు. వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల బాధ్యులతో చర్చలు జరిపినట్టు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. డిజిటల్ మీడియాలో పనిచేస్తున్న వారి విషయంలో ఎలాంటి ప్రాతిపదికతో ముందుకు వెళ్లాలనే దానిపైనా కూడా ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. మీడియా అకాడమీ చైర్మెన్‌ను కలిసిన వారిలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ రమేష్ , ఈసీ మెంబర్ సుభాష్ ఉన్నారు.

'కృతజ్ఞత సభకు ఉద్యమకారులు తరలిరావాలి'

నవతెలంగాణ-తుర్కయంజాల్



బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో టీయూఎఫ్ ఆధ్వర్యం లో నేడు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభకు ఉద్యమకారులు తరలిరావాలని టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ కందాల బలదేవ రెడ్డి లు కోరారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడలోని టీయూఎఫ్ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సభకు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, మున్సిపల్, డివిజన్ స్థాయిలో ఉన్న ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. టీయూఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, దక్షిణ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గుర్జాని వెంకటేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసిం హాగౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, రంగా రెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు దుగ్గాని శ్యామల, రంగారెడ్డి జిల్లా టీయూఎఫ్ కార్యదర్శి గుండె రవీందర్, నామాల బాలకృష్ణ, బంగారు నరసింహ, పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

భిన్న రంగాల మహిళలకు సత్కారం



నవతెలంగాణ-కల్చరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వై.ఎస్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ ,హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ సంయుక్తం గా సంస్థ కార్యలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు జరిగాయి. ట్రస్ట్ చైర్మెన్ వై.శ్రీరామ చంద్ర మూర్తి మాట్లాడుతూ లింగ వివక్షత లేని సమాజం కోసం ప్రపంచ వ్యాప్తంగా మహిళ అభున్నతి ఆకాంక్షతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపు కొంటారన్నారు. తెలుగు నాట భిన్న రంగాలలో మహిళలు సాధించిన విజయాలకు గుర్తుగా తమ సంస్థలు వారిని సత్కరిస్తున్నా యని తెలిపారు. నాట్య గురువు ఝాన్సీ రామ్ ను నాట్య విశిష్ట , సాహితీ రంగంలో నామని సుజన దేవి నీ సాహిత్య సౌగంధి, వ్యాఖ్యాన రంగంలో మీనా కుమారిని మెలోడీ క్వీన్ బాల నాట్య కళాకారులు నందిత, సమ్మోహన కృష్ణ, నాట్య చతుర బిరుదులతో సత్కరించారు.మీకూ అతిథిగా ప్రముఖ నాట్య గురువు డాక్టర్ సురభి లక్ష్మీ శారద పాల్గొని మాట్లా డుతూ మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడుకోవడం మాత్రమే కాకుండా సమాన హక్కులు కోసం జరుగుతున్న పోరాటాలకు మద్దతు కూడా ఇవ్వాలని అన్నారు.ఈ సందర్భంగా రాజనాల శ్రీదేవి రమణి వై. కామేశ్వరి తదితరులు కవితలు చదివారు. మహిళా హక్కుల పై ప్రసంగించరు

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సమావేశం

- పలు ఎజెండా అంశాలపై చర్చ, ఆమోదం
- వాటా ధనంపై 6 శాతం డివిడెండ్
- రైతులకు రూ. 10 వేల పారితోషకం
- 28న సర్వసభ్య సమావేశంలో ఎజెండా అంశాల ఆమోదానికి నివేదిక
- చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం సోమవారం చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి అధ్యక్షతన సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో అనేక ఎజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు.ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మెన్ మాట్లాడుతూ గత సమావేశంలోని తీర్మానాలను పరిశించి ఆమోదించడం జరిగిందని, సభ్యులు పెట్టుకున్న సభ్యత్వంను పరిశీలించి, స్వల్ప కాలిక రుణాలను పరిశీలించి మంజూరు చేసేందుకు ఆమోదించామని, రుణాలు వసూళ్ల శాతం సంతృప్తికరంగా లేనందున ప్రతి నెలా రూ. 2 కోట్లు వసూళ్లు చేసేందుకు తీర్మానం చేసి ఆమోదించామన్నారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించిన రైతులను సర్వసభ్య సమావేశంలో సన్మానించి పదివేల రూపాయల పారితోషికం అందించుటకు పాలకవర్గం ఏక గ్రీవంగా తీర్మానం చేయగా, ఇట్టి తీర్మానం ఈ నెల 28 న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ఆమోదం పొందవలెనకు తీర్మానించామన్నారు. అలాగే గ్రామానికి ఒక రైతు చొప్పున ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించడం జరిగిందని, సంఘంలో అప్పు తీసుకున్న సంఘం డైరెక్టర్లు వారి బంధువులు సకాలంలో చెక్కించవలెనని,లేని ఎడల సంఘం డైరెక్టర్ లను డిపాల్టర్‌గా పరిగణించి పరిగణలోకి తీసుకోవడం ఉండగా, ఈ అంశములు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉన్నందున వాయిదా వేయవలెనని పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించనైనదన్నారు. 31 మార్చి 2023 వరకు ఉన్న వాటాధనంపై 6 శాతం డివిడెంట్ ఇచ్చుటకు చర్చించి ఆమోదించారు. అలాగే సంఘంలోని డెయిరీ లోన్స్ తీసుకున్న రైతుల నుంచి రహదారి బిల్లు తీసుకోవద్దని పాలకోర్గం ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ప్రాపర్టీని మార్టిగేజీ చేసి సంఘం నుండి సులభతరంగా రైతులకు రుణాలను మంజూరు చేయుటకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఆమోదించామన్నారు. సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 28 నిర్వహించుటకు చర్చించి ఆమోదించామన్నారు. సభకు చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి, డైరెక్టర్ లు పగిళ్ళ బాల్ రెడ్డి, కందాడి మహిపాల్ రెడ్డి హాజరయ్యారు.

సభకు గైర్హాజరైన డైరెక్టర్లు

నార్లకొండ మల్లమ్మ, ,మొగుళ్ల చిన్న యాది రెడ్డి, బిజిలి బాల నర్సయ్య, గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటికల మహేందర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు, చేగురి భరత్ కుమార్, చింతల లక్ష్మమ్మలు ఉన్నారు.

28న జరిగే సర్వసభ్య సమావేశంలో సమర్పించనున్న నివేదికలు

1) 1 సెప్టెంబర్ 2023 నుంచి 29 ఫిబ్రవరి 2024 వరకు సంఘం వ్యవహారంలపై
2) 1 సెప్టెంబర్ 2023 నుండి 29 ఫిబ్రవరి 2004 వరకు సంఘం జమా ఖర్చులపై అనుమతికై
3) పంట అప్పులుసకాలంలో కట్టిన రైతులను జీబీలో సన్మానించి వారికి 10 వేల రూపాయల పారితోషికం కై
4) 31 మార్చి 2023 వరకు ఉన్న వాట ధనం పై 6 శాతం డివిడెండ్ ఇచ్చుటకు
5) డెయిరీ లోన్ తీసుకున్న రైతుల నుంచి రహదారి బిల్ తీసుకోవద్దని సభ అనుమతి కై
6) 31 మార్చి 2023 ఆడిట్ రిపోర్ట్ ఆమోదం
7) అధ్యక్షుడు ఆమోదంతో ఇతర అంశాలపై సర్వ సభ్య ఆమోదం కోసం నివేదిక సమర్పించనున్నారు .



ఘనంగా రాజ్‌కుమార్ దంపతుల వివాహా వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, డిస్ట్రిక్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్, బి.వి.ఆశోకా రాణి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆ యూనిట్ కార్యదర్శి ఎం.భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి.డేవిడ్, కోశాధికారి ఎస్.డీ ప్రేమ్ కుమార్, జాయింట్ సెక్రటరీ జయంతి రెడ్డి, వారి కార్యవర్గం ఆధ్వర్యంలో సోమవారం డీఈవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతుల చేతులమీదుగా కేక్ కట్ చేయించారు. అనంతరం వారికి శాలువ కప్పి పూలబొకే అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చారి, రమేష్, సూర్య, మీర్జా, కె.పి.అనురాధ, రాజశేఖర్, విజయలక్ష్మి, జి. రాజ్‌కుమార్, సరళారెడ్డి, సుగుణారెడ్డి, తఖియాలీ, అర్చన, అజ్మత్, మంజు, నర్సింహ్మా, బషీర్, విలియం, జేమ్స్, రాణి, రాజేందర్, శశరత్న, సోహైల్ అహ్మద్, ఫయాజ్, హమీద్, సురేష్, శ్రీధర్, యోగి, ఇమ్రాన్, శ్రీలేక, అల్తాఫ్, జకీర్ సూర్యప్రకాష్, గిరిజ, రేణుక, సాజిద్, కిరణ్, అనిల్, విజయకుమార్, దేవిప్రసాద్, రాకేష్, కృష్ణ, లావణ్య, గౌసియా, జంబయ్య, లక్ష్మిపతి, చైతన్య, అజీజ్, సదత్, పరమేష్, మహేందర్, కుశల్, సర్ఫరాజ్, రోషన్, రవి, పవన్, రవికాంత్, సౌజన్య, సుకన్య శ్రీదేవి, చైతన్య, సుజాత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | మార్చి 12, 2024 | www.navatelangana.com

క్రికెట్‌లో గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-కాప్రా

శివరాత్రి పండుగను పురస్కరించుకుని మీర్‌పేట్ లక్ష్మీనగర్ కాలనీ గ్రౌండ్‌లో అయ్యప్ప చాందినీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో రామంతపూర్ ఓయూ టీం విజేతగా నిలిచిం ది. వారికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదా స్ సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 32టీమ్‌లు పాల్గొనగా మల్లాపూర్ వైసి టీమ్ రన్నర్స్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు టిల్లు ముదిరాజ్, నాచారం ఎస్‌ఐలు వెంకటయ్య, కుమారస్వామి, రంగు ప్రసాద్, నవీన్, పవన్, సతీష్, అజయ్, నరేశ్, శ్రవణ్, భాను, లడ్డు, సూరజ్, సైఫ్, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలతో సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

రంజాన్ పండగను శాంతియుతంగా జరుపుకోవాలని కుషాయిగూడ పోలీస్ శాఖ వారు ముస్లిం మతపెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం భారత్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమవేశానికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వారు మాట్లాడుతూ.. పోలీసుల సూచనలు పాటిస్తూ రంజాన్ పండుగ జరుపుకోవాలన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ రంజాన్ పండగకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకన్న, షఫీ, ముస్లిం మతపెద్దలు, డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు అలీముద్దీన్, సెక్రెటరీ నిస్సార్, అహ్మద్ గోరి, కాలనీవాసులు మల్లారెడ్డి, ఇక్బాల్, నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, కత్తుల రాజ్ కుమార్, బాలరాజు, రమేష్, లింగం, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ పార్టీల మధ్యే పోటీ..!

- మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో తాజా పరిస్థితి
- ఈటల రాజేందర్‌ను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ నుంచి ఖరారు కాని అభ్యర్థి
- బలమైన నేతల వేటలో బీఆర్ఎస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రధానంగా జాతీయ పార్టీల మధ్యే పోటీ కొనసాగాలే కనిపిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ సెగ్మెంట్‌ను ప్రత్యేకంగా తీసుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పంది. కాగా బీజేపీ అధిష్టానం ఇప్పటికే మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేరును ఖరారు చేయగా.. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ఇక బీఆర్ఎస్ నుంచి అభ్యర్థి ఎవరో ఇంకా స్పష్టత రాకపోగా.. బలమైన నేతను బరిలో దింపేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

మరో రెండు, మూడు రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతోపాటు కంటోన్మెంట్, ఎల్బీ నగర్ నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. మినీ భారత్‌గా పిలువబడే మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై వివిధ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. రాజకీయ విశ్లేషకులు సైతం ఇప్పటి నుంచే గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. జాతీయ అంశాలు ఎక్కువగా ప్రభావితం చేసే ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోటీపై ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడు నెలల క్రితం రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ తరపున పోటీచేసే అభ్యర్థి విషయంలో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈటల రాజేందర్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. గత ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన ఈటల వైపే బీజేపీ అధిష్టానం మొగ్గు చూపడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. ఆచితూచి వ్యవహరిస్తోంది. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ ఈటలకు అన్ని విధాలా సరితూగే బలమైన నేతలను బరిలో దించే యోచనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అధిష్టానాలు ఉన్నట్టు తెలుస్తోంది.

అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే..

మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలనూ బీఆర్ఎస్ గెలుచుకుంది. ఇటీవల కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మిగతా ఆరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్క సీటూ గెలుచుకోకపోయినా.. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఈ రెండు పార్టీలకు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన ఓటు బ్యాంకు నమోదైంది. ఆయా నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచాయి. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. ఇక ఈ సెగ్మెంట్ పరిధిలో దాదాపు 7 లక్షల వరకు నార్త్ ఇండియన్స్ ఓట్లతోపాటు గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం ఈటలకు ఆశాజనకంగా కనిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికే అభ్యర్థిగా ఎంపికైన ఈటల మల్కాజిగిరిలో భారీ ఆధిక్యంతో గెలుస్తాననే ధీమాతో ముందుకెళ్తున్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

బలమైన నేత వేటలో బీఆర్ఎస్

బీఆర్ఎస్ అభ్యర్థిపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. ఇన్ని రోజులూ మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి పోటీలో ఉంటారనే టాక్ వినిపించింది. ఈ విషయాన్ని మల్లారెడ్డి సైతం మీడియా ముఖంగా చెప్పేశారు. వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్స్‌తోపాటు ఉచిత మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేస్తూ తానే అభ్యర్థిని అన్నట్టు భద్రారెడ్డి సైతం వ్యవహరించారు. కానీ ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు మల్లారెడ్డి సంకేతాలు ఇవ్వడంతో బీఆర్ఎస్ అధిష్టానం డైలమాలో పడింది. బలమైన నేత కోసం అన్వేషణ షురూ చేసింది. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పోటీ చేయించాలని భావించినా.. ఎమ్మెల్సీకి రాజీనామా చేస్తే కౌన్సిల్‌లో సంఖ్య తగ్గితే ఎలా అని లెక్కలేస్తున్నారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించిన భంగపట్ట ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవీ స్కూల్స్ అధినేత మల్క కొమరయ్యకు గాలం వేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే బీఆర్ఎస్‌నేతలు కొమరయ్యను సంప్రదిం చగా.. ఆయన ఇంకా నిర్ణయం ప్రకటించనట్టు సమాచారం.

ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి

కాంగ్రెస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ నెల 13, 14 తేదీల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని రెండు రోజుల క్రితం మేడ్చల్‌లో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించడానికి ప్రాధాన్యత సంతరించుకుంది. సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మైనంపల్లి మాత్రం పోటీ చేసేందుకు సుముఖంగా లేనట్టు సమాచారం. 'మల్కాజిగిరి' అమాత్యులెవరో తెలియాలంటే మరికొద్ది వేచి చూడాల్సిందే..!

ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి



- ఎస్‌బీఐ బీజేపీ జేబు సంస్థనా?
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబిత

నవతెలంగాణ-ఘట్కేసర్

ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణమే బహిర్గతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబిత అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కమిటీ పిలుపుతో భాగంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాల్సిందేనని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు అయ్యేదాకా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా కప్పి పెట్టడడం సరైంది కాదన్నారు. బీజేపీ వత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజల ఖజానాతో నిండి ఉన్న ఎస్‌బీఐ ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఈ బాండ్లకు సంబంధించిన వివరాలను మార్చి ఆరులోగా ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫమైందని పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బీఐకి ఇచ్చిన మూడు వారాల గడువు ముగిసిందని తెలిపారు. వివరాలను వెల్లడించడానికి మరో 116 రోజులు గడువు కావాలని కోర్టును ఆశ్రయిస్తున్నారంటే బీజేపీ నేతలను రక్షించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఉండేందుకు పన్నాగం పండినట్టుగా స్పష్టం అవుతుందని విమర్శించారు. తక్షణమే ఎలాక్టోరల్ బాండ్ల వివరాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. బీజేపీ దొంగ నాటకాలను ప్రజలు గమనించి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు చంద్రమోహన్, నాగమణి, సునీత, దేవి, అనసూర్య, శ్రీనివాస్, సోను, భిక్షపతి, స్వప్న, బింధూ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్త, పెన్సిలిన్ ఇంజక్షన్‌ను కనుగొన్న అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 69వ వర్ధంతిని సోమవారం కమలానగర్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు పద్మావతి, సామాజిక ఉద్యమ నాయకులు కేకే ప్రసాద్ బాబు, అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ బూజును పరిశోధించి, అది బ్యాక్టీరియాల వల్ల ఏర్పడిందని గుర్తించారు. మానవ శరీరంలో కొన్ని మానవుడికి ఉపయోగపడే బ్యాక్టీరియాలు ఉండగా మరి కొన్ని హానికరమైనవి ఉన్నాయని గుర్తించారని పేర్కొన్నారు. హానికరమైన బ్యాక్టీరియా నుంచి రక్షించడానికి అనేక పరిశోధనలు చేసి పెన్సిలిన్ ఇంజక్షన్‌ను తయారు చేశారని తెలిపారు. నేడు మానవ ఆరోగ్య విషయంలో సంజీవినిలా పని చేస్తుందన్నారు. నాడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేసిన కృషి ఫలితమే నేడు పెన్సిలిన్ ఇన్‌జక్షన్ అని తెలిపారు. పద్మావతి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని ఎందుకు, ఏమిటి, ఎలా అని ప్రశ్నించుకుంటే ప్రతి ఒక్కరూ భవిష్యత్‌లో ఎదుగుతారని, అందుకు అలెగ్జాండర్ ఫ్లెమింగ్ నిదర్శమని చెప్పారు. దేశంలో ఇటువంటి పరిశోధనల కన్నా దేవుడు, కర్మ సిద్ధాంతాల పేరుతో వెనుకబడి పోయిందన్నారు. మనుషులు అభివృద్ధి చెందాలంటే శాస్త్ర విజ్ఞానంతో ఆలోచించాలన్నారు. పెన్సిలిన్ నేడు మానవులకు కల్పవృక్షంగా మారిందన్నారు. అనంతరం సభికులందరూ అలగ్జాండర్ ఫ్లెమింగ్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ బాబు, కోమటి రవి, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్, శ్రీనివాసరావు, సంతోష్, పద్మావతి, లక్ష్మయ్య, గౌసియా, అంజలి, శోభ, శ్రీనివాస్, జయరాజ్ పాల్గొన్నారు.

మత రాజకీయం చేస్తున్న మోడీని గద్దె దింపాలి



- సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్

నవతెలంగాణ-కాప్రా

మత రాజకీయాలను పెంచి పోషిస్తున్న మోడీని గద్దె దింపాలని, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులందరికీ అందించాల్సిన బాధ్యత పాలకులదేనని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్ అన్నారు. సోమవారం సీపీఐ నాచారం శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోడీ మత రాజకీయాలను ప్రజలు గమనించాలని, మతం పేరిట ప్రజల మధ్య చీలికలు తెచ్చే నీచపు పోకడలను తిప్పికొట్టాలని సూచించారు. మోడీ అన్ని మతాలను, కులాలను సమానంగా గౌరవించాలే తప్పా..ఒకే మతానికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని కోరారు. సీపీఐ నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుందని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ సభ్యులు సాయిలు, శోభ, రజిని, యాకయ్య, విజయలక్ష్మి, రమాదేవి, యాదమ్మ, ఉప్పలమ్మ మౌనిక, రేణుక, విజయ, కిష్టమ్మ, యాకమ్మ, మమత, యాకలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.



మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ ఫేజ్-2లో మంచి నీటి కనెక్షన్ల ద్వారా కాలనీలో తాగునీరు అందించినందుకు ఆయా కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిని, జలమండలి మేనేజర్ సందీప్‌లను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ వ్యవస్థను బాగు చేయాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు.
-నవతెలంగాణ,కాప్రా

మెరుగైన వైద్యం కోసమే బస్తీ దవాఖాన

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ప్రజలకు మెరుగైన వైద్యం కోసమే ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్‌లు అన్నారు. చర్లపల్లి ఈసీ నగర్‌లోని బస్తీ దవాఖానాను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకే బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకుకోవాలని సూచించారు. వైద్యం కోసం పేదలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా బస్తీలలోనే దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో రఘునందన్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లో కోటి 14 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నాచారం విలేజ్‌లో ఇది వరకే నిర్మించిన జీప్లస్ వన్ వార్డు కార్యాలయంపై రెండు అదనపు ఫ్లోర్లు నిర్మాణానికి రూ.54లక్షలు కేటాయించారు. నాచారం ఓల్డ్ విలేజ్ లో మిగిలిన భూగర్భ డ్రయినేజీ పనులకు రూ.50లక్షలు, రాఘవేంద్ర నగర్‌లోని ఓపెన్ డ్రైన్ స్థానంలో భూగర్భ డ్రయినేజీ నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం సంతోష్, డీజీఎం సతీష్, కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ లింగారావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన బండారి



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ.. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని 134 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద కోటి 34 లక్షల 15,544 రూపాయలను చెక్కుల రూపంలో అందజేశామన్నారు. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వాణిరెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జేన్‌శేఖర్, హబ్సిగూడ కార్పొరేటర్ చేతనహరీష్, రామాంతపూర్ కార్పొరేటర్ శ్రీవాణీ, నాయకులు బన్నాల ప్రవీణ్, ఎదుల కొండల్‌రెడ్డి, శ్యామ్,బాలు మచ్చేందర్, రవి, తదితరులున్నారు.

ఎలక్టోరల్ బాండ్‌ల వివరాలు ఎస్‌బీఐ సుప్రీం కోర్టుకు అందించాలి

నవతెలంగాణ-మేడ్చల్

ఎస్‌బీఐ బ్యాంక్ ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు మార్చి 12వ తేదీ వరకు సుప్రీంకోర్టుకు అందజేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మండల నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మేడ్చల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ప్లకాడులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకుడు నర్సింగ్‌రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎస్‌బీఐ బ్యాంక్ చైర్మెన్‌ను అరెస్టు చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్లను గోప్యంగా ఉంచడం ఆర్టికల్ 19(ఏ)కు (సమాచార హక్కు చట్టం) వ్యతిరేకమని గుర్తు చేశారు. బీజేపీ పార్టీ ఒత్తిడితో ఎలక్టోరల్ బాండ్లు వివరాలను ఇవ్వకపోవడం, ఎన్నికలు పూర్తయ్యేదాకా గడువును పొడిగించడం ద్వారా మోడీ అవినీతి బాగోతం బయటపడుతుందని విమర్శించారు.



ఎస్‌బీఐ బ్యాంక్ పబ్లిక్ సెక్టార్ అని, బీజేపీ సంస్థ కాదని మండిపడ్డారు. ఎన్నికల బాండ్లు ఇవ్వకపోతే బ్యాంకుల ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాటు

- ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్



నవతెలంగాణ-ఘట్కేసర్

నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఘట్కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ బస్‌స్టాప్ వద్ద రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, సీఐ సైదులు, క్రైమ్ సీఐ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మున్సిపాలిటీ నిధుల నుంచి దాదాపు 80 సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు సీసీ కెమెరాల ద్వారా గుర్తించడానికి వీలుందని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాము, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, ఆంజనేయులు గౌడ్, నశ్రీన్ సుల్తాన, నాగజ్యోతి, జహంగీర్, నర్సింగ్‌రావు, రవీందర్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరిశంకర్, మాజీ వార్డు సభ్యురాలు పద్మ, సిరాజ్, వీరేశ్, మురళీగౌడ్, విజయ్, మీనా, శ్రావణిరెడ్డి, ఈడబ్ల్యూఎస్ కాలనీవాసులున్నారు.

ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

- పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి
- విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు : ఆలయ చైర్మెన్ నాగలింగం శర్మ



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ముగిసింది. సోమవారం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకం చేశారు. అనంతరం టీడీపీ వేదసంస్కృత విద్యార్థులు క్షేత్రదిగ్బలి నిర్వహించారు. వేదమంత్రోచ్చరలతో జరిగిన పూర్ణాహుతిలో ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ దంపతులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. పూర్ణాహుతితో దేవతలను సాగనంపుతామని వేదపండితుడు మార్తి సత్యనారాయణ శర్మ తెలిపారు. కీసరగుట్ట జాతరకు సహకరించిని ప్రతి ఒక్కరికి ఆలయ చైర్మెన్ తటాకం నాగలింగం శర్మ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆలయ ఈవో నరేందర్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ,తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కౌన్సిలర్



నవతెలంగాణ-కీసర

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కౌన్సిలర్ అన్నం రాజు సుమిత్రాసురేశ్ అన్నారు. నాగారం మున్సిపాలిటీ 20వ వార్డు గోపికృష్ణ కాలనీ మహిళలు సోమవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ సుమిత్రా సురేష్ హాజరెయ్యారు. ఈ సందర్భంగా మహిళలు ఆటా పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గోపికృష్ణ కాలనీ ఉపాధ్యక్షురాలు సరళరవికాంత్ రెడ్డి, గాంధీ నగర్ అధ్యక్షురాలు శ్రీ లక్ష్మి, సురేఖ, ఉమాదేవి, అనురాధ గుప్తా, శిరీష, సుచరిత, గోదాదేవి ,మంజుల యాదవ్, విజయ యాదవ్, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు చూపించి బైక్‌లను తీసుకెళ్లండి

మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

వివిధ కారణాలతో పోలీసులకు పట్టుబడ్డ బైకులకు సరైన పత్రాలు తీసుకొచ్చి వాహనాలను తీసుకెళ్లాలని మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మల్కాజగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని, ఎలాంటి ఆధారాలు లేని (31) ద్విచక్ర వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వాహనాల యజమానులు సంబంధిత పత్రాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇతర వివరాలకు 8712662463 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

డిస్పెన్సరీ ఓపెన్ చేయాలని సీఐటీయూ కార్మికుల నిరసన



నవతెలంగాణ-శామీర్‌పేట

ఉమ్మడి శామీర్‌పేట మండల సీఐటీయూ అధ్యక్షుడు కిష్టప్ప ఆధ్వర్యంలో సోమవారం శామీర్‌పేటలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ సెంటర్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ.. శామీర్‌పేట మండల కేంద్రంలోని డిస్పెన్సరీ సెంటర్ అద్దె ఇంట్లో ఉన్నదని, రెండేండ్లుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని డిస్పెన్సరీ సెంటర్‌కు తాళం వేశాడని తెలిపారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. ఈ సమస్యను కలెక్టర్, సీఎం దృష్టికి తీసుకెళ్లి కార్మికులను ఆదుకోవాలన్నారు.

పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-కీసర

పాత కక్షలతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ లో చోటు చేసుకుంది. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గోధుమ కుంట గ్రామంలోని ఓ కోళ్ల ఫామ్‌లో పనిచేసే ఒడిస్సా రాష్ట్రం, కందమని జిల్లాకు చెందిన బబ్లు (26)ను ఒడిస్సాకు చెందిన కభీచంద్ర ప్రధాన్ కత్తితో కడుపులో పొడిచాడు. వెంటనే ఘట్కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్తితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పురుషాధిక్యతకు మారు పేరుగా కొన్ని రంగాలు ముద్ర వేసుకున్నాయి. అలాంటి చోట కూడా మూస పద్ధతులను బద్దలు కొట్టి లింగ సమానత్వానికి మార్గం సుగమం చేసిన అసాధారణ మహిళలు మన చుట్టూ కొందరు ఉన్నారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో మొదటి మహిళా స్నిపర్‌గా అవతరించడం నుండి క్రీడలు, ప్రజా సేవలో చారిత్రాత్మక మైలురాళ్లను సాధించారు వారు. తమ ఎదుగుదల కోసం అసమానమైన అంకితభావాన్ని, పట్టుదలను ప్రదర్శించారు. తమ తర్వాతి తరాల వారికి స్ఫూర్తిగా నిలిచారు. అలాంటి మహిళల్లో కొందరి పరిచయం నేటి మానవిలో...

\- సలీమ

మూస పద్ధతులను బద్దలు కొడుతూ...

సరిహద్దు భద్రతా దళంలో...



సుమన్ కుమారి... బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో సబ్-ఇన్‌స్పెక్టర్ అయిన ఆమె దళంలో మొదటి మహిళా స్నిపర్‌గా చరిత్రలో తన పేరు లిఖించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని, మండి జిల్లాకు చెందిన సుమన్ అతి సాధారణ కుటుంబం నుండి వచ్చింది. ఈ రంగంలో ప్రయాణమంటే దృఢ సంకల్పానికి ప్రతీక. పంజాబ్‌లో ఒక ప్లాటూన్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు స్నిపర్‌పై జరిగిన దాడులను ఆమె ప్రత్యక్షంగా ఎదుర్కొంది. ఆ సంఘటన నుండి ప్రేరణ పొంది ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (CSWT)లో ఎనిమిది వారాల కఠినమైన స్నిపర్ కోర్సును ప్రారంభించింది. 56 మంది పురుషులలో ఏకైక మహిళ ఆమె. అచంచలమైన సంకల్పంతో ప్రశంసలు అందుకుంది. ఆమె సాధించిన విజయాలు తన వ్యక్తిగత నైపుణ్యాన్నే కాకుండా ఆ

పారిస్ ఒలింపిక్స్‌లో...

రైజా ధిల్లాన్... హర్యానాకు చెందిన 19 ఏండ్ల షూటింగ్ ప్రాడిజీ, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో దేశం కోసం పోటీ పడిన మొట్టమొదటి మహిళల స్కీట్ కోటాను సాధించి చరిత్ర సృష్టించింది. తుపాకీలపై గాఢమైన మక్కువ ఉన్న కుటుంబంలో పుట్టినందున రైజా షూటింగ్‌లో తన ప్రయాణం ప్రారంభించింది. 12 ఏండ్ల వయసులో స్కీట్ షూటింగ్‌కి మారడానికి ముందు 10మీ ఎయిర్ రైఫిల్ కేటగిరీతో ప్రారంభించింది. కుటుంబం నుండి కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ సంకల్పం, నిర్భయత ఆమెను ఈ క్రీడలో రాణించేలా చేసింది. కోచ్ అమ్రీందర్ సింగ్ చీమా మార్గదర్శకత్వంలో రైజా తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. నేషనల్స్‌లో సీనియర్ స్కీట్ ఈవెంట్‌లో కాంస్యం, ISSF జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో రజతంతో పాటు మరెన్నో గొప్ప విజయాలు సాధించింది. ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫికేషన్‌తో ఆమెకు మరింత గుర్తింపు వచ్చింది. అక్కడ రజతం సాధించింది, పారిస్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి 18వ టిక్కెట్‌ను సంపాదించింది. ఇప్పుడు ఆమె కుటుంబానికే కాదు మొత్తం దేశానికే గర్వకారణం.



ఈక్వెస్ట్రియన్‌లో అర్జున అవార్డు...

దివ్యకృతి సింగ్... రాజస్థాన్‌కు చెందిన ఈమె ఈక్వెస్ట్రియన్‌లో ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డును అందుకున్న మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. తన తల్లిదండ్రుల పూర్తి మద్దతుతో ఆమె ఈ క్రీడలో తన సహజ ప్రతిభను కనబరిచింది. ఆడపిల్ల కనుక సామాజిక అడ్డంకులు ఉన్నప్పటికీ ఈక్వెస్ట్రియన్ క్రీడలను అంకితభావంతో కొనసాగించింది. లింగ మూస పద్ధతులను సవాలు చేసింది. ఆసియా క్రీడల్లో టీమ్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. అంతర్జాతీయ పోటీలలో రజత, కాంస్య పతకాలు సాధించింది. క్రీడ పట్ల ఉన్న అభిరుచి, పట్టుదల ఆమెకు ఆసియాలో అగ్రశ్రేణి ర్యాంకింగ్‌తో పాటు గ్లోబల్ డ్రెస్సేజ్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ స్థానాన్ని సంపాదించిపెట్టాయి. అర్జున అవార్డు అందుకున్న తర్వాత ఆమె తన గుర్రాలకు, కోచ్‌లకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ గౌరవాన్ని అందుకున్న తొలి మహిళగా గర్విస్తున్నప్పటికీ ఈక్వెస్ట్రియన్ క్రీడల్లో మరింత మంది మహిళలు రాణించాలని ఆమె కోరుకుంది.



ఆ రాష్ట్రంలో మొదటి మహిళా ఐపీఎస్



టెన్సింగ్ యాంగ్కీ.... అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారి. 2022 యూపీఎస్‌సీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 545 సాధించి ఈ చారిత్రాత్మక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశానికి సేవ చేయడానికి అంకితమైన కుటుంబంలో పుట్టిన ఈమె ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (IRS), ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (IAS)లో తన తండ్రి నుండి ప్రేరణ పొందింది. ఒక ఐపీఎస్ అధికారిగా విశేషాధికారాలు ఉన్నప్పటికీ కష్టపడి పనిచేయడం ఆమె నైజం. తన రాష్ట్ర మహిళలు సివిల్ సర్వీస్‌లో వృత్తిని కొనసాగించడానికి అవసరమైన ప్రేరణను అందిస్తుంది. 2017లో అరుణాచల్ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతో ఆమె విజయ ప్రస్థానం ప్రారంభమయింది.

తొలి మహిళా క్రికెట్ పిచ్ క్యూరేటర్



జసింత కళ్యాణ్... అడ్మినిస్ట్రేటివ్‌గా ఉన్న ఈమె భారతదేశపు మొట్టమొదటి మహిళా క్రికెట్ పిచ్ క్యూరేటర్‌గా చరిత్ర సృష్టించింది. అప్పట్లో తన రంగంలో ఏకైక మహిళగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ జసింత అధైర్యపడకుండా, అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు ఎంతో శ్రమించింది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ బెంగుళూరు లెగ్‌లో పిచ్‌లను సిద్ధం చేసే బాధ్యతకు ఎంపిక చేయబడింది. ఆమె నిరంతర అభ్యాసానికి, క్రీడ పట్ల నిబద్ధతకు ఇది ఒక చక్కటి ఉదాహరణ. 2018లో BCCI క్యూరేటర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఆమె తన తనలోని నైపుణ్యాన్ని అభిరుచిని గుర్తించింది. భారతదేశంలో మహిళా క్రికెటర్ల సంఖ్య పెరిగేందుకు ఓ మార్గం వేసింది. BCCI సెక్రటరీ జే షా నుండి ప్రశంసలు అందుకోవడమే ఆమె కృషికి చక్కని ఉదాహరణ.

దక్షిణ రైల్వేలో మొదటి ట్రాన్స్ ఉమెన్



సింధు గణపతి... తమిళనాడులోని నాగర్‌కోయిల్‌లో పుట్టి పెరిగిన సింధు రైల్వే సంఘంలో తన లింగ గుర్తింపు విషయంలో సామాజిక సవాళ్లను ఎదుర్కొంది. సమాజం నుండి ఎదురైన ఒత్తిళ్లను తట్టుకోలేక 2010లో ఉద్యోగాన్ని వదిలిపెట్టింది. తర్వాత దక్షిణ రైల్వే మజ్దూర్ యూనియన్ మద్దతుతో ఆత్మవిశ్వాసంతో తిరిగి వచ్చింది. ప్రారంభంలో అనేక అనుమానాలతో అడుగు పెట్టినప్పటికీ ఇప్పుడు ఆమె టీటీఈగా బాధ్యతలు చూస్తోంది. సింధు కథ ఇప్పుడు ఆమె సమాజానికి ఆశాకిరణంగా అవతరించింది. సమాజంలో ట్రాన్స్ జెండర్స్ అంగీకారం, గుర్తింపు కోసం తపిస్తున్నారు. అలాంటి ఆమె ఇలాంటి రంగాల్లో రాణించడం అంటే అత్యంత సాహసంతో కూడుకున్న విషయం.

ఆర్మీ మెడికల్ కార్ప్స్‌లో...



కవితా సహాయ్.. పూణేలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీకి చెందిన పూర్వ విద్యార్థి. లక్నోలోని ఆర్మీ మెడికల్ కార్ప్స్ సెంటర్ అండ్ కాలేజీకి కమాండెంట్‌గా నియమితురాలైన మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది. 37 ఏండ్ల తన కెరీర్‌లో లెఫ్టినెంట్ ఆమె దేశానికి అంకితభావంతో సేవలు అందించి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. విద్యాపరంగా కూడా ఆమె ఎన్నో విజయాలు సాధించింది. డాక్టర్ ఆఫ్ మెడిసిన్ ఇన్ పాథాలజీతో పాటు AFMC, పూణే నుండి నేషనల్ బోర్డ్ ఆఫ్ పాథాలజీ డిప్లొమేట్, AIIMS ఢిల్లీ, FAIMER-కీలే యూనివర్సిటీ, యూకే నుండి మరో కోర్సు చేసింది. తన కెరీర్ మొత్తంలో ప్రతిష్టాత్మక వైద్య సంస్థలలో హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌తో పాటు అనేక కీలక పదవులు నిర్వహించింది. రెండుసార్లు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ప్రశంసలతో గుర్తింపు పొందింది.

ఈ నొప్పులు వస్తుంటే..?



శరీరంలో థైరాయిడ్ పెరిగిందని తెలుసుకోవడం ఎలా? చాలా మందికి ఈ ప్రశ్న ఉంటుంది. సకాలంలో చికిత్స చేయకపోతే, ప్రమాదమే. థైరాయిడ్ అనేది మన మెడ ముందు ఉండే చిన్న, సీతాకోకచిలుక ఆకారపు గ్రంధి. ఇది శరీరంలో హార్మోన్లను ఉత్పత్తి చేయిస్తుంది. హార్మోన్లలో తేడా వస్తే థైరాయిడ్ సమస్యలు వస్తాయి. థైరాయిడ్‌లో రెండు రకాలున్నాయి. హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్. థైరాయిడ్ సమస్య వస్తే, శరీరంలోని కొన్ని భాగాలలో నొప్పి వస్తుంది. ఆ నొప్పులేంటో తెలుసుకుందాం...

మెడనొప్పి: హెల్త్‌లైన్ వార్తల ప్రకారం థైరాయిడ్ సమస్య పెరిగేకొద్దీ మొదటగా అనిపించే సమస్య మెడ నొప్పి. నిజానికి, థైరాయిడ్ గ్రంథి మెడ ముందు ఉంటుంది. అందువల్ల దానిలో ఏదైనా సమస్య ఉంటే అది మెడ ప్రాంతాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. దీని వల్ల మెడలో నొప్పి రావడమే కాకుండా గొంతు చుట్టూ వాపు కూడా ఎక్కువగా ఉంటుంది.

దవడ, చెవి నొప్పి: శరీరంలో థైరాయిడ్ హార్మోన్ అసమతుల్యత వల్ల ఏర్పడే నొప్పి క్రమంగా మెడ నుంచి దవడలు, చెవులకు చేరుతుంది. అలాంటి పరిస్థితిని ఎక్కువ కాలం నిర్లక్ష్యం చేయడం ప్రాణాంతకం.

కీళ్ల నొప్పులు: శరీరంలోని కీళ్లలో నొప్పి కూడా థైరాయిడ్‌కు కారణం కావచ్చు. నిజానికి సబాక్యూట్ థైరాయిడిటిస్ విషయంలో రోగుల నొప్పి క్రమంగా కీళ్లకు చేరుకుంటుంది. ప్రధానంగా ఇది మోకాళ్ల నొప్పులను బాగా పెంచుతుంది.

పాదాలలో నొప్పి: శరీరంలో థైరాయిడ్ హార్మోన్ స్థాయి పెరగడం వల్ల రోగులు.. పాదాలు, అరికాళ్ళలో కూడా నొప్పితో బాధపడతారు. ప్రధానంగా నడిచేటప్పుడు లేదా ఎక్కువసేపు నిలబడి ఉన్నప్పుడు, అరికాళ్ళలో చాలా నొప్పి, మంటగా అనిపిస్తుంది. కండరాలలో నొప్పి: థైరాయిడ్ రోగులలో వాపు సమస్య కనిపించడమే కాదు, కండరాలలో కూడా చాలా నొప్పి ఉంటుంది. తరచుగా రోగులు కండరాల నొప్పితో బాధపడుతున్నారు. మీకు కూడా కండరాల నొప్పి ఉంటే ఒకసారి మీ ఆరోగ్య నిపుణుడిని సంప్రదించండి.

ఎలా రక్షించుకోవాలి : థైరాయిడ్ హార్మోన్ల అసమతుల్యత కారణంగా శరీరంలో నొప్పిని నివారించడానికి అయోడిన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోండి. క్రమం తప్పకుండా యోగా చేయండి. సోయాబీన్, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, బ్రోకలీ వంటి ఆహారాలను తినడం మానుకోండి. వీలైనంత వరకు నూనె, మసాలాలు తీసుకోవద్దు.

అమల్లోకి సీఏఏ

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఎన్ని నిరసనలు జరిగిన, ఎంత మంది, ఎన్ని పార్టీలు వ్యతిరేకించినా సీఏఏను సోమవారం నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర హోం వ్యవహారాల శాఖ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం సాయంత్రం జారీ చేసింది. 2019 డిసెంబర్‌లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య సీఏఏ-2019ను పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. అయితే, చట్టంలోని నిబంధనలపై సందిగ్ధత నెలకొనడంతో ఈ చట్టం అమలు కార్యరూపం దాల్చలేదు. అయితే లోక్‌సభ ఎన్నికల ముందే దీన్ని అమల్లోకి తీసుకుని వస్తామని అమిత్ షాతో సహా అనేక మంది బీజేపీ నాయకులు ప్రకటిస్తూ వచ్చారు. ఈ చట్టం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం భారత పౌరసత్వాన్ని ఇస్తారు. 2014 డిసెంబరు 31 కంటే ముందు పై మూడు దేశాల నుంచి భారత్‌కు వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు మన దేశ పౌరసత్వం లభిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని కేంద్రం తెలిపింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది.కేరళ సహా 5 రాష్ట్రాలు ఈ చట్టాన్ని వ్యతిరేకించాయి. ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానాలను కూడా ఆమోదించారు. ఢిల్లీతో సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సిఎఎకు వ్యతిరేకంగా నిరసనలు కూడా జరిగాయి. అయినా కేంద్రం లెక్క చేయడం లేదు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికలముందు నోటిఫికేషన్ విడుదల చేయటంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

పలుచోట్ల భద్రత కట్టుదిట్టం

సీఏఏను అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లోని పలు చోట్ల భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈశాన్య ఢిల్లీలోని షాహీన్‌బాగ్, జామియా, ఇతర సున్నిత ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. పోలీసులతో పాటు పారా మిలటరీ బలగాలను కొన్ని చోట్ల మోహరించారు. సున్నితమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది, పారామిలటరీ బలగాల ద్వారా పెట్రోలింగ్, చెకింగ్ నిర్వహిస్తున్నారు.

'ఎలనాగ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

24 మంది అనువాదకులకు సోమవారం సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించింది. ఇందులో ఇంగ్లీష్‌లో పవన్ కె వర్మ రచించిన 'గాలిబ్: ది మ్యాన్' పుస్తకాన్ని 'ఎలనాగ' తెలుగులోకి 'గాలిబ్ నాటి కాలం' పేరుతో అనువాదం చేశారు. అనువాద విభాగంలో ఈ పుస్తకం అవార్డుకు ఎంపికైంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న అవార్డుల ప్రదానోత్సవంలో పురస్కార గ్రహీతలకు రూ. 50 వేల నగదు, తామపత్రం అందించనున్నట్టు సాహిత్య అకాడమీ వెల్లడించింది. కాగా, వృత్తిపరంగా చిన్నపిల్లల వైద్యుడైన ఎస్ సురేంద్ర... ఎలనాగ పేరుతో సుప్రసిద్ధులయ్యారు. కరీంనగర్ లోని ఎలగందల గ్రామంలో జన్మించిన ఆయన పాఠశాల స్థాయిలోనే రచనలు ప్రారంభించారు. విద్యార్థిగా తాను రాసిన కవిత మొదటి సారిగా కరీంనగర్ నుంచి ప్రచురితమైన 'గౌతమి' అనే పత్రికలో ప్రచురితమైంది. ఎలనాగ తెలుగుతో పాటు ఆంగ్లంలోనూ రచనలు చేశారు. ఆయన ఆంగ్లంలో రాసిన కవిత సంపుటి 'డాజ్లర్స్' ను ఉకియోటో ప్రచురణ సంస్థ ముద్రించింది. ఆ సంపుటిని టర్కిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, రష్యన్, చైనీస్, జపనీస్ భాషల్లోకి అనువాదం అయ్యాయి. అలాగే ఇప్పటి వరకు దాదాపు 40 గ్రంథాలను ఎలనాగ ప్రచురించారు. కలుపు మొక్క, వాగంకురాలు, పెన్మంటలు-కోకిలమ్మ పదాలు, కొత్తబాని వంటివరి సాహిత్య లోకాన్ని అలరించాయి.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

వైస్ చైర్మెన్ నవీన్ కుమార్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రాజేందర్ గౌడ్‌తో కలిసి నామినేషన్ వేశారు.

ఎస్‌బీఐకి సుప్రీం షాక్

(మొదటిపేజీ తరువాయి)

లోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించేందుకు మరింత గడువు ఇవ్వాలంటూ ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించింది. న్యాయస్థానం ఆదేశాలను పాటించని ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), సీపీఐ (ఎం) సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

'గత నెల 15వ తేదీన మేము తీర్పు ఇచ్చాము. విరాళాల వివరాలు అందజేయాలని మిమ్మల్ని ఆదేశించాం. ఇవాళ మార్చి 11వ తేదీ. మీరు మరింత సమయం కోరుతూ న్యాయస్థానానికి రావడం చాలా తీవ్రమైన విషయం. ఎందుకంటే మేము ఇచ్చిన తీర్పు స్పష్టంగానే ఉంది. గత 26 రోజులుగా మీరు చేపట్టిన చర్యల వివరాలు మీ దరఖాస్తులో లేవు' అని ధర్మాసనం ఎత్తిచూపింది. ఎస్‌బీఐ తన వద్ద ఉన్న సీల్డ్ కవరును తెరిచి, అందులోని వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాల్సిందేనని తేల్చి చెప్పింది. కోర్టు ఉత్తర్వులను పాటించకపోతే ధిక్కరణ చర్యలు చేపడతామని కూడా హెచ్చరించింది. ఎస్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపించారు. విరాళాలు ఎవరు ఇచ్చారు, ఏ పార్టీకి ఇచ్చారు అనే సమాచారాన్ని సరిపోల్చాలంటే సమయం పడుతుందని, ఎందుకంటే ఆ సమాచారాన్ని వేర్వేరుగా భద్రపరచడం జరిగిందని ఆయన కోర్టుకు తెలియజేశారు. 'తప్పులు చేసి గందరగోళం సృష్టించాలని మేము అనుకోవడం లేదు. మాకు కొంత సమయం ఇవ్వండి. మేము ఆ పనిని పూర్తి చేస్తాం' అని అభ్యర్థించారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా జోక్యం చేసుకుంటూ పొరబాటు జరిగే అవకాశమే లేదని అన్నారు. 'మీ వద్ద కేవైసీ ఉంది. మీది దేశంలోనే నెంబర్ వన్ బ్యాంక్. మీ పనిని సకాలంలో పూర్తి చేస్తారన్న విశ్వాసం మాకు ఉంది' అని చెప్పారు. సమాచారాన్ని సరిపోల్చాలని న్యాయస్థానం తన తీర్పులో చెప్పలేదని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గుర్తు చేశారు. ఎస్‌బీఐ వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని వెల్లడించాలని మాత్రమే తాను కోరామని తెలిపారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సవరించాలంటూ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఫిడవిట్ దాఖలు చేయడం పట్ల ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కోరిన సమాచారం ఇప్పటికే బ్యాంక్ వద్ద ఉన్నదని ధర్మాసనం తెలిపింది. ఇప్పటికిప్పుడు ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే తాజా ఆదేశాలను పాటించని పక్షంలో ఉద్దేశపూర్వకంగా అవిధేయత ప్రదర్శించినందుకు ధిక్కరణ చర్యలు చేపడతామని హెచ్చరించింది.

ఫ్యూచర్..కన్ఫ్యూజన్..!

(మొదటిపేజీ తరువాయి)

కాళ్ల బేరానికి వచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం వీరిద్దరి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

అప్పుడు తొడగొట్టి.. ఇప్పుడు కాళ్ల బేరం..

దుండిగల్ చిన్నదామర చెరువులోని ఆయన అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను రెవెన్యూ సిబ్బంది పాక్షికంగా కూల్చేశారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు హైదరాబాద్ చుట్టుపక్కల ఇంకా చాలా కాలేజీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా ఉండటంతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఈ చిన్న 'జలక్'తో మల్లారెడ్డి సైలెంట్ అయ్యారు. ఈ దెబ్బతో ఇన్ని రోజులూ 'మల్కాజిగిరి ఎంపీ సీటు మాదే, మమ్మల్ని ఓడించే మొగాడు పుట్టలేదు' అని పలికిన నోటితోనే, ఈసారి పోటీ చేయడం లేదని చెప్పుకోవడంతోపాటు కాంగ్రెస్‌తో కాళ్ల బేరానికి వచ్చారు.

రాజీనామా చేస్తారా..?
100 ఎకరాలు తిరిగిస్తారా..?

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం ప్రస్తుతం నడుస్తున్న రాజకీయ ట్రెండ్. ఈ ట్రెండ్‌ను ఫాలో కావడంలో మాజీ మంత్రి మల్లారెడ్డి ముందు వరుసలో ఉంటారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో మల్లారెడ్డి కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లో చేరాలని చూశారు. కానీ రెండు పార్టీలూ షాక్ ఇచ్చాయి. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీలో చేరాలని బీజేపీ సూచించగా.. కబ్జా చేసిన 100 ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తేనే పార్టీలోకి ఆహ్వానిస్తామని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ నేతలు ఆఫర్ ఇచ్చారు. దాంతో మల్లారెడ్డి పరిస్థితి 'రెంటికీ చెడ్డ రేవడి'లా తయారైంది. ఎమ్మెల్యే పదవికి రాజీమానా చేయలేక.. కబ్జా చేసిన భూమిని తిరిగి ఇవ్వలేక మామ, అల్లుడు అంతర్మథనంలో పడ్డారు.

రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం

మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇవే చివరి ఎన్నికలు అని ప్రకటించిన మల్లారెడ్డిని పక్కనబెడితే.. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజశేఖర్‌రెడ్డికి ప్రస్తుత పరిస్థితులు రాజకీయంగా ఎదగలేకుండా చేసేలా ఉన్నాయి. బీజేపీ మాటలు నమ్మి రాజీనామా చేసి మళ్లీ బరిలోకి దిగితే గెలుపు అంత ఈజీ కాదు. ఇక కాంగ్రెస్ ఆఫర్‌కు అట్రాక్ట్ అయి కబ్జా భూములను తిరిగిస్తే రూ.వేల కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ రెండూ కాకుండా బీఆర్ఎస్‌లోనే కొనసాగుదామంటే రాజకీయంగా ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయంటూ ఇద్దరు ఎమ్మెల్యేలూ పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. వీరిద్దరూ ఏ పార్టీలో కొనసాగుతారు..? అసలు రాజకీయాల్లో ఉంటారా..? లేక రాజకీయాల నుంచి తప్పుకుంటారా..? తెలియాలంటే పార్లమెంట్ ఎన్నికల తర్వాత వరకు ఆగాల్సిందే..!

ఢిల్లీకి ఆదిలాబాద్ పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

గోండు, బంజారాలు, ఆదివాసీలు మొత్తంగా 3.5 లక్షల ఓటర్లే ఉంటారని వివరించారు. ఎమ్మెల్యేల మద్దతు తనకే ఉన్న నేపథ్యంలో సీటు ఇవ్వాలని అల్టిమేటం జారీ చేశారు. రమేశ్‌రాథోడ్‌కు బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్ ఆశీస్సులున్నాయనే ప్రచారముంది. నగేశ్‌కు బీజేపీ ఎల్పీ ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మద్దతుంది. నగేశ్‌తో పాయల్ శంకర్‌కు వ్యాపార లావాదేవీలున్నాయి కాబట్టే ఆయన అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇలా ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ అనుకూలురులకు టికెటు ఇప్పించుకునే క్రమంలో వారి మధ్య వైషమ్యాలు కూడా నెలకొన్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీని కాదనుకుని బీజేపీలో ఎమ్మెల్యేలు లేని కాలంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాననీ, ఎవరెన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా చివరకు తనకే అభ్యర్థిత్వం ఖరారవుతుందనే ధీమాతో ప్రస్తుత ఎంపీ సోయం బాపూరావు ఉన్నారు. అంతిమంగా ఒకరికి సీటిస్తే మరొకరు పార్టీ నుంచి జంపింగ్ అయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎవరికి సీటిచ్చినా కలిసికట్టుగా గెలిపించుకుంటామని ఎమ్మెల్యేలు డాంబికాలకు పోతున్నా..ఆధిపత్యపోరులో సిట్టింగ్ స్థానాన్ని బీజేపీ కోల్పోబోతున్నదనే ప్రచారం జోరుగా సాగుతున్నది.

నేటి నుంచి రంజాన్ ఉపవాసాలు

(మొదటిపేజీ తరువాయి)

పాటిస్తారనీ, పెద్ద ఎత్తున పేదలకు జకాత్, ఫిత్రా పేరుతో దానధర్మాలు చేస్తారని గుర్తు చేశారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసంలో క్రమం తప్పకుండా ఆచరించే ఉపవాసం, దైవ ప్రార్థనలు.. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని తెలిపారు. మానవ సేవ చేయాలనే సందేశాన్ని రంజాన్ పండుగ సమస్త మానవాళికి అందిస్తుందని గుర్తుచేశారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని హామీ ఇచ్చారు. వారి సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు.

ముస్లింలకు కేసీఆర్ శుభాకాంక్షలు

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిపే ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రజల నడుమ శాంతి, సామరస్య భావనలు వెల్లివిరుస్తాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడిచిన పదేండ్ల ప్రగతి పాలన ద్వారా సంక్షేమం సమాహారంగా రాష్ట్రాన్ని గంగా జమునా తెహజీబ్‌కు ప్రతీకగా, దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

కేరళలో అమలుచేయం..

- కేరళ సీఎం విజయన్



తిరువనంతపురం: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్ని నోటిఫై చేయడంపై రాజకీయ పార్టీల నేతలు స్పందిస్తున్నారు. కేంద్రం చర్యపై ప్రతిపక్ష నేతలు మండిపడుతుండగా.. అధికార పార్టీకి చెందినవారు ప్రశంసిస్తున్నారు. సీఏఏను దేశంలో మతపరమైన విభజన సృష్టించే చట్టమని కేరళ సీఎం పినరయి విజయన్ అభివర్ణించారు. దక్షిణాది రాష్ట్రం కేరళలో దీన్ని అమలుచేయబోమని స్పష్టం చేశారు. ముస్లిం మైనారిటీలను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించే ఈ పౌరసత్వ సవరణ చట్టాన్ని కేరళలో అమలు చేయమని ఇప్పటికే తమ ప్రభుత్వం పదేపదే చెప్పిందని గుర్తు చేశారు. ఆ మాటపై నిలబడి ఉంటామని స్పష్టంచేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ యావత్ కేరళ ఏకతాటిపై నిలబడాలని కోరారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం దేశానికి వ్యతిరేకమైనది..

ప్రజల దృష్టి మళ్లించటానికే..కేజ్రీవాల్

దీనిపై ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో స్పందిస్తారని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. వివాదాస్పదమైన ఎన్నికల బాండ్ల అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. సీఏఏ అమలు రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. అధికార బీజేపీ ప్రతి అంశాన్నీ హిందువులు, ముస్లింల మధ్య విభజనగా తీసుకొస్తుందని ఆరోపించారు.

సీఏఏ అమలు చరిత్రాత్మకం.. యోగి ఆదిత్యనాథ్

సీఏఏ అమలుపై కేంద్రం నిర్ణయాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ స్వాగతించారు. మానవతతో ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్ షా ఈ నిర్ణయం తీసుకున్నందుకు యోగి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో సీఏఏ అమలు చరిత్రాత్మకని పేర్కొంటూ ట్వీట్ చేశారు. మోడీ గ్యారంటీ అంటే అర్థం ప్రతి హామీనీ కచ్చితంగా సాకారం చేయడమేనని చౌహాన్ పేర్కొన్నారు.

ఆ ప్రశ్నకు బీజేపీ సమాధానం చెప్పాలి: అఖిలేశ్

జీవనోపాధి కోసం మన పౌరులే విదేశీబాట పడుతుంటే ఇతరుల కోసం పౌరసత్వ చట్టం తీసుకురావడం వల్ల ఏం వస్తుందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. బీజేపీ రాజకీయ నాటకాలు ఇప్పుడు ప్రజలకు అర్థమవుతున్నాయన్నారు. గత పదేండ్లలో దేశంలో లక్షలమంది భారత పౌరసత్వాన్ని ఎందుకు వదులుకున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల అంశంపై రేపేం జరుగుతుందో గానీ.. 'కేర్ ఫండ్' ఖాతా వివరాలు కూడా చెప్పాల్సి ఉంటుంది అని అఖిలేశ్ పేర్కొన్నారు.

న్యాయపోరాటం చేస్తాం.. ఏఏఎస్‌యూ

కేంద్రం నిర్ణయంపై అసోంలోని పలు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కేంద్రం తీసుకున్న ఈ చర్యలపై న్యాయపోరాటం చేస్తామని ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఏఏఎస్‌యూ) పేర్కొంది. 1979లో అక్రమ వలసదారులను గుర్తించి వారిని బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఏఎస్‌యూ ఆరేండ్లపాటు ఆందోళన చేపట్టింది. మరోవైపు, సీఏఏ నోటిఫికేషన్ దురదృష్టకరమని కాంగ్రెస్ నేత, అసోం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత దేబబ్రత సైకియా అన్నారు. అక్రమంగా ఉన్న విదేశీయులంతా అసోంను విడిచి వెళ్లాల్సిందేనని 2016 నుంచి ప్రధాని మోడీ, బీజేపీ చెబుతూనే రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసేలా ఇప్పుడు సీఏఏ అమలుచేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇందుకు అసోం ప్రజలకు ప్రధాని మోడీ, బీజేపీ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల బాండ్ల అంశంపై దృష్టి మళ్లించేందుకే..

ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి, ఎన్నికల వేళ మతపరమైన సమీకరణాల్ని ప్రోత్సహించే వ్యూహంలో భాగంగానే బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సీఏఏ అమలుపై ఈ నిర్ణయం తీసుకుందని జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ విమర్శించారు. 'ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశాలతో బీజేపీ తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఏ దారీ కనబడలేదు. అందుకే ఆ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసం సీఏఏ నిబంధనలు విడుదల చేసింది' అన్నారు.

నవచిత్రం



సత్తా చాటిన ఓపెన్ హైమర్

ప్రపంచవ్యాప్తంగా అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక 96వ ఆస్కార్ అవార్డుల వేడుక సోమవారం అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుక ప్రారంభానికి ముందు అందాల తారలు రెడ్‌కార్పెట్‌పై సందడి చేశారు. ఇక సినీ విశ్లేషకులు, సినీ ప్రేమికులు ఊహించినట్టుగానే 'ఓపెన్ హైమర్' అత్యధిక అవార్డుల్ని కొల్లగొట్టింది. 11 నామినేషన్లతో బరిలోకి దిగిన ఈ సినిమా ఏకంగా 7 పురస్కారాలను దక్కించుకుని సత్తా చాటింది.

'ఓపెన్ హైమర్'.. 96వ ఆస్కార్ అవార్డుల్లో 7 అవార్డులతో విజయకేతనం ఎగురవేసింది. క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తొలి బయోపిక్ ఇది. దీన్ని ది ట్రయంఫ్ అండ్ ట్రాజెడీ ఆఫ్ జె రాబర్ట్ ఓపెన్ హైమర్ అనే పుస్తకం ఆధారంగా తెరకెక్కించారు. విజువల్ వండర్‌గా ప్రేక్షకుల ప్రశంసలు పొందిన ఈ చిత్రం సినీ విశ్లేషకుల జోస్యాన్ని ప్రతిబింబించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ సహాయనటుడు, ఉత్తమ సినిమాటోగ్రఫీ, ఉత్తమ ఎడిటింగ్, ఉత్తమ ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వంటి విభాగాల్లో ఆస్కార్‌ని కైవసం చేసుకుంది. అణుబాంబు సృష్టికర్త జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాకి ఇన్ని అవార్డులు రావడం ఈ ఏడాది చెప్పుకోదగ్గ ప్రత్యేక అంశం. దీని తర్వాత పూర్ థింక్స్ చిత్రం పలు విభాగాల్లో పురస్కారాలను దక్కించుకుని శభాష్ అనిపించుకుంది. జిమ్మి కిమ్మెల్ 4వ సారి ఈ ప్రతిష్టాత్మక అకాడమీ అవార్డుల వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఓ విశేషమైతే, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్ అవార్డ్ ఇచ్చేందుకు వేదికపైకి నటుడు జాన్ సినా న్యూడ్‌గా రావడం మరో విశేషం. ఇలాంటి సంఘటన ఇదే వేదికపై 1974లో జరిగింది.

మరో సారి నాటు నాటు సాంగ్..

గత ఏడాది నాటు నాటు పాటకు ఆస్కార్‌ని అందుకోవడంతోపాటు వేదికపై కూడా ప్రదర్శితమైన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని నాటు నాటు పాటను ఈ ఏడాది కూడా వేదికపై ప్రదర్శించడం మరో చెప్పుకోదగ్గ విశేషం. అయితే 'బార్బీ' చిత్రం కేవలం పాటకు అవార్డుని అందుకుని అందర్నీ నిశాపర్చింది.

96వ ఆస్కార్ అవార్డుల విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం : ఓపెన్‌హైమర్
ఉత్తమ దర్శకుడు : క్రిస్టోఫర్ నోలన్ (ఓపెన్ హైమర్)
ఉత్తమ నటుడు: కిలియన్ మర్ఫీ పెన్ హైమర్)
ఉత్తమ నటి : ఎమ్మాస్టోన్ (పూర్ థింగ్స్)
త్తమ సహాయ నటుడు : రాబర్ట్ డౌనీ జూనియర్ (ఓపెన్ హైమర్)
ఉత్తమ సహాయ నటి : డేవైన్ జో రాండాల్స్ (ది హెూల్డోవర్స్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ :
హయోటి వాన్ హయోటోమా (ఓపెన్ హైమర్)
ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ : 20 డేస్ ఇన్ మరియోపోల్
ఉత్తమ హెయిర్ స్టయిల్ అండ్ మేకప్ :
నడియా స్టేసీ, మార్క్ కౌలియర్ (పూర్ థింగ్స్)
బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే : కార్డ్ జెఫర్‌సన్ (అమెరికన్ ఫిక్షన్)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే :
జస్టిన్ ట్రైట్, అర్థర్ హరారీ (అనాటమీ ఆఫ్ ఎ ఫాల్)
బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ : ది బాయ్ అండ్ ది హిరాన్
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ : హెూలి వెడ్డింగ్‌టన& (పూర్ థింగ్స్)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ : జేమ్స్ ప్రైస్, షోనా హెత్ (పూర్ థింగ్స్)
బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ : ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్
బెస్ట్ ఎడిటింగ్ : జెన్నిఫర్ లేమ్ (ఓపెన్ హైమర్)
బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ : గాడ్జిల్లా మైనస్ వన్
ఉత్తమ డాక్యుమెంటరీ (షార్ట్ సబ్జెక్ట్) : ది లాస్ట్ రిపేర్ షాప్
బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ : వార్ ఈజ్ ఓవర్
బెస్ట్ ఒరిజినల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ : ఓపెన్ హైమర్
బెస్ట్ సౌండ్ : ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్
బెస్ట్ ఒరిజినల్ సాంగ్ : వాట్ వాస్ ఐ మేడ్ ఫర్ (బార్బీ)
బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ : ది వండర్‌ఫుల్ స్టోరీ ఆఫ్ హెన్రీ సుగర్

విదర్భ ఢమాల్



- తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగులకే ఆలౌట్
- రహానె, ముషీర్ ఖాన్ అజేయ అర్థ సెంచరీలు
- 260 పరుగుల ముందంజలో ముంబయి

ముంబయి : వాంఖడే వేదికగా రంజీ ట్రోఫీ ఫైనల్లో ముంబయి జోరందుకుంది. తొలి రోజు బ్యాట్‌తో తడబడినా.. బంతితో కండ్లుచెదిరే ప్రదర్శన చేసింది. బౌలర్లు సమిష్టిగా మెరవటంతో విదర్భను తొలి ఇన్నింగ్స్‌లో చిత్తు చేసింది. ధవళ్ కులకర్ణి (3/15), శామ్స్ ములాని (3/32), తనుశ్ కొటియన్ (3/7) మూడేసి వికెట్ల ప్రదర్శనతో విజృంభించగా విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగులకే కుప్పకూలింది. 31/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన విదర్భ.. మరో 74 పరుగులే జోడించింది. 45.3 ఓవర్లలోనే చేతులెత్తేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగుల భారీ ఆధిక్యం కోల్పోయింది. ఓపెనర్ అతర్వ (23), ఆదిత్య ఠాకరే (19), యశ్ రాథోడ్ (27), యశ్ ఠాకూర్ (16) మినహా విదర్భ తరఫున అందరూ సింగిల్ డిజిట్ స్కోరుకే నిష్క్రమించారు. ధ్రువ్ శోరె (0), అమన్ (8), కరుణ్ నాయర్ (0), అక్షయ్ వాడ్కర్ (5), హర్ష్ దూబె (1) దారుణంగా విఫలమయ్యారు. ఇక ముంబయి రెండో ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు దిశగా సాగుతోంది. ఓపెనర్లు పృథ్వీ షా (11), భూపెన్ లాల్వాని (18) విఫలమయ్యారు. 34/2తో ముంబయి ఓపెనర్లను కోల్పోయగా మరో బ్యాటింగ్ పతనం తప్పదేమో అనిపించింది. ఈ సమయంలో కెప్టెన్ అజింక్య రహానె (58 బ్యాటింగ్, 109 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), ముషీర్ ఖాన్ (51 బ్యాటింగ్, 135 బంతుల్లో 3 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీలతో కదం తొక్కారు. మూడో వికెట్‌కు అజేయంగా 38.4 ఓవర్లలో 107 పరుగులు జోడించిన రహానె, ముషీర్ ఖాన్ ముంబయిని ముందంజలో నిలిపారు. రెండో రోజు ఆట ముగిసేసరికి ముంబయి 260 పరుగుల ఆధిక్యంలో కొనసాగు తుంది. నేడు కనీసం మరో వంద పరుగుల ఆధిక్యమైనా ముంబయి సొంతం చేసుకోవటం ఖాయమే. రంజీ ట్రోఫీ టైటిల్ పోరులో విదర్భ కనీసం పోటీలో నిలిచేందుకు రెండోసారి బ్యాట్‌తో అసమాన ప్రదర్శన చేయటం అవసరం.

పీఈటీల సమస్యలను పరిష్కరించండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పెటా టీఎస్ వినతి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధితో పాటు విద్య ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ (పెటా టిఎస్) నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం సందర్భంగా పెటా టిఎస్ ప్రధాన కార్యదర్శి పొన్నగాని కష్ణమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో పీఈటీల సమస్యలపై సీఎంకు విన్నవించారు. 'గతంలో 1849 పీఈటీ పోస్టులను ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)గా అప్‌గ్రేడ్ చేసినా.. న్యాయస్థానం పరిధిలో ఉంది. ఈ అంశంలో ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం తీసుకురావాలి. అర్హతలు కలిగిన ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లను జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా జీవో నంబర్ 79 ప్రకారం పదోన్నతి కల్పించాలి. జూనియర్ కాలేజీలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను నేరుగా నియమించాలనే జీవో నంబర్ 10ని రద్దు చేయాలి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీఈటీ, పీడీలకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి 15 రోజులకు తగ్గకుండా నూతన క్రీడా పద్ధతులపై శిక్షణా తరగతులు నిర్వహించాలి. పెటా టిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు, స్కూల్ గేమ్స్ ఫెడరషన్ జిల్లా కార్యదర్శులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలి. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం పీఏటీ పరీక్ష నిర్వహించని కారణంగా పీఈటీలు 12 ఏండ్ల ఇంక్రిమెంట్ పొందలేకపోయారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తక్షణమే పీఏటీ పరీక్షను నిర్వహించాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలి. సుమారు 1258 పీఈటీ పోస్టులను మంజూరు చేసి ప్రస్తుత మెగా డీఎస్సీలోనే భర్తీ చేయాలని' సీఎం రేవంత్‌ను పెటా టిఎస్ నాయకులు కోరారు.

వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కారానికి హామీ ఇచ్చినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ. సోమశేఖర్, యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎస్. వెంకటరెడ్డి, బాలాజి తదితరులు ఉన్నారు.

పోలో విజేత యుఎస్‌ఏ టీమ్

ఉత్తమ ఆటగాడిగా విశాల్ కుమార్




హైదరాబాద్ : ఇంటర్నేషనల్ ఎరినా పోలో చాంపియన్‌షిప్స్ 2024 విజేతగా యుఎస్‌ఏ టీమ్ నిలిచింది. అజీజ్‌నగర్‌లోని హెచ్‌పీఆర్‌సిలో జరిగిన ఫైనల్లో ఇండియా టీమ్2పై యుఎస్‌ఏ 15-8తో విజయం సాధించింది. వరుసగా మూడు చుక్కర్స్‌లో 3-2, 9-4, 3-2తో యుఎస్‌ఏ టీమ్ పైచేయి సాధించింది. యుఎస్‌ఏ తరఫున స్లోన్ స్టెఫాంకిస్ ఏడు గోల్స్ చేయగా, ఇండియా టీమ్2 నుంచి కౌశిక్ కుమార్ ఐదు గోల్స్ సాధించాడు. విశాల్ కుమార్ సింగ్ టోర్నీ ఉత్తమ ఆటగాడిగా నిలిచాడు.

రోగుల ప్రాణాలు గాలిలో....

- పీఎంజేఏవై కింద ఆస్పత్రులకు అందని నిధులు
- కేటాయింపుల్లోనూ కోత పెడుతున్న ప్రభుత్వం
- అప్పుల ఊబిలో ఆస్పత్రులు
- వైద్య సేవల నిలిపివేత

'ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' (పీఎంజేఏవై) పథకం కింద వైద్య సేవలు పొందుతున్న రోగుల సంఖ్యను పలు రాష్ట్రాలలోని ఆస్పత్రులు తగ్గిస్తున్నాయి. సకాలంలో కేంద్రం నుండి రీయంబర్స్‌మెంట్ రాకపోవడమే దీనికి ప్రధాన కారణం. కేంద్రం నుండి నిధుల విడుదలలో తీవ్రమైన జాప్యం ఏర్పడుతుండడంతో ఆస్పత్రులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఈ పథకం కింద రోగులను ఇకపై చేర్చుకునే ప్రశ్నే లేదని తేల్చి చెబుతున్నాయి.





న్యూఢిల్లీ : 'ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' (పీఎంజేఏవై) పథకం కింద వైద్య సేవలు అందక రోగులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు అహ్మదాబాద్‌లోని బాడీలైన్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి గత ఆరు సంవత్సరాలుగా ప్రతి నెలా 600 మంది రోగులకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తోంది.


డయాలసిస్ కోసం ఆస్పత్రికి వచ్చిన ప్రతిసారీ రోగికి రూ.300 చొప్పున రవాణా ఖర్చులు చెల్లిస్తోంది. దీనికి ప్రతిఫలంగా ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద కేంద్రం ఈ ఆస్పత్రికి ప్రతి డయాలసిస్ సెషన్‌కూ రూ.2,200 అందిస్తోంది. ఈ నగదు రహిత బీమా పథకం కింద పేదలకు వైద్య చికిత్స నిమిత్తం ఐదు లక్షల రూపాయల వరకూ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇదంతా ఒకప్పటి మాట.

పథకం నిర్వహణ సరిగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని పలు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి.

బడ్జెట్ కేటాయింపుల్లోనూ కోతే


అవసరమైన దాని కంటే బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉన్నాయని, ఆ కేటాయింపులను కూడా సరిగా ఉపయోగించడం లేదని అంటున్నాయి. 2023-24లో ప్రభుత్వం ఈ పథకానికి రూ.7,200 కోట్లు కేటాయించినా ఆ తర్వాత దానిని రూ.6,800 కోట్లకు సవరించింది. 2022-23లో ఈ పథకానికి బడ్జెట్‌లో కేటాయించింది రూ.6,412 కోట్లు. కానీ తొమ్మిది నెలల్లో విడుదల చేసింది కేవలం 18 శాతం మాత్రమే. కేరళలో గత ఆరు నెలల కాలంలో 42 ఆస్పత్రులు ఈ పథకం నుంచి వైదొలిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

అన్ని రాష్ట్రాలలోనూ ఇంతే...



ఇది ఒక్క గుజరాత్ ఆస్పత్రుల సమస్యే కాదు. ఈ పథకం కింద రోగులకు చికిత్స అందజేస్తున్న ఇతర రాష్ట్రాలలోని ఆస్పత్రులు కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. హర్యానాలో 983 ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్య సేవలు అందజేస్తున్నాయి. ఈ నెల 15 లోగా బకాయిలు చెల్లించకపోతే చికిత్సలు ఆపేస్తామని అవి హెచ్చరించాయి. రాష్ట్రంలోని ఆస్పత్రులకు రూ.200 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. కేరళలోని ఆస్పత్రులు ఓ అడుగు ముందుకు వేసి హైకోర్టును ఆశ్రయించాయి. తమిళనాడులోని ఆస్పత్రులకు ఈ పథకం కింద బకాయిలు పెరిగిపోతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.5,781.48 కోట్ల ఎన్‌ఐఐ నమోదయ్యింది. అయినప్పటికీ లాభాలు పెరగడం విశేషం. 2022 మార్చి నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 19.14 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే మార్చి నాటికి 22.37 శాతం ఎన్‌పీఏలు చోటు చేసుకున్నాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.36,21 కోట్ల నుంచి రూ.34,115 కోట్లకు తగ్గాయి.

క్లెయిముల తిరస్కరణ... పరిష్కారంలో జాప్యం



2021 నుంచి ప్రధానంగా రెండు సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆస్పత్రి యాజమాన్యాలు చెబుతున్నాయి. క్లెయిముల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, అనేక క్లెయిములను తిరస్కరిస్తున్నారని లేదా చెల్లింపుల్లో కోత విధిస్తున్నారని అవి వివరించాయి. శస్త్ర చికిత్సలు చేసిన పదిహేను రోజుల్లోగా నిధులు విడుదల కావాల్సి ఉండగా గుజరాత్ ఆస్పత్రులకు కేవలం 5 శాతం మాత్రమే రీయంబర్స్‌మెంట్ వస్తోంది. ఇన్సూరెన్స్ కంపెనీలు చిన్న చిన్న కారణాలు చూపుతూ క్లెయిములను తిరస్కరిస్తున్నాయి. తొలుత శస్త్రచికిత్సకు అనుమతి ఇచ్చి తీరా చేసిన తర్వాత చెల్లింపుల్లో కోత పెడుతున్నాయి.

తగ్గిపోతున్న రీయింబర్స్‌మెంట్

గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రీయింబర్స్‌మెంట్ సొమ్ము తగ్గిపోతోంది. మరోవైపు డయాలసిస్ యంత్రాల నిర్వహణ వ్యయం, వైద్య పరికరాల ఖర్చు, సిబ్బంది జీతాలు మాత్రం యధావిధిగానే ఉంటున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఆస్పత్రి విలవిలలాడుతోంది. ఫిబ్రవరి 26వ తేదీ వరకూ కేంద్రం నుండి ఈ ఆస్పత్రికి రూ.3.4 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. వంద మంది రోగులపై ఖర్చు చేస్తుంటే 30 మంది రోగుల బిల్లులు మాత్రమే వస్తున్నాయని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఈ పథకం కింద వైద్య సేవలు అందజేస్తున్న అన్ని ఆస్పత్రుల పరిస్థితి ఇలాగే ఉంది. ఒక్క గుజరాత్‌లోని ఆస్పత్రులకే 2021 నుండి 2023 జూలై వరకూ రూ.300 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుండి నిధులు అందకపోవడంతో ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులకు చికిత్సలు నిలిపివేస్తున్నాయి.

గుజరాత్‌లోని 300 బాధిత ఆస్పత్రులు గత సంవత్సరం ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. పెండింగ్ నిధులను రాబట్టుకునేందుకు ఉమ్మడిగా కృషి చేస్తున్నాయి. ఇప్పటికే అనేక ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్య సేవలను నిలిపివేశాయి. చెల్లింపులలో జాప్యం, క్లెయిముల తిరస్కరణ కారణంగా ఆస్పత్రులు దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందని ఓ వైద్యశాల నిర్వాహకుడు వాపోయారు.



ఉపాధి కల్పించి ఆదుకోవాలి..

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా
- కార్మికులు.. పోలీసులకు మధ్య వాగ్వాదం
- నాయకుల అరెస్టు, స్టేషన్‌కు తరలింపు
- స్టేషన్ వద్ద కార్మికుల నిరసన
- 14 నుంచి నిరాహార దీక్షల ప్రకటన

సిరిసిల్లలో రోడ్డెక్కిన పవర్‌లూమ్ కార్మికులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

నేతన్నలకు పని కల్పించాలని, తక్షణమే ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని నేత కార్మికులు సోమవారం రోడ్డెక్కారు. పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. కొన్ని నెలల నుంచి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి లేక పవర్‌లూమ్ కార్మికులు, ఆసాములు, వైపని, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు, జాపర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆకలితో అలమటిస్తున్నారన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే గతంలో మాదిరిగా నేతన్నల ఆత్మహత్యలకు దారి తీసే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందని.. వాటికి సంబంధించిన బకాయిలు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. కేటీఆర్‌పై కోపంతో నేత కార్మికులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.

బతుకమ్మ చీరలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే యాజమాన్యాలతో చర్చలు జరిపి ఉపాధి కల్పించేందుకు చర్యలు చూపాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ధర్నా విరమించాలని కోరగా.. కలెక్టర్ వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కార్మికులకు పోలీసులకు మధ్య వాగ్వాదం నెలకొంది. చివరకు కూరపాటి రమేష్, మూషం రమేష్‌ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాంతో కోపోద్రిక్తులైన నేత కార్మికులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ అన్నారు. అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరని, ఈ నెల 14నుంచి నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎలిగేటి రాజశేఖర్, అన్నల్దాస్ గణేష్, తంగళ్ళపల్లి ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనె పరశురాములు, పవర్లూమ్ నాయకులు నక్క దేవదాస్, గుండు రమేష్, వార్పిన్ యూనియన్ నాయకులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, వైపని యూనియన్ నాయకులు కుమ్మరికుంట కిషన్, ఆడెపు సంపత్, శ్రీనివాస్, అశోక్, కుడిక్యాల కనకయ్య, మోర తిరుపతి, మల్లేశం, సురేష్, చంద్రకాంత్, శేఖర్, రాజమల్లు, సదానందం, రవీందర్, వేణు, రాజు, సంపత్, సతీష్ పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

బిజినెస్

మార్కెట్లకు 'సుప్రీం' భయాలు

- సెన్సెక్స్ 617 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల పైగా సంపద ఆవిరి
- ఎస్‌బీఐ షేర్లకు ఎన్నికల బాండ్ల దెబ్బ



ముంబయి : ఎన్నికల బాండ్ల గుట్టు విప్పాల్సిందేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. ఎన్నికల బాండ్లతో బీజేపీ భారీగా లబ్ధి పొందిందని ఇప్పటికే అనేక రిపోర్టులు స్పష్టం చేయగా.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం వాటి పూర్తి వివరాలను వెల్లడించాల్సిందేనని పేర్కొనడంతో మోడి సర్కార్ ఇరుకున పడనుందనే అంచనాల్లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఎన్నికల వేళ ఈ పరిణామం ఎటు దారి తీస్తోందోననే అనుమానాలు నెలకొన్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈనేపథ్యంలోనే సోమవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 617 పాయింట్లు పతనమై 73,503కు జారుకుంది. ఉదయం 74,175.93 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే ట్రేడింగ్ అయ్యింది. ఒక దశలో 73,433 కనిష్టాన్ని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 161 పాయింట్ల నష్టంతో 22,333 వద్ద ముగిసింది.

అమ్మకాల దెబ్బకు బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.15 లక్షల కోట్లు హరించుకుపోయి.. రూ.389.66 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ఆ మొత్తం మదుపర్లు నష్టపోయినట్లయ్యింది. 3,039 స్టాక్స్ పతనాన్ని చవి చూడగా.. 924 స్టాక్స్ రాణించగా.. మరో 118 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి. దాదాపు పెద్ద సూచీలన్నీ నష్టాలను చవి చూశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఎస్‌బీఐ, హెచ్‌యుఎల్, టాటా కన్స్యూమర్, బజాజ్ ఆటో, ఇండుస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ షేర్లు 1-3 శాతం పతనమయ్యాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, చమురు, బ్యాంకింగ్, ఐటీ, రియల్టీ, లోహ, విద్యుత్ రంగాల సూచీలు 0.5 నుంచి 1 శాతం మేర నష్టపోయాయి.

ఎస్‌బిఐ షేర్ విలవిల..

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బిఐ అదనపు సమయం కోరడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ.. మార్చి 12 కల్లా (నేడు) సమాచారం ఇవ్వాలని ఆదేశించడంతో ఆ బ్యాంక్ సూచీలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఉదయం నుంచి ఎస్‌బిఐ షేర్లు పతనం వైపు పయనించాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 2శాతం నష్టపోగా.. తుదకు 1.86 శాతం పతనంతో రూ.773.50కు పడిపోయింది. ఇంట్రాడేలో రూ.770.70 కనిష్టాన్ని తాకింది. ఫిబ్రవరి 12 తర్వాత ఒకేరోజు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి.

సెబీతో స్మాల్ క్యాప్ సూచీలపై ఒత్తిడి..

స్మాల్ క్యాప్ సూచీల కృత్రిమ ధర పెంపునపై దృష్టి సారిస్తున్నట్లు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్మెన్ మాదాబి పూరి బుచ్ పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల నిబంధనలను మార్చనున్నట్లు ప్రకటించారు. దీంతో బిఎస్‌ఇలో స్మాల్ క్యాప్ సూచీ 2 శాతం, మిడ్ క్యాప్ సూచీ 0.24 శాతం చొప్పున పడిపోయాయి.

సౌండ్‌బార్ విభాగంలోకి అర్బన్ కంపెనీ



హైదరాబాద్ : దేశీయ సాంకేతికత బ్రాండ్ అయిన అర్బన్ కొత్తగా హార్మోనిక్ సిరీస్ సౌండ్‌బార్‌ల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. వివిధ విభాగాలను దృష్టిలో ఉంచుకుని బ్రాండ్ హార్మోనిక్ 2240 విత్ డాల్బీ సరౌండ్ సౌండ్ అండ్ హార్మోనిక్ 1120 డీప్ బాస్ హెచ్‌డీ సౌండ్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. వీటి ప్రారంభ ధరను రూ.9,999గా నిర్ణయించింది. ఇవి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ లభ్యమవుతాయని అర్బన్ సహ వ్యవస్థాపకుడు ఆశిష్ కుంభట్ తెలిపారు.

పొరుగు దేశాలతో రూపాయల్లో వాణిజ్యం

- మంత్రి పీయూశ్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌తో అనేక దేశాలు రూపాయాల్లో వాణిజ్యం నెరవేర్చడానికి ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, శ్రీలంక సహా పలు గల్ఫ్ దేశాలు ఇందుకు ముందుకు వచ్చాయని.. వాటితో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో లావా దేవీల వ్యయాలను తగ్గించు కునేందుకు ప్రయత్నిస్తున్నా యన్నారు. సింగ పూర్ ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. దేశీయ కరెన్సీలతో వ్యాపారం వల్ల ఉన్న ప్రయోజనాలు ఇతర దేశాలకు క్రమంగా తెలుస్తోందన్నారు. డాలర్ల కొరత ఉన్న దేశాలకూ ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

డ్రైవర్లకు కాస్ట్రోల్ నైపుణ్యాల శిక్షణ

హైదరాబాద్ : ప్రముఖ చమురు ఉత్పత్తుల కంపెనీ కాస్ట్రోల్ ట్రక్ డ్రైవర్లకు సాధికారత కల్పించేందుకు 'ప్రగతి కీ పాఠశాల' పేరుతో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు సాగిన ఈ క్యాంప్‌లో 350కి పైగా డ్రైవర్లకు నైపుణ్యాల పెంపునపై అవగాహన కల్పించినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా 10,000 మందికి పైగా ట్రక్కర్లకు నైపుణ్యాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

మహిళలకు 200 డ్రోన్ల పంపిణీ

- కోరమండల్ ఇంటర్నేషనల్ వెల్లడి

హైదరాబాద్ : వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి, మహిళా స్వయం సహాయక బృందాలకు 200 డ్రోన్‌లను అందించినట్లు కోరమాండల్ ఇంటర్నేషనల్ తెలిపింది. రంగారెడ్డి జిల్లాలోని మాణిక్యమ్మగూడ, గుంటూరుతో సహా దేశంలోని 11 ప్రాంతాలలో రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ అందించిన 200 డ్రోన్‌లతో సహా 1,000 డ్రోన్‌లను వివిధ ఎస్‌హెచ్‌జిల సభ్యులకు ప్రధాని మోడి వర్చ్యువల్‌గా అందజేశారని ఆ సంస్థ పేర్కొంది. కోరమాండల్ సరఫరా చేసిన డ్రోన్‌లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉపయోగిస్తారని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ అరుణ్ అళగప్పన్ తెలిపారు.

చైనా ఆధునీకరణపైనే దృష్టి!



బీజింగ్ : చైనా ఆధునీకరణపైనే పూర్తిగా దృష్టి సారిస్తూ చైనా అత్యున్నత రాజకీయ సలహా సంప్రదింపుల సంస్థ చైనా పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) 14వ జాతీయ కమిటీ సమావేశాలు ఆదివారంతో ఇక్కడ ముగిశాయి. రెండు సెషన్లుగా జరిగిన ఈ సమావేశాల్లో రాజకీయ సలహాదారులు పలు అంశాలపై సమర్ధవంతమైన, ఆచరణాత్మకమైన చర్చలు జరిపారు. దీర్ఘకాలంగా నలుగుతున్న సమస్యలతో పాటు కొత్తగా ముందుకొస్తున్న సమస్యలపైనా వారు దృష్టి సారించారు. అలాగే కృత్రిమ మేధస్సు (ఎఐ) అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్ళడానికి వ్యూహ రచనతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై వారు చర్చించారు. జాతీయాభివృద్ధి నుండి జీవనోపాధి వరకు అన్ని అంశాలు ఈ సమావేశాల్లో చర్చకు వచ్చాయి. ఈ సవాళ్ళన్నీ సమర్ధవంతంగా ఎదుర్కొని, అధిగమించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సిపిపిసిసి సంకల్పించింది.

ఈ సంస్థ జాతీయ కమిటీ చైర్మన్ వాంగ్ హ్యునింగ్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) నేతృత్వంలో చైనా ఆధునీకరణకు సంబంధించి మెరుగైన అవగాహన కలిగిఉండాలన్నారు. వివిధ కోణాల్లో చైనా ఆధునీకరణను మరింత ముందుకు తీసుకెళ్ళడంపై ఈ ఏడాది అనేక ప్రతిపాదనలు వచ్చాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ)ను అభివృద్ధిపరచడం వంటి కొత్త అంశాలతో పాటూ దీర్ఘకాలంగా వున్న సమస్యలు – జననాల రేటును పెంచడం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పేద ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి అంశాలపై కూడా సవివరంగా చర్చలు జరిగాయి. కొత్త వాతావరణంలో ఈ పాత సమస్యలకు పరిష్కారాలు ఏ విధంగా అందించాలనే అంశంపై రాజకీయ సలహాదారుల నుండి అనేక సూచనలు, ప్రతిపాదనలు అందాయి.

రాజకీయ తీర్మానం

తైవాన్ సమస్యను పరిష్కరించేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యూహాన్ని అధ్యయనం చేసి అమలు చేయాల్సిందిగా సిపిపిసిసి సభ్యులను రాజకీయ తీర్మానం కోరింది. ఆదివారం ఈ తీర్మానాన్ని ఆమోదించారు. మాతృభూమితో తైవాన్ శాంతియుత పునరేకీకరణ తప్పనిసరిగా జరిగి తీరుతుందని ఆ తీర్మానం ఉద్ఘాటించింది. తైవాన్ జలసంధి వ్యాప్తంగా వివిధ రంగాల్లో అభివృద్ధి కోసం అన్ని దేశభక్తియుత శక్తులను ఏకతాటిపైకి తీసుకురావాలని కోరింది.

మల్టీజోన్-2లో ప్రధానోపాధ్యాయుల పదోన్నతులపై స్టే ఎత్తివేత

- హైకోర్టు ఉత్తర్వులు
- వెంటనే షెడ్యూల్ ప్రకటించాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మల్టీజోన్-2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్‌ఎం) పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు సోమవారం ఎత్తేసింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. మల్టీజోన్-2 పరిధిలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు, మల్టీజోన్-1 పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను చేపట్టిన విషయం తెలిసిందే. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోగా జీహెచ్‌ఎం పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయడానికి వెంటనే షెడ్యూల్‌ను ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశానికి సంబంధించి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించామని గుర్తు చేశారు. హైకోర్టు ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని తెలిపారు. వెంటనే పదోన్నతులను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

పదోన్నతులు చేపట్టాలి : ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

మల్టీజోన్-2 పరిధిలో పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు ఎత్తేయడం పట్ల ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హర్షం ప్రకటించారు. ఈ తీర్పునకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని సోమవారం తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావుతో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏండ్ల నుంచి సేవలు అందించి పదోన్నతి పొందకుండా ఉద్యోగ విరమణ ఈనెల నుంచే పొందుతున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశమున్నందున వెంటనే పదోన్నతులు చేపట్టి వారికి న్యాయం చేయాలని కోరారు.

కేటీఆర్ పిచ్చిగా మాట్లాడితే... ఎర్రగడ్డ ఆస్పత్రికే

- ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పిచ్చిగా మాట్లాడితే మాజీ మంత్రి కేటీఆర్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరడం ఖాయమని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్ పదేండ్లలో ఏమి చేశారో ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ప్రజా నాయకుడు, ప్రజలకు సేవ చేసేందుకు ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. సీఎంపై అనవసరంగా మాట్లాడితే హైదరాబాద్‌లో తిరగనియ్యబోమని హెచ్చరించారు.

రేవంత్ ను అంటే...కేసీఆర్ ను తిట్టినట్టే
-డాక్టర్ మల్లు రవి

పార్టీలు మారిన సీఎం రేవంత్ రెడ్డి అంటూ కేటీఆర్ విమర్శస్తుంటే అది మాజీ సీఎం కేసీఆర్‌ను దూషించినట్టుగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందని విమర్శించారు. రేవంత్‌ను విమర్శించే ముందు కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలు పెట్టారు? ఎక్కడ మంత్రి అయ్యారు? ఎక్కడ డిప్యూటీ స్పీకర్ అయ్యారు? అనేవాటికి కేటిఆర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ సంఘాలు వద్దంటే, నేడు రేవంత్ రెడ్డి గుర్తింపు పొందిన సంఘాలతో మాట్లాడి పీఆర్సీ, ఉద్యోగుల హక్కుల విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారని కొనియాడారు.

భాష మార్చుకోకుంటే చెప్పుదెబ్బలు
-మేడిపల్లి సత్యం

మాజీ మంత్రి కేటీఆర్ భాష మార్చుకోకపోతే చెప్పుదెబ్బలు తప్పవని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మగాడైతే పార్లమెంటు ఎన్నికల్లో సిరిసిల్ల మెజారిటీ తెచ్చుకుని చూపించాలని సవాల్ విసిరారు. జూన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనని తెలిపారు.

మతి భ్రమించిన కేటీఆర్
-ఎమ్మెల్యే వెద్మ పటేల్

ఆరు గ్యారంటీలు అమలవుతుంటే ఓర్వలేక మతిభ్రమించి కేటీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వెద్మ పటేల్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాటలను వెనక్కి తీసుకోవాలని లేకపోతే ఆయన్ను ప్రజలు తిరగనియ్యరని హెచ్చరించారు.

అభివృద్ధి అంటే పులివెందుల, కుప్పంలా సిద్దిపేట గౌరవాన్ని నిలబెట్టుకున్నాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట

అభివద్ధి అంటే పులివెందుల, కుప్పంలా సిద్దిపేట గౌరవాన్ని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలో 5లక్షలతో నిర్మించే ఏకలవ్య మిత్ర మండలి భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ సోమవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా కోటి రూపాయలతో ఏకలవ్య భవన్‌ను నిర్మించుకున్నామని అన్నారు.

గవర్నర్ తీరుతోనే సత్యనారాయణకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణకు కూడా ఎమ్మెల్సీ అవకాశం కల్పించామని, కానీ గవర్నర్ ఆమోదం రాలేదని హరీశ్‌రావు అన్నారు. ఆమోదం ఇవ్వక పోవడాన్ని హైకోర్టు కరెక్ట్ కాదు అని తీర్పు కూడా ఇచ్చిందన్నారు. గవర్నర్ తీరుతోనే సత్యనారాయణకు అన్యాయం జరిగిందన్నారు. భవిష్యత్‌లో అన్ని విధాలా సత్యనారాయణకు సహాయ సహకారాలు అందిస్తామని, ఏకలవ్వ భవన నిర్మాణానికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఏకలవ్య మిత్రమండలి అధ్యక్షులు యాదయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింలు, కోశాధికారి యాదగిరి, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మల్లేశం, కనకయ్య, సహాయ కార్యదర్శి ఎల్లయ్య, సలహాదారు నిమ్మ అశోక్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'టెట్'


- ఆ తర్వాతే డీఎస్సీ రాతపరీక్షలు
- విద్యాశాఖ సమాలోచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం త్వరలోనే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించే అవకాశమున్నది. ఇకనుంచి ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్, డిసెంబర్ నెలల్లో ఆ పరీక్షలను నిర్వహించనుంది. ఇప్పుడు జూన్ లేదా జులైలో టెట్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ఎందుకంటే డీఎడ్ చివరి సంవత్సరం, బీఎడ్ చదువుతున్న విద్యార్థులూ టెట్ రాసేందుకు అవకాశం కల్పించాలని సమాలోచన చేస్తున్నారు. ఇందుకనుగుణంగా షెడ్యూల్‌ను రూపొందించే అవకాశమున్నది. అయితే 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గతనెల 29న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. వాటి సమర్పణకు వచ్చేనెల మూడో తేదీ వరకు గడువున్నది. అయితే రాతపరీక్షల తేదీలను ఇంకా ప్రకటించలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం టెట్ తర్వాతే డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నట్టు తెలిసింది. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే అవసరమైన మేరకు విద్యావాలంటీర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

సాగు చేస్తున్న భూమి ఇతరులకు ఇవ్వం

- అటవీ అధికారులను అడ్డుకున్న ఆదివాసులు



నవతెలంగాణ - కడెం

తాము చదును చేసి సాగు చేసుకుంటున్న భూమిని ఇతరులకు ఇవ్వడాన్ని ఆదివాసీ గిరిజనులు వ్యతిరేకించారు. కొలతలకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ శివారులోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల అటవీ భూమిలో పునరా వాసుల కోసం సోమవారం రెవెన్యూ అధికారులు కొలతలు చేపట్టేందుకు వెళ్లారు. అయితే, నచ్చన్‌ఎల్లాపూర్ ఆదివాసీ గిరిజనులు అడ్డుకున్నారు. ఖానాపూర్ డివిజనల్ అటవీ శాఖ అధికారి భవాని శంకర్, సీఐ మోహన్ గిరిజనులతో గంటల తరబడి చర్చలు జరిపారు. గతంలో ఆ భూమిని తాము చదును చేసుకొని వ్యవసాయం సాగు చేశామని, తమపై కేసులు కూడా నమోదయ్యాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూమిని తమకే కేటాయిం చాలని డిమాండ్ చేశారు. కాగా, తాత్కాలికంగా కొలతలు వేసేందుకు గిరి జనులు ఒప్పుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాథోడ్ సుదర్శన్, తహసీల్దార్ సుజాత, ఎఫ్ఆర్‌ఓలు అనిత, వినాయక్, రామకృష్ణ రావ్, డీఆర్వో సిద్ధార్థ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్రియేటర్స్ అవార్డ్సుకు గుండోజు వెన్నెల హాజరు

నవతెలంగాణ - హైదరాబాద్

కేంద్ర ఐటి, కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన నేషనల్ క్రియేటర్స్ అవార్డ్స్ కార్యక్రమానికి తెలంగాణ నుంచి గుండోజు వెన్నెల హాజరయ్యారు. మహిళ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో 23 మంది యువతులకు నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ఆయన ప్రదానం చేశారు. యువతలో సృజన శీలతను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఐటి శాఖ ఏర్పాటు చేసిన ఈ అవార్డుల కార్యాక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన డిజిటల్ క్రియేటివిటీలో అద్భుత ప్రతిభ కలిగిన కొంతమంది యువతులకు ప్రత్యేక ఆహ్వానాలను పంపారు. దీనికి తెలంగాణ నుంచి హైదరాబాద్ నగరానికి చెందిన బిటెక్, ఢిల్లీ యూనివర్శిటీలో లా పూర్తి చేసిన యువతి గుండోజు వెన్నెల హాజర య్యారు. రాబోయే కాలంలో తాను ఎంపిక చేసుకున్న విభాగంలో అద్భుత మైన డిజిటల్ కంటెంట్‌ని క్రియేట్ చేసి విశ్వ వేదికపై ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటానని వెన్నెల విశ్వాసం వ్యక్తం చేశారు. వచ్చే 2025లో నేషనల్ క్రియేటర్స్ అవార్డుల జాబితాలో తమ కుమార్తె పేరు ఉంటుందని వెన్నెల తల్లి దండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.



పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వండి

- మాజీ మంత్రి, హరీశ్ రావు ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పారిశుధ్య పంచాయతీ సిబ్బందికి వెంటనే జీతాలు అందించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్(ట్విట్టర్) వేదికగా సోమవారం ఆయన స్పందించారు.

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు ఇతర ముఖ్యమైన విధుల్లో శ్రమిస్తున్న 60 వేలకు పైగా ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద వర్గాలకు చెందిన వారి కష్టాలను అర్థం చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 8 నుంచి 'ఎస్‌ఏ-2' పరీక్షలు

- టైంటేబుల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) పరీక్షలు వచ్చేనెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 18 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి సోమవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు జరుగుతాయని వివరించారు.

ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.45 గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి వచ్చేనెల 23న ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదేరోజు తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహిస్తామనీ, మార్కుల రికార్డులపై తల్లిదండ్రుల సంతకాలను తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల డీఈవోలు ఎస్‌ఏ-2 పరీక్షల నిర్వహణపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

15న రాష్ట్రపతి రాక

- సీఎస్ సమీక్ష

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 15వ తేదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రానికి రానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఇతర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 16వ తేదీ భారత ఉపరాష్ట్రపతి కూడా రాష్ట్రానికి వస్తున్నారనీ, దానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ జాగ్రత్తగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు ఆదేశించారు. విమానాశ్రయం, రాజ్‌భవన్‌తో పాటు ఇతర వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు, సహాయక సిబ్బంది, మహిళా వైద్యులు సేవల్ని అందుబాటులో ఉంచాలని చెప్పారు. రాష్ట్రపతి కాన్వాయ్ వెళ్లే మార్గాల్లో రోడ్ల మరమ్మతుల్ని కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో చేపట్టాలని చెప్పారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, హెూంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్‌రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ హీట్

- నేడు మూడు ప్రధాన పార్టీల బహిరంగ సభలు
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో భానుడి వేడే కాదు, రాజకీయ వేడి కూడా తారాస్థాయికి చేరుతున్నది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు పోటాపోటీగా బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. మంగళవారం కాంగ్రెస్ నేతృత్వంలో పరేడ్‌గ్రౌండ్‌లో లక్షమంది మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు అందించే స్కీంను సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడే ప్రకటిస్తారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. దీనిలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఇక ఎల్బీ స్టేడియంలో బీజేపీ పోలింగ్ బూత్ ఏజెంట్లకు కేంద్రమంత్రి అమిత్ షా లోక్‌సభ ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈనెల 15న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని రాజకీయపార్టీలు భావిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఎక్కడా వెనకబడకూడదని ఎవరికి వారు ప్రజలకు దగ్గరయ్యేలా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఎలక్షన్ నోటిఫికేషన్ రావడమే తరువాయి అన్నట్టు అన్ని రాజకీయపార్టీలు యుద్ధానికి సిద్ధమని ప్రకటిస్తున్నాయి. యథాప్రకారం ఓటర్ల గుంభనంగా అన్నీ గమనిస్తూ, ఓటు హక్కు వినియోగంపై దృష్టి సారిస్తున్నారు.

నల్గొండ, చేవెళ్ల ఎంపీ అభ్యర్థుల కోసం కేసీఆర్ కసరత్తు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

లోక్‌సభ స్థానాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆపార్టీ ముఖ్యనేతలతో జరుపుతున్న సమావేశాలు కొనసాగుతున్నాయి. సోమవారంనాడాయన తన నివాసంలో నల్గొండ, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ నేతలతో భేటీ అయ్యారు. నల్గొండ అభ్యర్థిపై స్పష్టత రాలేదు. పార్టీ నేతల అభిప్రాయాల్ని కేసీఆర్ తెలుసుకున్నారు. చేవెళ్ళ లోక్‌సభ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డినే ఈసారి కూడా ఖరారు చేసినట్టు సమాచారం. ఈ మేరకు సమావేశంలో ఆయన ప్రకటన చేశారని తెలిసింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చేవెళ్ళ నుంచి పోటీకి రంజిత్‌రెడ్డి ఆసక్తి చూపలేదని సమాచారం. దీనితో తెరపైకి పటోళ్ల కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్, కాసాని వీరేశ్ ముదిరాజ్ పేర్లను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. మంగళవారం చేవెళ్ల అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

స్కూళ్లు, కాలేజీలకు ఉచిత విద్యుత్ పట్ల టీజీజేఎల్ఏ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వాడడానికి మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లో స్వీపర్ పోస్టులను మంజూరు చేయాలంటూ గతంలో సీఎంను కోరామని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వ సూళ్లు, కాలేజీల్లో స్వీపర్ పోస్టులను ఏర్పాటు చేస్తామంటూ ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రోజువారీ కార్యకలాపాలకు నిధులను మంజూరు చేయాలని కోరారు.

భాషాపండితులకు ప్రత్యేక స్కేళ్లు ఇవ్వండి : ఆర్‌యూపీపీటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని భాషాపండితులకు ప్రత్యేక స్కేళ్లు ప్రతిపాదించాలని ఆర్‌యూపీపీటీ కోరింది. ఈ మేరకు పీఆర్సీ కమిటీ చైర్మెన్ శివశంకర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి క్రాంతి కృష్ణ కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు.

హైకోర్టు తీర్పును అమలు చేయండి

- గవర్నర్‌కు దాసోజు, కుర్ర వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి తమకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణ గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కావడానికి రాజ్యాంగ పరంగా అన్ని అర్హతలున్నా అనివార్య కారణాల వల్ల తిరస్కరించారని చెప్పారు. అనంతరం తాము కోర్టు మెట్లెక్కడంతో తమకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేసి పేద కులాలకు చెందిన తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి : కొండా సురేఖ

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు అటవీ, పర్యాటరణ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలు, నమాజ్ జీవితంలో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, సానుకూల దృక్పథాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. అల్లా దీవెనలతో అందరి జీవితాల్లో వెలుగు నిండాలని ఆమె ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తున్నదని పేర్కొన్నారు.